జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 03, ఏప్రిల్ 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

టీటీడీ సేవలు, సౌకర్యాల్లో 100 శాతం మార్పు కనిపించాలి

- తిరుమలలో సేవలు బాగుంటే ప్రభుత్వానికీ మంచి పేరు వస్తుంది
- పనుల అభివృద్ధి పనుల పేరుతో డబ్బులు ఇష్టారీతిన ఖర్చు పెట్టొద్దు
- టీటీడీలో మనం ధర్మకర్తలం, నిమిత్తమాత్రులం
- వచ్చే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా టీటీడీని తీర్చిదిద్దాలి
- అనుభవజ్ఞుల పేరుతో అవసరం లేకపోయినా పాతవారిని ఇంకా కొనసాగించ వద్దు
- త్వరలో జేఈవో, సివిఎస్‌వో, ఎస్వీబీసీ చైర్మన్, బర్డ్ డైరెక్టర్‌ల నియామకం
- ప్రక్షాళన వందశాతం జరగాల్సిందే...ఏ స్థాయిలోనూ మినహాయింపులు లేవు
- అలిపిరిలో భక్తుల కోసం బేస్‌క్యాంప్ నిర్మాణం...60 అనుబంధ దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- ప్రతిసేవపై భక్తుల ఫీడ్‌బ్యాక్...త్వరలో వాట్సాప్ సేవలు
- సచివాలయంలో నిర్వహించిన తిరుమల తిరుపతి దేవస్థానంపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి,మహానాడు

తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు అందించే సేవలు, సౌకర్యాల్లో 100 శాతం మార్పు కనిపించాలని, భక్తుల మనోభావాలకు, ఆలయ పవిత్రతకు పెద్దపీట వేసేలా ప్రతి కార్యక్రమం, నిర్ణయం ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానంపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సమగ్రంగా సమీక్ష చేశారు.

భక్తులకు అందించే సౌకర్యాలు మెరుగుపరిచేందుకు గత 9 నెలల కాలంలో తీసుకున్న చర్యలపై టీటీడీ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో భవిష్యత్‌లో చేపట్టే చర్యలపై సీఎం సమీక్షించారు. దర్శనాలు, వసతితో పాటు వివిధ సేవలపై భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలపైనా సమావేశంలో చర్చించారు.

బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సమయాలతో పాటు చేపట్టిన చర్యలు,వాటి ఫలితాలపై అధికారులు నివేదించారు.

9 నెలల కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదంలో తీసుకువచ్చిన మార్పులపై అధికారులు వివరించారు. గ్యాలరీల్లో సౌకర్యాల పెంపు, మరింత మంది భక్తులకు అవకాశం కల్పించేలా మాధవీధులలో ఏర్పాట్లు, అలిపిరిలో భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం, శ్రీ పద్మావతీ అమ్మవారి దేవాలయం అభివృద్ధి ప్రణాళిక, అమరావతిలోని శ్రీవారి దేవాలయం అభివృద్ధి పనులు వంటి అంశాలపై సమీక్షలో సుదీర్ఘంగా చర్చించారు. తిరుమల ప్రతిష్ట పెంచడం, తిరుమల క్షేత్రాన్ని భక్తులకు మరింత దగ్గర చేయడం, సులభమైన, సౌకర్యవంతమైన సేవలకు సంబంధించి సీఎం పలు సూచనలు చేశారు.

అవసరమైన పనులే చేయండి

ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ "తిరుమల దేవాలయంలో సేవలు మిగతా.. 2లో

అన్న హత్య గురించి అడగవేందత్తా?!

- పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణకు షర్మిల మేనత్త విమల డిమాండ్
- సొంత అన్న వివేకా హత్యపై ఇప్పటిదాకా మాట్లాడని విమల
- అన్న హత్యపై విచారణ ఏమైందని నిలదీయని విమల
- వివేకాది హత్య అని నిర్ధారణ అయినా కేసు ఆలస్యం
- నత్తలతో పోటీ పడుతున్న వివేకా హత్య కేసు
- పాస్టర్ ప్రవీణ్‌ది ప్రమాదమంటున్న పోలీసులు
- అయినా ప్రవీణ్ మృతిపై విచారణకు విమల డిమాండ్
- షర్మిల, సునీత ప్రశ్నలకు జవాబు లేని మేనత్త విమల
- మేనత్త విమల తీరుపై వైఎస్ అభిమానుల కన్నెర్ర

(మార్తి సుబ్రహ్మణ్యం)

రక్తం పంచుకుపుట్టిన సొంత అన్న గొడ్డలి పోటుకు గురయి ఏళ్లవుతోంది. ముందు అన్న మరణాన్ని గుండెపోటు అన్నారు. రక్తవిరోచనాలన్నారు. చివరాఖరకు గొడ్డలిపోటుగా తేల్చారు. ఇది ఏళ్ల తరబడి తెలుగు టీవీ సీరియల్ జీడిపాకంలా సాగుతూనే ఉంది.నానదు. తేలదు. సారీ.. తేల్చరు!

అటు హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా ఈ కేసును ఎందుకు ఇంతకాలం నాన్చుతున్నారని సీబీఐని చీవాట్లు పెట్టింది. అయినా నో రెస్పాన్స్. పాపం ఇద్దరి ఆడకూతుళ్లు ఆ హత్య కేసు తేల్చాలని కాళ్లకు బలపాలు కట్టుకుని తిరుగుతున్నారు. నిందితులను అరెస్టు చేయాలని ఆర్తిగా అర్థిస్తున్నారు. అయినా నో యూజ్.

ఇప్పుడు ఆ ఇంటికి ఏకైక పెద్దదిక్కు ఇద్దరు అన్నల ముద్దల చెల్లెలయిన మేనత్తమాత్రమే. ఆ మేనత్తేమో గొడ్డలిపోటు వైపున్నారు. పోనీ సొంత అన్నను చంపిన వారిని అరెస్టు చేయమని డిమాండ్ చేస్తారా అంటే లేదు. పైగా అసలు హత్యో కాదో తెలియని, అది ప్రమాదవశాత్తూ జరిగిన మరణమేనని పోలీసులు చెప్పినా పట్టించుకోకుండా.. పాస్టరు మరణంపై విచారణకు డిమాండ్ చేస్తున్న ఈ మేనత్తపై మేనకోడళ్లు చిర్రుబుర్రు లాడుతున్నారు.

ఏంది అత్తా ఇది? సొంత అన్న చంపిన వాళ్ల గురించి మాట్లాడవా? పాస్టరు మరణంపై విచారణ అడుగుతావా? ఏం.. నీ అన్నను చంపిన వాళ్లకు పట్టు కోవద్దా అత్తా? అన్నది ఇప్పుడు మేనకోడళ్ల ప్రశ్న. వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై విచారణ కోరిన తమ మేనత్త వైఎస్ విమలారెడ్డిని.. ఆమె మేనకోడళ్లయిన వైఎస్ షర్మిలారెడ్డి, డాక్టర్ సునీత.. వైఎస్ అభిమానులతో కలసి జమిలిగా సంధిస్తున్న ప్రశ్నలివి!

కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్న దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని రాష్ట్రానికి విడిచిపెట్టి, పులివెందులలో అన్నీ తానై నడిపించిన తమ్ముడు వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురయి ఏళ్లవుతోంది. ఇంతవరకూ కేసు అంగుళం ముందుకు కదిలింది లేదు. కేసు పురోగతి చూసి నత్తలు కూడా నవ్వుకుంటున్నాయి. పాపం.. కూతురు డాక్టర్ సునీత, అన్న బిడ్డ షర్మిలారెడ్డి ఇద్దరూ మిగతా.. 2లో

మహానాడు ఫోకస్

ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నేతలతో కేసీఆర్ భేటీ

10 లో

బీసీ సభకు రాహుల్ రాలేదేం?

4 లో

ఎయిమ్స్ అభివృద్ధే లక్ష్యంగా పెమ్మసాని అడుగులు

4 లో

సల్మాన్‌ఖాన్ సరే.. రేవంత్‌కు ఏ శిక్షవేస్తారు?

- జింకలను హతమారుస్తున్న రేవంత్‌కు ఎన్ని శిక్షలు వేయాలి?
- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్

న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ, నియంతృత్వ పాలనతో రియల్ ఎస్టేట్ మాఫియాను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంకుశ వైఖరిపై బిఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆదేశాల మేరకు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ ఢిల్లీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని కలిసి, రాష్ట్ర ప్రభుత్వ అరాచక పాలన, మిగతా.. 2లో

3 లో

'ప్రకాశం'.. నా హృదయంలో ఉంది.!

- రిలయన్స్ సిబిజి ప్లాంట్లతో 2.5లక్షల మందికి ఉద్యోగావకాశాలు
- తప్పుడు ప్రచారాలు చేస్తే సహించను... రెడ్ బుక్ లోకి ఎక్కిస్తా
- కనిగిరిలో రిలయన్స్ సిబిజి ప్లాంట్‌కు మంత్రి లోకేష్ భూమిపూజ

నా భర్త మృతి విచారణపై నమ్మకం ఉంది

- ఏపీ ప్రభుత్వంపై పూర్తి భరోసా
- మా కుటుంబానికి ప్రభుత్వ అండ ఉంది
- పాస్టర్ ప్రవీణ్ భార్య జెస్సికా, తమ్ముడు కిరణ్ స్పష్టీకరణ
- వీడియో విడుదల చేసిన భార్య, తమ్ముడు
- పాస్టర్ మృతిపై కథలు అల్లడంపై కుటుంబసభ్యుల ఆగ్రహం

అమరావతి,మహానాడు:

ఒక వ్యక్తి మరణిస్తే ఎవరైనా సానుభూతి చూపిస్తారు. కానీ కొందరు తమ రాజకీయ స్వార్థం కోసం ఆ వ్యక్తి కులాన్నో, మతాన్నో అడ్డు పెట్టుకుని విద్వేషాలు రెచ్చగొట్ట డానికి ప్రయత్నించడం దారుణం. పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో పూటకో కథ అల్లుతూ కొన్నిశక్తులు ఇలాగే పనిచేసాయి. ఈ దారుణాన్ని ప్రవీణ్ భార్య జెస్సికా, సోదరుడు కిరణ్ లు ఖండించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న విచారణ పై తమకు మిగతా.. 10లో

మిమ్మల్ని చూస్తుంటే గర్వంగా ఉంది

- మీరు చూపించిన తెగువ,స్ఫూర్తికి మీ అందరికీ హేట్సాఫ్
- 57 చోట్ల ఉపఎన్నికలు జరిగితే 39 చోట్ల వైయస్సార్సీపీ గెలిచింది
- వైఎస్సార్సీపీ కార్యకర్తలు గొప్ప తెగింపుతో గెలిపించారు
- కూటమి ప్రభుత్వ బెదిరింపులు, ప్రలోభాలకు తలొగ్గలేదు
- కూటమి ప్రభుత్వానికి బుద్ధి, జ్ఞానం లేవు
- సంఖ్యా బలం లేకపోయినా పోటీకి దిగారు
- కష్ట సమయంలో కార్యకర్తలు చూపిన నిబద్ధతకు హేట్సాఫ్
- మీ జగన్ మీకు ఎప్పుడూ రుణపడి ఉంటాడు

10 లో

- రాబోయే రోజులు మనవే
- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతోపార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమైన వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్.జగన్

ఎర్ర కోటపై జెండా ఎగురవేస్తాం.. రిజర్వేషన్లు సాధించుకుంటాం..

- జన గణనలో కుల గణనతో రిజర్వేషన్ల పెంపు
- కమండల్ ప్రతినిధి నరేంద్ర మోదీ
- రిజర్వేషన్ల పెంపు తీర్మానంతో దేశానికి దిక్సూచిగా తెలంగాణ
- బీసీ గర్జన సభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

ఢిల్లీ: రిజర్వేషన్లు పెంచాలనే బలహీన వర్గాల కోరిక అసంబద్ధమైన కోరిక కాదు... ధర్మబద్ధమైన కోరిక.. ఆ కోరిక నెరవేర్చేందుకు బీజేపీ ప్రభుత్వం ముందుకు రావాలి.. అలా రాకుంటే ఎర్ర కోటపై జెండా ఎగురవేసి తామే రిజర్వేషన్లను సాధించుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. విద్యా, ఉద్యోగాలతో పాటు చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లులను తొమ్మిది షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ ఢిల్లీలోని మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
2
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 03, ఏప్రిల్ 2025 ||

సల్మాన్‌ఖాన్ సరే..రేవంత్‌కు ఏ శిక్ష వేస్తారు?

మొదటి పేజీ తరువాయి..

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విధ్వంసం, పర్యావరణ నాశనంపై ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినియంతృత్వ ధోరణితో రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, ప్రజా స్వామ్య స్ఫూర్తిని మసకబారుస్తూ, రియల్ ఎస్టేట్ మాఫియాలకు అను కూలంగా నిర్ణయాలు తీసుకుంటూ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతున్నారని తీవ్ర విమర్శలు చేశారు.

యూనివర్సిటీ భూవివాదం.. విద్యా రంగంపై రేవంత్ రెడ్డి దాడి

తెలంగాణలో విద్యా సంస్కరణలను నిరోధిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును సర్వనాశనం చేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చర్యలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల విలువైన భూమిని అక్రమంగా కబ్జా చేసి, దానిని రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతికి అప్పగించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

ఇది ఒక విద్యా సంస్థపై జరిగిన అన్యాయమే కాకుండా, దేశ భవిష్యత్తుకు తూట్లు పొడిచే ప్రయత్నమని పేర్కొన్నారు. ఈ భూమిని రక్షించేందుకు యూనివర్సిటీ యాజమాన్యం గతంలో సుదీర్ఘ న్యాయ పోరాటం చేసినప్పటికీ, ప్రభుత్వం తాజాగా ఈ భూములను కబ్జా చేయడానికి మరో కుట్ర మొదలుపెట్టిందని వివరించారు.

సుప్రీంకోర్టు తీర్పును తుంగలో తొక్కిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు సంబం ధించి, గతంలో సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ, ఆ భూములను తాకట్టు పెట్టి రూ. 20 వేల కోట్ల రుణాన్ని తీసుకోవడం పూర్తిగా అనైతికమని, ఇది విద్యా వ్యవస్థను ధ్వంసం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రలో భాగమని దాసోజు శ్రావణ్ అన్నారు.

పర్యావరణ నాశనం.. నెమళ్ల ఊపిరి తీసేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

ఈ భూముల విషయంలో రాజకీయ స్వార్థంతో ప్రభుత్వం వ్యవహ రిస్తూ, ప్రాంతంలోని పర్యావరణాన్ని సైతం పూర్తిగా నాశనం చేస్తోంది. ఈ ప్రదేశంలో సహజసిద్ధంగా నివసించే భారత జాతీయ పక్షి నెమళ్ళు, ఇతర వన్యప్రాణులు ప్రమాదంలో పడుతున్నాయని తెలిపారు.

ఒక జింకను వేటాడినందుకు బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఐదేళ్ల జైలు శిక్ష అనుభవిస్తే, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విధ్వంసంతో వందలాది నెమళ్ళను, జింకలను హతమారుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలాంటి శిక్ష పడాలి? అని ప్రశ్నించారు.

పరిసరాలను పరిరక్షించాల్సిన బాధ్యత ఉన్న ప్రభుత్వం, ప్రత్యర్థి శత్రుదేశంపై దాడి చేసినట్లుగా యూనివర్సిటీ భూములపై దాడి చేస్తోందని ఆరోపించారు. నెమళ్ళ కిలకిలరావాలు ఇప్పుడు ప్రభుత్వం వినిపించుకోవాలని, ఈ విధ్వంసాన్ని తక్షణమే అరికట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా మారిన సీఎం

రాష్ట్రానికి నాయకత్వం వహించాలని ఎన్నికైన ముఖ్యమంత్రి, ఇప్పుడు రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా మారి వ్యవహరిస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ ఆరోపిస్తోంది. విద్యార్థులకు, పేదలకు సంబంధించిన భూములను అక్ర మంగా హస్తగతం చేయడం, వాటిని వ్యాపార లావాదేవీలకు మార్చడం తీవ్రంగా ఖండించదగిన చర్య అని పేర్కొన్నారు.

ఇలాంటి నిబంధనల ఉల్లంఘనలను కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పట్టించుకోవాలని, రాష్ట్రంలో విద్యా వ్యవస్థపై జరుగు తున్న దాడిని అరికట్టాలని కోరారు.

"రేవంత్ రెడ్డి రాజ్యంలో నోరులేని మృగాలు, పేదలు బ్రతకలేరా?" అని ప్రశ్నిస్తూ, బిఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దీక్షగా పోరాటం చేస్తుందని దాసోజు శ్రావణ్ స్పష్టం చేశారు.

కేంద్ర విద్యా మంత్రితో భేటీ.. భూముల పరిరక్షణకు హామీ

ఈ సమస్యకు పరిష్కారం కోసం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని కలిసినట్లు దాసోజు శ్రావణ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అక్ర మంగా యూనివర్సిటీ భూములను కబ్జా చేయకుండా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గారు ఈ విషయాన్ని పూర్తి స్థాయిలో పరిశీలిస్తామని, విద్యా సంస్థలకు సంబం ధించిన భూములను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఎర్ర కోటపై జెండా ఎగురవేస్తాం.. రిజర్వేషన్లు సాధించుకుంటాం..

మొదటి పేజీ తరువాయి..

జంతర్‌మంతర్‌లో నిర్వహించిన బీసీల పోరు గర్జన సభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మండు టెండల్లో, గడ్డ కట్టే చలిలో దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర స్ఫూర్తి, ఆ సమయంలో ఆయన ఇచ్చిన హామీ మేరకే తాము బలహీన వర్గాలకు రిజర్వేషన్లను పెంచుతూ తీర్మానం చేశామని ముఖ్యమంత్రి తెలిపారు.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు రావాలన్నా.. స్థానిక సంస్థల్లో ఇప్పుడున్న రిజర్వేషన్లు కొనసాగాలన్నా జన గణనలో కుల గణన జరగాల్సిందేనని సీఎం అన్నారు. ఎప్పుడు అధికారంలోకి వచ్చినా జన గణనలో కుల గణన చేపడతామని కాంగ్రెస్ పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుందని ఆయన గుర్తు చేశారు. జన గణనలో కుల గణన చేర్చి దాని ఆధారంగా విద్యా, ఉద్యోగాల్లో మాత్రమే కాకుండా రాజకీయ రిజర్వేషన్లు పెంచుతామని రాహుల్ గాంధీ ప్రకటించారని, ఆయన మాటను నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు.

తెలంగాణలో 2023, డిసెంబరు 7న తాము అధికారం చేపట్టిన వంద రోజులు తిరగకముందే బలహీనవర్గాల లెక్కలు తేల్చేందుకు శాసనసభలో తీర్మానం చేశామని, ఏడాది తిరగకముందే కుల గణన పూర్తి చేసి 2024 ఫిబ్రవరి 4న ఆ వివరాలను శాసనసభలో పెట్టామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అందుకే ఫిబ్రవరి నాలుగును సోషల్ జస్టిస్ డే గా ప్రకటించామన్నారు. కొలువుల కోసమే తెలంగాణ ఉద్యమం సాగిందని, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యోగాలు భర్తీ చేయమని గల్లీ నుంచి ఢిల్లీ వరకు యువత పోరాడితే నాటి దుర్మార్గ పాలకుడు ఏ మాత్రం పట్టించుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు.

ఎంత కొట్లాడినా.. ఎందరు మరణించినా నాటి పాలకుల చెవులకు ఎక్కలేదని, ఆ సమయంలో పాదయాత్ర చేస్తూ తండ్రీకొడుకుల ఉద్యోగాలు ఊడగొట్టమని తాను చెప్పిన మాటను విశ్వసించి దానిని చేసి చూపించారని సీఎం అన్నారు. మా ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోపే 59 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి చిత్తశుద్ధిని చాటుకున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు.

బీసీల రిజర్వేషన్ల పెంపునకు బీజేపీ వ్యతిరేకం

బలహీన వర్గాల రిజర్వేషన్ల పెంపునకు వాళ్లు (బీజేపీ నేతలు) విధానపరంగా వ్యతిరేకులని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మండల్ కమిషన్ నియమిస్తే.. వీపీ సింగ్ మండల్ కమిషన్ దుమ్ము దులిపి ముందుకు తెచ్చారని సీఎం గుర్తు చేశారు. మండల్ కమిషన్‌పై బీజేపీ కుట్ర చేసి కమండల్ యాత్ర మొదలుపెట్టిందని, ఆ కమండల్ యాత్ర ప్రతినిధే నరేంద్ర మోదీ అని సీఎం విమర్శించారు. ఇందిరాగాంధీ దళిత, ఆదివాసీ వర్గాలకు చెందిన వారు కాకపోయినా ఆ వర్గాలకు అమ్మలా వ్యవహరించి.. రిజర్వేషన్లు, ఇళ్లు, భూస్వాముల దగ్గర ఉన్న వేల ఎకరాలు గుంజుకొని ఆ వర్గాలకు అందజేసిందని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.

అలా చేయబట్టే నేటికీ దళితులు, ఆదివాసీలు ఇళ్లలో ఇందిరమ్మ ఫొటోలు ఉన్నాయని సీఎం తెలిపారు. బలహీన వర్గాలను బలోపేతం చేయడానికి బీజేపీ వ్యతిరేకమని, ఆ వర్గాల లెక్కలు తేల్చాల్సి వస్తుందనే 2021లో చేయాల్సిన జనాభా లెక్కలను ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం చేపట్టడం లేదని సీఎం మండిపడ్డారు. రాహుల్ గాంధీ కుల గణన చేయాలని డిమాండ్ చేయడంతో 2025 వచ్చినా జన గణన చేయకుండా వాయిదా వేస్తున్నారని సీఎం ఆరోపించారు. బలహీన వర్గాలకు రాహుల్ గాంధీకి ఇచ్చిన మాటను తమ ప్రభుత్వం తెలంగాణలో నిలబెట్టుకుందన్నారు.

దామాషా ప్రకారం నిధులు, నియామకాలు ఉండాల్సిందేనని, అందుకే తాము తెలంగాణలో కుల గణన చేపట్టి బీసీల లెక్క తేల్చామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యా, ఉద్యోగాలతో పాటు రాజకీయాల్లోనూ 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, పరిపాలనలోనూ బీసీలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణలో బీసీలకు విద్యా, ఉద్యోగాలు, చట్ట సభల్లో రిజర్వేషన్ల పెంపునకు శాసనసభలో తీర్మానాలు ప్రవేశపెట్టి అన్ని రాజకీయ పక్షాలను ఏకం చేసి ఏకగ్రీవ తీర్మానం చేశామని సీఎం గుర్తు చేశారు. కుల గణన చేపట్టి రిజర్వేషన్ల పెంపు తీర్మానాలు చేసి దేశానికే తెలంగాణ ఓ దిక్సూచిగా నిలిచిందని సీఎం అన్నారు.

తెలంగాణలో తాము రిజర్వేషన్లు పెంచితే కేంద్ర ప్రభుత్వానికి, మోదీకి వచ్చిన ఇబ్బంది ఏమిటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్, గుజరాత్ సహా ఏ రాష్ట్రంలోనూ కులగణన చేపట్టలేదని సీఎం విమర్శించారు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచుకుంటామని మేం కోరితే ఎందుకు ఒప్పుకోవడం లేదో తెలపాలని ఆయన డిమాండ్ చేశారు.

హస్తినకు వచ్చాం... ఇక రాం

కురుక్షేత్ర సంగ్రామానికి ముందు అయిదు ఊళ్ల కోసం కృష్ణుడు రాయబారానికి వచ్చారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయిననూ పోయి రావలె హస్తినకు అనే రీతిలోనే తాము హస్తినకు వచ్చామని... తెలంగాణలో ఆమోదించిన తీర్మానాలను పార్లమెంట్‌లో ఆమోదిస్తే 10 లక్షల మందితో సభ పెట్టి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సన్మానిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మా గుండె చప్పుడు పంచుకోవాలని, మా అభిప్రాయాలు వినాలని ప్రధానమంత్రి నరేంద్ర

మోదీకి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మాపై ఆధిపత్యం చలాయించాలనుకున్న నిజాంలకు, గడీల దొరలకు ఏమైందో తెలుసుకోవాలని ప్రధానమంత్రికి ముఖ్యమంత్రి సూచించారు. బుక్కెడు బువ్వ పెట్టినా, మంచినీళ్లు ఇచ్చినా మర్చిపోని బలహీన వర్గాలను మీరెందుకు పట్టించుకోరని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. చట్టసభల్లో మెజారిటీ లేకపోయినా ట్రిపుల్ తలాక్, 370 రద్దు, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను దేశ ప్రజలపై రుద్దారని సీఎం విమర్శించారు. తెలంగాణలోని అన్ని పార్టీలు సమర్థించిన తీర్మానాలకు ఎందుకు అనుకూలంగా ఉండరని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

బీసీల రిజర్వేషన్ల పెంపుపై జంతర్‌మంతర్లో 15-16 పార్టీలు ఏకమై మద్దతు ప్రకటించినప్పుడు మీరెందుకు స్పందించరని బీజేపీ నేతలను సీఎం ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ బీసీల కోసం ప్రాణం ఇస్తామంటున్నారని, ఆయన ప్రాణం తమకు వద్దు.. వందేళ్లు ఆయన జీవించాలని... రిజర్వేషన్లు పెంచితే చాలునని సీఎం తెలిపారు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచుకునేందుకు తాము ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరామని, గుజరాత్ ,ఇతర రాష్ట్రాల్లో పెంపున అడగలేదని సీఎం అన్నారు.

తాము గుజరాత్‌లో కుంట భూమి అడగడం లేదని, ఉద్యోగాలు ఇవ్వమనడం లేదని, తెలంగాణలో రిజర్వేషన్లు పెంచితే నరేంద్ర మోదీకి వచ్చే నష్టమేమిటో చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, పదవులకు రిజర్వేషన్లు అడిగితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎందుకు స్పందించరని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్ల పెంపు అనే ధర్మమైన డిమాండ్ కోసం తాము హస్తినకు వచ్చామని... ఇకపై ఢిల్లీకి రామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు.

ఒకనాడు ధర్మ యుద్ధ సభ పెట్టాలని మంద కృష్ణ మాదిగకు సూచిం చానని... అలా చేసి ఆయన విజయం సాధించారని.. పరేడ్ గ్రౌండ్‌లో బీసీలు ధర్మయుద్ధ సభ పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీసీ రిజర్వేషన్లు ఆమోదించకపోతే గద్దె దిగాలి.. లేకుంటే గల్లీలో ఆ పార్టీ గద్దెలను కూల్చాల్సిందేనని సీఎం అన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం బలహీన వర్గాల రిజర్వేషన్లు పెంచక పోతే ఎర్రకోటపై జెండా ఎగురవేసి రిజర్వేషన్లు సాధిస్తామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. సభలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ తదితరులు ప్రసంగించారు.

అమరావతి చిత్రకళ వీధికి, ఆంధ్రప్రదేశ్ కళాకారులకు మద్దతుగా బాబు

కళాకారులకు ఇది బంగారు యుగం

సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి

అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాజ మండ్రిలో ఏప్రిల్ 4న జరగనున్న అమరావతి చిత్రకళ వీధి కార్యక్రమా నికి తన మద్దతును ప్రకటిస్తూ, "అమరావతి" అంశంపై రూపొందిన చిత్రలేఖనానికి తన కుంచెతో రంగులు వేశారు . ఆయన పాల్గొనడం రాష్ట్రంలో కళను ప్రోత్సహించేందుకు, సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించేందుకు ప్రభుత్వానికి కలిగి ఉన్న ప్రాధాన్యతను ప్రతిబింబిం చింది.

చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఎన్‌డిఏ ప్రభుత్వం హయాంలోకళాకారులు మరియు సాంస్కృతిక వారసత్వం పరిరక్షించ బడతాయి, ప్రోత్సహించబడతాయి, అలాగే గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లబడతాయి అని స్పష్టం చేశారు. అమరావతి చిత్రకళ వీధి వంటి వేదికల ద్వారా కళాకారుల ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయపడుతుందని హామీ ఇచ్చారు. అలాగే, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ నాయకత్వం లో కృషి చేస్తున్న సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్విని అభినందించారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలలు, బడుగు పిల్లలకు వారి కళను ప్రదర్శించే అవకాశాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని ప్రస్తావించడంతో పాటు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కళాకారులకు ఆంధ్రప్రదేశ్‌కి ఆహ్వానం పలికారు.

చిత్రాన్ని వేస్తున్న సమయంలో, చిన్నతనంలో చివరిసారి చిత్రలేఖనం చేసిన అనుభూతిని గుర్తుచేసుకుంటూ, మళ్ళీ ఆ అనుభూతిని పొందడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

తేజస్వి మాట్లాడుతూ, కళాకారులకు ఇది బంగారు యుగం అని అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో కళలు, సాంస్కృతిక వారసత్వానికి విశేష ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు.

టీటీడీ సేవలు, సౌకర్యాల్లో 100 శాతం మార్పు కనిపించాలి

మొదటి పేజీ తరువాయి..

బాగుంటే ప్రభుత్వానికీ మంచి పేరు వస్తుంది. గత ప్రభుత్వానికి నేటికీ ఇప్పటికే మార్పు కనిపించింది. అయితే ఆ మార్పు 100 శాతం ఉండాలి. అప్పుడే భక్తుల, ప్రజల అంచనాలను మనం అందుకోగలం. పెరుగుతున్న రద్దీ నేపథ్యంలో వచ్చే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా టీటీడీని తీర్చిదిద్దాలి. ఏ పనులు అవసరమో ఆ పనులు మాత్రమే చేయాలి.శ్రీవారి డబ్బులు ఇష్టారీతిన ఖర్చు పెట్టవద్దు...మనం దేవాలయానికి ధర్మకర్తలం, నిమిత్తమాత్రులం మాత్రమే. శ్రీవారికి భక్తులు ఇచ్చే కానుకల సొమ్మును ఇష్టారీతిన ఖర్చుపెట్టే అధికారం ఎవరికీ లేదు. ఏడుకొండల వాడి సొమ్ము ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదు. వందల కోట్ల నిధులను అనేక కార్యక్రమలకు టీటీడీ ఖర్చు చేస్తోంది..దీనిపై ఇంటర్నల్ ఆడిటింగ్ తో పాటు....కాగ్ ద్వారా ఆడిట్ జరిపితే మంచిది. భక్తులు ఇచ్చే వితరణ, విరాళాలు ప్రతి రూపాయి సక్రమంగా ఖర్చు అవ్వాల్సిన అవసరం ఉంది. జవాబు దారీతనం ఉండాలి" అని సిఎం స్పష్టం చేశారు.

"టీటీడీలో సమూల ప్రక్షాళన జరపుతాను అని నేను ఎన్నికల ముందు చెప్పాను. చెప్పిన విధంగానే అధికారంలోకి వచ్చిన తరువాత అనేక మార్పులు జరిగాయి. అయితే ఈ మార్పులు 100 శాతం ఉండాలి. ఎక్కడా పాతవాసనలు, పాత వ్యక్తులు కొనసాగకూడదు. అనుభవజ్ఞుల పేరుతో పాతవారిని ఇంకా కొనసాగించ వద్దు. ప్రక్షాళన అనేది 100 శాతం జరగాల్సిందే...దీనిలో మినహాయింపులు లేవు" అని సిఎం అధికారులకు సూచించారు.

అలిపిరిలో బేస్ క్యాంప్

సమీక్ష సందర్భంగా టీటీడీ బోర్డు తీసుకున్న పలు నిర్ణయాలను, పలు ప్రతిపాదనలను అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అలిపిరిలో భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. 25 వేల మందికి సౌకర్యవంతంగా ఉండేలా ఈ బేస్ క్యాంప్ నిర్మాణం చేపడు తున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా 60 అనుబంధ దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్న విషయాన్ని, రాష్ట్రం వెలుపల ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయాల పురోగతిని వివరించారు. శ్రీవారి సేవకుల విషయంలో కొత్తవారు 90 శాతం మంది ఉంటున్నారని అధికారులు చెప్పగా..సగం మంది పాతవారిని నియమించుకోవడం ద్వారా నాణ్యమైన సేవలు అందించవచ్చని తెలిపారు.తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి రోజుకు 25 వేల మంది వరకూ భక్తులు వస్తారని అధికారులు తెలపగా..దీనికి మరింత అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. బర్డ్ ఆసుపత్రికి డైరెక్టర్ నియామకం, జేఈవో, సివిఎస్‌వో, ఎస్వీబీసీ చైర్మన్ నియామకాలను త్వరలో చేపడతామని సీఎం చెప్పారు. టీటీడీ నుంచి 15 రకాల సేవలు వాట్సాప్‌లో అందిస్తామని అధికారులు చెప్పగా... వెంటనే వాట్సాప్ సేవలు ప్రారంభం కావాలని సీఎం సూచించారు.

ప్రతి సేవకు ఆధార్, సెల్ ఫోన్ నెంబర్‌ను లింక్ చేయడం ద్వారా ఎక్కడా అక్రమాలు జరగకుండా ఉండటానికి అవకాశం ఉంటుందని సీఎం చెప్పారు. మరోవైపు పారిశుధ్య నిర్వహణపైనా దృష్టి పెట్టాలని సిఎం అన్నారు. తిరుమలలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగి చేసుకోవాలన్నారు. టీటీడీ పరిధి మొత్తం 2,675 హెక్టర్లలో విస్తరించి ఉండగా....ఇందులో ప్రస్తుతం 68.14 శాతం పచ్చదనం ఉంది. దీనిని 80 శాతానికి తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

టీటీడీ సేవలపై సంతృప్తి

రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సందర్భాల్లో తిరుమలలో టీటీడీ అందించిన సేవలపై ఫీడ్‌బ్యాక్ సర్వేలో భక్తుల నుంచి అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రథసప్తమి రోజున భక్తుల రద్దీ క్రమబద్ధీకరణ, అన్నప్రసాదం, పరిశుభ్రత, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అన్ని అంశాలపై 76 శాతం మంది భక్తులు ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని చెప్పగా, మరో 22 శాతం మంది బావున్నట్టు వెల్లడించారు. కేవలం 1 శాతం పర్వాలేదని, 1 శాతం మంది మాత్రమే బాగోలేదని తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజు 74 శాతం మంది భక్తులు ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని చెప్పగా, మరో 22 శాతం మంది బావున్నట్టు వెల్లడించారు. కేవలం 3 శాతం పర్వాలేదని, 1 శాతం మంది మాత్రమే బాగోలేదని తెలిపారు.

మార్చి 9 నుంచి 14 వరకు సాధారణ రోజుల్లో తిరుమల వచ్చిన భక్తుల నుంచి ఐవీఆర్ఎస్ విధానంలో చేసిన సర్వేలోనూ అత్యధిక స్థాయి సంతృప్తి వ్యక్తమైంది. క్యూలైన్ నిర్వహణ, సౌకర్యాలపై 65 శాతం మంది బాగుంది అని చెప్పగా, 28శాతం పర్వాలేదని, 7 శాతం మంది బాగోలేదని సమాధానం ఇచ్చారు. అలాగే వసతి, శుభ్రత బాగుందని 74 శాతం, పర్వాలేదని 19 శాతం, బాగోలేదని 7 శాతం మంది చెప్పారు. లడ్డు రుచి-నాణ్యత బావుందని 77 శాతం, పర్వాలేదని 17 శాతం, బాగోలేదని 6 శాతం మంది చెప్పారు.

ఇంకా అన్నదానం, కల్యాణకట్ట, టీటీడీ ఉద్యోగుల ప్రవర్తన, లగేజ్ కలెక్షన్-డెలివరీ వంటి అంశాలపైనా ఇదే స్థాయిలో అభిప్రాయాలు వెల్లడించారు. మొత్తంగా ఐవీఆర్ఎస్ సర్వేలో 61 శాతం మంది భక్తులు టీటీడీ సేవలు బావున్నాయని మెచ్చుకున్నారు. 27 శాతం పర్వా లేదన్నారు. 12 శాతం మంది భక్తులు బాగోలేదన్నారు.

టీటీడీ అనుబంధ ఆలయాల అభివృద్ధి

అమరావతి రాజధానిలోని వెంకటపాలెంలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయనున్నారు. చుట్టూ ప్రాకారం నిర్మాణంతో పాటు ఒక రాజగోపురం, మూడు గోపురాలు నిర్మించనున్నారు. దీనికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలుస్తారు. అలాగే ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని విస్తరణ పనులతో పాటు సుందరంగా తీర్చిదిద్దనున్నారు. కరీంనగర్, కొడంగల్, నవీ ముంబై, బాంద్రా, ఉలుందుర్పేట, కొయంబత్తూరులో చేపట్టిన శ్రీవారి ఆలయాల నిర్మాణం-అభివృద్ధి కార్యక్రమాలపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సమీక్షలో దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, చీఫ్ విజిలెన్స్ అధికారి, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

అన్న హత్య గురించి అడగవేందత్తా?!

మొదటి పేజీ తరువాయి..

ధర్మదేవత ఎదుట మోకరిల్లారు.

పేరుగొప్ప దర్యాప్తు సంస్థ సీబీఐ మాత్రం, గుప్పెడు నిద్రమాత్రలు మింగిన దానిలా సుఖనిద్ర పోతోంది. అప్పుడప్పుడూ జడ్జిగారి హుంకరింపులు తప్ప, కేసు ఒక అంగుళం కదిలింది లేదు. మాకు న్యాయం చేయమంటూ ఇద్దరు ఆడబిడ్డలు రోడ్డెక్కి కొంగుజాపి అర్థించినా, న్యాయదేవత ఇప్పటికీ కనికరించిందీ లేదు. పోనీ ఫ్యామిలీ అన్నా దన్నుగా ఉంటుందా అంటే.. జగన్, భారతి, అవినాష్, మేనత్త విమల అంతా గొడ్డలిపోటు వైపేనాయె! ఎటొచ్చీ పాపం సునీత, షర్మిల ఇద్దరే ఒంటరి జీవులు!

పోనీ 'ఎడుగూరి సందింటి' కుటుంబానికి పెద్ద దిక్కయిన మేనత్త కామ్రేడ్ విమలమ్మయినా, ఇద్దరు ఆడబిడ్డల వైపు నిలబడ్డారా అంటే అదీలేదు. సొంత అన్నను అత్యంత కిరాతకంగా గొడ్డలితో నరికితే.. 'నా అన్నను చంపిన కిరాతకులను శిక్షించండి' అని ఈ పులివెందుల చెల్లెమ్మ ఇప్పటిదాకా నినదిస్తే ఒట్టు. పైగా 'అవినాష్‌రెడ్డి అమాయకుడు. వదిలేయమ'ని మేనకోడళ్లకు రి మండేషన్ ఒకటి.

సొంత అన్నను చంపిన వారిని శిక్షించమని ఇప్పటివరకూ కోరని ఈ మేనత్త.. ఇప్పుడు ప్రవీణ్ అనే పాస్టర్ మృతిపై విచారణ జరిపించాలని కోరడం.. సునీత అండ్ షర్మిలకే కాదు. వైఎస్ అభిమానులకు బోలెండ కోపం తెప్పించింది. సొంత అన్న హత్య గురించి ఇప్పటివరకూ ఒక్క మాట కూడా మాట్లాడకుండా, ప్రమాదానికి గురై మరణించిన పాస్టరు గురించి మాట్లాడటమే దానికి కారణం!

పాస్టర్ ప్రవీణ్‌ది హత్యా? సహజ మరణమా? అంటూ మీడియా చానెళ్లు గత కొద్దిరోజుల నుంచి, చర్చల పేరంటం పెట్టి వీక్షకుల సహనానికి పరీక్ష పెట్టాయి. చివరాఖరకు సదరు పాస్టరు గారు, ఆగిన చోటల్లా మద్యం బాటిళ్లు కొని, తాగి బండి నడిపి.. ఆ క్రమంలో మూడు, నాలుగుసార్లు కిందపడి దెబ్బలు తగిలించుకున్నట్లు సీసీ టీవీ పుటేజీల్లో బయటపడిన నిజాలను జనం చూశారు. బహుశా ఆ ప్రమాదంలో భాగంగానే, పాస్టరు గారు మృతి చెంది ఉండవచ్చు. పోలీసులు కూడా అదే ధృవీకరిస్తున్నారు.

అసలు పాస్టరు గారిని చంపాల్సిన అవసరం ఎవరికీ లేదు. ఆయనకు ఎవరితో ఆస్తిగొడవలు లేవు. భూముల పంచాయతీలు అసలే లేవు. యూట్యూబ్ చానెళ్లలో అన్యమతంపై ఘాటు విమ

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 03, ఏప్రిల్ 2025

'ప్రకాశం'... నా హృదయంలో ఉంది...!

- సీబీఎన్ పి4 విధానానికి రిలయన్స్ సిబిజి ప్లాంట్లతో నాంది!
- పేదరికం లేని ప్రకాశం జిల్లా మా లక్ష్యం...సాధించి తీరుతాం
- అయిదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పనే మా సింగిల్ టార్గెట్
- కనిగిరి ప్రాంతంలోనే 50 సిబిజి ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం
- త్వరలోనే కనిగిరి ట్రిపుల్ ఐటికి శంకుస్థాపన చేస్తా...
- రిలయన్స్ సిబిజి ప్లాంట్లతో 2.5లక్షల మందికి ఉద్యోగావకాశాలు
- తప్పుడు ప్రచారాలు చేస్తే సహించను... రెడ్ బుక్ లోకి ఎక్కిస్తా
- కనిగిరిలో రిలయన్స్ సిబిజి ప్లాంట్‌కు మంత్రి లోకేష్ భూమిపూజ

కనిగిరి, మహానాడు:
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన పి4 విధానానికి రిలయన్స్ సిబిజి ప్లాంట్స్ నాంది కాబోతున్నాయి, పేదరికం లేకుండా చేయడంలో ఇదొక ముఖ్యమైన అడుగు కాబోతోందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రకాశం జిల్లా, కనిగిరి నియోజకవర్గం పిసిపల్లి మండలం దివాకరపురంలో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయనున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటుకు బుధవారం మంత్రి లోకేష్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఎటువంటి నీటి వసతి లేని మెట్టప్రాంతంలోని రైతులకు ఈ ప్లాంట్స్ ద్వారా పెద్ద ఎత్తున మేలు జరుగుతుంది. నైపర్ గడ్డి తో గ్యాస్ తయారు చేయబోతున్నారు. ప్రభుత్వ భూములకు 15 వేలు,

రైతుల భూములకు 31 వేలు కౌలు కూడా ఇవ్వబోతున్నారు. రైతులే గడ్డి పెంచి ఇస్తే టన్నుకు నిర్ణీత ధర చెల్లిస్తారు. రిలయన్స్ సంస్థ ఏర్పాటుచేసే సిబిజి ప్లాంట్లన్నీ పూర్తిస్థాయిలో పనిచేస్తే ఏటా 110 లక్షల మెట్రిక్ టన్నుల ఆర్గానిక్ ఎరువు కూడా తయారు అవుతుంది. ఈ ప్లాంట్ల ద్వారా గ్రామీణ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు రాబోతున్నాయి. నేను ప్రకాశం జిల్లా వచ్చిన ప్రతీసారి మీరు చూపించే ప్రేమ, ఆప్యాయత నేను మర్చిపోలేను. ప్రకాశం జిల్లాలో పేదరికం లేకుండా చేయడమే మా లక్ష్యం. రానున్న అయిదేళ్లలో ఆ లక్ష్యాన్ని సాధించి తీరుతాం.

సిబిజి హబ్ గా మారనున్న కనిగిరి!

ఆంధ్రప్రదేశ్ లో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్స్ పెట్టడానికి రిలయన్స్ ముందుకు వచ్చింది. ఈ రంగంలో 65 వేల కోట్ల పెట్టుబడి పెట్టబోతోంది. దీని ద్వారా 500 ప్లాంట్లు పెట్టడానికి రిలయన్స్ ముందుకు వచ్చింది. దీని ద్వారా 2.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయి. ప్రకాశం, అనంతపురం, చిత్తూరు, కడప లో 5 లక్షల ఎకరాల బీడు భూమిని వినియోగంలోకి తీసుకురాబోతున్నాం. నేను యువగళం ప్రకాశం జిల్లాకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాను. రిలయన్స్ మొదటి సిబిజి ప్లాంట్ ను కనిగిరిలో ప్రారంభించాను. ప్రకాశం జిల్లా లో ఐదు వేల ఎకరాలు బీడు భూములు ఇచ్చాం. కనిగిరి లో 497 ఎకరాలు కేటాయించాం. కనిగిరి ప్లాంట్ రిలయన్స్ సిబిజి ప్లాంట్ హబ్ గా మారబోతుంది. ఇక్కడే ఐదు ప్లాంట్స్ రాబోతున్నాయి.

నా హృదయంలో ప్రకాశం జిల్లా...

ఉమ్మడి ప్రకాశం జిల్లా అంటే నాకు మొదట గుర్తొచ్చేది పౌరుషం, ప్రేమ. ఇక్కడి ప్రజలకు పౌరుషం ఎక్కువే, ప్రేమ ఎక్కువే. ప్రకాశం జిల్లా ప్రజలకు టిడిపి అన్నా, చంద్రబాబు అన్నా ఎనలేని ప్రేమ. 2019లో ఎదురుగాలి ఉన్నా టిడిపిని నాలుగు సీట్లలో గెలిపించారు. 2024 లో 10సీట్లలో టిడిపి అభ్యర్థులకు ఘనవిజయాన్ని చేకూర్చారు. యువగళం పాదయాత్ర చేసినప్పుడు ఇక్కడ ప్రజల కష్టాలు చూశాను. ప్రకాశం జిల్లాలో యువగళం ఒక ప్రభంజనంగా మారింది. నేను ఆ రోజే చెప్పా, మీరు చూపించిన ప్రేమకు రెండింతలు తిరిగి ఇస్తానని, ప్రకాశం జిల్లా నా గుండెల్లో ఉంటుంది అని.

2014 లో రాష్ట్ర విభజన జరిగింది. కట్టుబట్టలతో మనం ప్రయాణం ప్రారంభించాం. అందరి ఆమోదంతో అమరావతిని రాజధానిగా ప్రకటించాం. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ఎజెండాగా పనిచేశాం. అనంతపురం ను ఆటోమొబైల్ హబ్ చేశాం. చిత్తూరు, కడప లో ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీలు తీసుకొచ్చాం.

కర్నూలు కు రెన్యూవబుల్ ఎనర్జీ కంపెనీలు తీసుకొచ్చాం. ప్రకాశం జిల్లా కు అతిపెద్ద పేపర్ మిల్ తీసుకొస్తే ఆ కంపెనీని గత ప్రభుత్వం రానివ్వలేదు. ఉభయగోదావరి జిల్లాలను ఆక్వా రంగంలో నంబర్ 1 గా నిలబెట్టాం. ఉత్తరాంధ్ర ను ఐటి, ఫార్మా హబ్‌గా తయారు చేశాం.

గత అయిదేళ్ల పాలనంతా విధ్వంసమే!

2019 నుండి 2024 వరకూ ఎం జరిగిందో మీరంతా చూశారు. రాష్ట్రంలో విధ్వంస పాలన నడిచింది. కొత్త కంపెనీలు తీసుకురాకపోగా ఉన్న కంపెనీలను తరిమేశారు. లులూ, అమర్ రాజా, హెచ్ఎస్బిసి, జాకీ లాంటి అనేక కంపెనీలను బెదిరించి బయటకు పంపేశారు. నేను ఆ రోజే ఛాలెంజ్ చేసా మీరు తెచ్చిన ఒక్క కంపెనీ పేరు చెప్పండి అని ఇప్పటి వరకూ ఆ సైడ్ నుండి సౌండ్ లేదు. దేశం లో ఏ పార్టీ చేయని సాహసం మేం చేశాం. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు

కల్పిస్తాం అని చెప్పిన దమ్మున్న పార్టీ టిడిపి. ఆ హామీ ఇచ్చే నేను అనేక మందితో మాట్లాడాను. అందరూ నీ ధైర్యం ఏంటి అని అడిగారు. నా ధైర్యం ఒక్కటే .. నా బ్రాండ్ ఒక్కటే దటీజ్ సిబిఎన్ అని చెప్పా. 2024లో సైకో పాలనకు బైబై చెప్పి రాష్ట్ర ప్రజలు ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకున్నారు. గెలిచిన మొదటి రోజు నుండే ఉద్యోగాల వేట మొదలుపెట్టాం. యువగళం పాదయాత్ర నాలో మార్పు తెచ్చింది. జిడి నెల్లూరు నియోజకవర్గంలో పాదయాత్ర సమయంలో ఒక కుగ్రామంలో ఒక తల్లి రోడ్డుపై బోండాలు వేస్తోంది. ఆకలివేస్తోంది, బోండాలు పెట్టమని అడిగా. ఆమెను ఏం కావాలని అడిగాను. మద్యానికి బానిసై నా భర్త చనిపోయాడు. 30ఏళ్లుగా టిఫిన్ కొట్టుపెట్టుకుని జీవనం సాగిస్తున్నా. ఇద్దరు బిడ్డలను చదివిస్తున్నా, వారికి ఉద్యోగాలు కావాలని కోరింది. మరుసటిరోజే సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి మ్యానిఫెస్టోలో మొదటిహామీగా 20 లక్షల ఉద్యోగాలు పెట్టాలని కోరాను.

సిబిఎన్ బ్రాండే మా ధైర్యం!

మొన్నే ఢిల్లీ లో ఒక ఇంటర్వ్యూ కి వెళ్ళా. అక్కడ యాంకర్ ఒక ప్రశ్న అడిగారు. తెలంగాణకు హైదరాబాద్ ఉంది, తమిళనాడు కి చెన్నై ఉంది, కర్ణాటక కు బెంగుళూరు ఉంది. ఆంధ్రప్రదేశ్ కు ఏమి ఉంది అని అడిగారు. నేను ఆయనకు ఆంధ్రప్రదేశ్ కు చంద్రబాబు ఉన్నారని చెప్పా. ఇప్పటికే 8 లక్షల కోట్ల పెట్టుబడులు, వాటి ద్వారా 5 లక్షల ఉద్యోగాలు కల్పించడానికి ఒప్పందాలు చేసుకున్నాం. రిలయన్స్, ఎన్టిపిసి, ఆర్సీలార్ మిట్టల్, బిపిసిఎల్, టాటా పవర్, టిసిఎస్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్. ఇలా అనేక కంపెనీలు రాష్ట్రానికి క్యూకట్టాయి. నా లక్ష్యం ఒక్కటే కుటుంబంలో ఒక్క ఉద్యోగం వస్తే ఆ కుటుంబం పరిస్థితులు మారిపోతాయి. పేదరికం లేకుండా చేయాలి అంటే ఉద్యోగాలు కల్పించాలి. 5 ఏళ్లలో రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే నా సింగిల్ టార్గెట్.

రిలయన్స్‌తో బాబుకు ప్రత్యేకమైన అనుబంధం

రిలయన్స్ ఫౌండర్ ఛైర్మెన్ ధీరూభాయ్ అంబానీతో చంద్రబాబుకి మంచి అనుబంధం ఉంది. జాం నగర్లో ఉన్న రిలయన్స్ రిఫైనరీ చూడటానికి వెళ్ళినప్పుడు చంద్రబాబు టెలికాం రంగంలో విప్లవం రాబోతుంది అని ధీరూభాయ్ అంబానీతో చెప్పారు. చంద్రబాబుపై నమ్మకంతో ఆ రోజుల్లోనే ధీరూభాయ్ అంబానీ టెలికాం రంగంలో పెట్టుబడులు పెట్టారు. ఆ తరువాత ఆ అనుబంధం రిలయన్స్ ఛైర్మెన్ ముకేష్ అంబానీ తో కూడా కొనసాగుతుంది. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత నేను ముకేష్ అంబానీని, అనంత్ అంబానీని, రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిఎంఎస్ ప్రసాద్ ని కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించాను. ఏపీ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు... స్పీడ్ ఆఫ్ డూయింగ్ లో ముందుందని చెప్పాను. 21 రోజుల్లో ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ (ఐస్) తీసుకొస్తానని హామీ ఇచ్చాను, కానీ 30 రోజులు పట్టింది. అడిగిన వెంటనే ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడానికి అంగీకరించిన ముకేష్ అంబానీ, అనంత్ అంబానీ, రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిఎంఎస్ ప్రసాద్ కు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

కనిగిరి ట్రిపుల్ ఐటికి త్వరలోనే శంకుస్థాపన

ప్రకాశం జిల్లాలో ఎప్పుడు వచ్చినా నా పాదయాత్ర గుర్తొస్తుంది, నాపై చూపిన ప్రేమ, అభిమానం ఎప్పుడూ మర్చిపోను. కనిగిరిలో ట్రిపుల్ ఐటికి త్వరలోనే శంకుస్థాపన చేస్తా. కనిగిరి రైల్వే ప్రాజెక్టుకు ఏప్రిల్ లో అవసరమైన నిధులిస్తాం, ఆగస్టులో సీఎంను రప్పించి రైల్వేప్రాజెక్టు పనులు ప్రారంభిస్తాం. మిగిలిపోయిన వెలుగొండ పనులు పూర్తిచేసి చివరి ఎకరాకు సైతం సాగునీరు అందిస్తాం, మంచినీటి శాఖ మంత్రి, నా సోదరుడు పవనన్న. కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించి ఆగిపోయిన జల్ జీవన్ మిషన్ పనులను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ప్రతిగడపకు మంచినీరు అందిస్తాం. వైసీపీ నాయకుల దుష్ప్రచారం చూస్తుంటే జాలివేస్తోంది. వారు చేయరు, చేసేవాళ్లను చేయనీయరు. బయోగ్యాస్ ప్లాంటుపై అపోహలు సృష్టిస్తున్నారు.

అనవసరంగా అడ్డుపడితే ఎర్రబుక్ లోకి ఎక్కుతారు. నేను మంచి పనిచేయడానికి వచ్చా. అధికారంలోకి వచ్చిన 10నెలల్లోనే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుతో ప్రకాశం జిల్లాకు వచ్చా. తప్పుడు ప్రచారం చేస్తే ఎవరినీ వదిలిపెట్టను. ఆనాడు బీసీ గర్జన పేరుతో మేం ప్రకాశం జిల్లాలో కార్యక్రమం పెడితే ఉదయభాను యాంకర్ గా వచ్చారు. ఆనాడు బీసీ సోదరులపై దాడులను నిలదీశాం. ఉదయభానును ట్రోల్ చేశారు. బీసీ నేతలపై దొంగ కేసులు పెట్టారు. నాపై కూడా 23 కేసులు పెట్టారు. తగ్గేదే లేదని చెప్పాను. 94శాతం సీట్లతో మీరు మమ్మల్ని గెలిపించారు, మీకు అండగా నిలుస్తాం.

కనిగిరి నియోజకవర్గంలోనే 50 ప్లాంట్లు

పాదయాత్ర సమయంలో సాయంత్రం సరదాగా కూర్చుని మాట్లాడుకునేవాళ్లం. మన ప్రాంతంలో ఏం మార్పుతేవాలనే విషయమై చర్చించేవాళ్లం. మా ప్రాంతంలో వలసలకు చెక్ పెట్టాలని ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. అది గుర్తుపెట్టుకొని నేను, గొట్టిపాటి మొదటి సిబిజి ప్లాంట్ కనిగిరిలో ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. రిలయన్స్ ఆధ్వర్యంలో మొదటి వంద సిబిజి ప్లాంట్లు ప్రకాశం జిల్లాకు తేవాలని నిర్ణయించాం. ఈ ప్రాంత రైతులు 50 వేల ఎకరాలు కౌలుకు ఇస్తారని ఉగ్ర చెప్పారు. చెప్పిన ప్రకారం భూములిస్తే ఇక్కడే 50 ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం. గత పదిరోజులుగా ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అవిశ్రాంతంగా పనిచేశారు. కనిగిరి ప్రజల కోసం ఆయన కష్టపడ్డారు.

ఇక్కడ ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసవెళ్లకుండా ఇక్కడే ఉద్యోగాలు కల్పించాలని ఆయన కృషిచేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, ఆనం రాంనారాయణ రెడ్డి, డోలా బాల వీరాంజనేయ స్వామి, చీఫ్ సెక్రటరీ విజయానంద్, ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ట్రాన్స్ కో ఎండి కీర్తి చేకూరి, ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, కందుల నారాయణరెడ్డి, బీఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, ఎంఎం కొండయ్య, ఏలూరి సాంబశివరావు, కాకర్ల సురేష్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్, అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, యర్రగొండపాలెం ఇన్ ఛార్జి ఎరిక్షన్ బాబు, దర్శి ఇన్ ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరక్టర్ పిఎంఎస్ ప్రసాద్, ఆర్ఐఎల్ మెంటర్ పీవీఎల్ మాధవరావు, రిలయన్స్ బయో ఎనర్జీ సీఈఓ హరీంద్ర కే త్రిపాఠి, నెడ్ క్యాప్ విసి అండ్ ఎండి కమలాకర్ బాబు, సర్పంచ్ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 03, ఏప్రిల్ 2025 ||

విశాఖలో ప్రేమోన్మాది ఘాతుకంపై
సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

- బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం

అమరావతి: విశాఖపట్నంలో యువతిపై ప్రేమోన్మాది దాడిలో ఒకరు ప్రాణాలు కోల్పోవడం, మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఉండటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దాడిని అడ్డుకునే ప్రయత్నంలో నిందితుడి చేతిలో యువతి తల్లి నక్కా లక్ష్మి ప్రాణాలు కోల్పోవడం విచారకరం అన్నారు. ఈ ఘటనపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న యువతి ఆరోగ్య పరిస్థితిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.



ఐదుగురు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

అమరావతి,2 ఏప్రిల్: ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలికి ఎంపికైన ఐదుగురు శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు,బిటి నాయుడు,కొణిదల నాగేంద్ర రావు(నాగబాబు) పేరాబత్తుల రాజశేఖర్,ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ లచే బుధవారం రాష్ట్ర అసెంబ్లీ భవనంలోని చైర్మన్ చాంబరులో రాష్ట్ర శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజు సభ్యులచే శాసన మండలి సభ్యులుగా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు కె.అచ్చన్నాయుడు,అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్,ఉప కార్యదర్శి రాజ్ కుమార్,ఇతర అధికారులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

- ఆ ప్రదేశంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- లంచాలు మేసి, నిద్రపోతున్న అధికారులు
- సర్కారు ఆస్తిని రక్షించాలని టీడీపీ గ్రీవెన్స్‌కు ఓ పౌరుడు ఫిర్యాదు
- భూములు ఆక్రమించి, చంపుతామని బెదిరింపులు!
- నేతలకు బాధితురాలి ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్సీ ఆలపాటి, అమలాపురం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ స్వామి నాయుడు

కడపలో ప్రభుత్వ స్థలాన్ని
ఆక్రమించిన వైసీపీ నేతలు!

మంగళగిరి, మహానాడు:
తూర్పు గోదావరి జిల్లా, గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి అనే మహిళ బుధవారం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, అమలాపురం అర్బన్ డవలప్మెంట్ అథారిటీ చైర్మన్ స్వామి నాయుడులకు అర్జీ ఇచ్చారు. తమ భూములను ఆక్రమించుకోవడమే కాకుండా తమను తమ సొంత భూముల్లోకి వెళితే చంపేస్తామని.. కరెడ్ల గంగాధర్, కరెడ్ల నీలిమ, తోట ఆదినారాయణ, సూరవరపు సూర్యనారాయణలు బెదిరిస్తున్నారని.. వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

- గుంటూరుకు చెందిన ఎం.శ్రీనివాస్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. శ్రీ అపరాజిత అగ్రి బయోటెక్ సంస్థ నుండి ఉద్యానవన శాఖకి 2019-2020 మధ్య సమగ్ర సస్యరక్షణ ఉత్పత్తులను సరఫరా చేశామని.. దానికి సంబంధించిన బిల్లు రూ.18 లక్షలు నేటికి ఇవ్వలేదని.. దయ చేసి తమకు రావాల్సిన బాకాయి డబ్బులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.
- ఎన్టీఆర్ జిల్లా, విజయవాడకు చెందిన మాధురి విజ్ఞప్తి చేస్తూ.. 20 ఏళ్ళుగా తాము విజయవాడలో ఉంటున్నామని.. తమకు సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్నామని.. అద్దె కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నామని.. దయ చేసి తమకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఆమె అర్జీ ఇచ్చి అభ్యర్థించింది.
- తూర్పు గోదావరి జిల్లా, చాగల్లుకు చెందిన తాళ్లూరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేస్తూ.. తన నానమ్మ తనకు 85 సెంట్ల భూమి రాసి ఇచ్చిందని.. దాని ప్రకారం భూమి ఉన్నా.. ఆన్‌లైన్‌లో తక్కుగా నమోదు చేసి చూపుతున్నారని.. దయచేసి ఆన్‌లైన్‌లో దొర్లిన తప్పును సరిచేసి 85 సెంట్ల భూమి ఉండేలా ఎక్కించాలని విజ్ఞప్తి చేశారు.
- వైసీపీ నేతలు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తుంటే.. అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా వారి వద్ద నుండి లంచాలు తీసుకొని పట్టించుకోవడం లేదని.. దీనిపై ఎంక్వైరీ వేసి ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు.. అక్రమార్కులకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కడప జిల్లా, ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పొట్ట శివప్రసాద్ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- తిరుపతి జిల్లా, వరదయ్యపాలెం మండలం కంచరపాలెం గ్రామానికి చెందిన దశరథన్ గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో బందిలి బాలయ్య, బందిలి సురేష్, బందిలి కుమార్ అనే వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి అంగన్ వాడీ కేంద్రానికి దారి లేకుండా చేశారని.. వారు ఆక్రమించుకున్న భూమిని విడిపించి అంగన్ వాడీ కేంద్రానికి దారి ఏర్పాటు చేయాలని విన్నవించారు.

ఎయిమ్స్ అభివృద్ధే లక్ష్యంగా
పెమ్మసాని అడుగులు

- ఆసుపత్రి మౌలిక సదుపాయాలను పెంచాలి.
- 1054 పోస్టులను మంజూరు చేయాలి
- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కు వివరించిన చంద్రశేఖర్
- ఎయిమ్స్‌కు ఏటా రూ.250 కోట్లు కేంద్రం నుంచి అదనంగా అందే అవకాశం
- కేంద్ర మంత్రి పెమ్మసాని వెల్లడి

గుంటూరు, మహానాడు:
ఆచరణలో మెళకువ, మాటకు కట్టుబడే నిబద్ధత కలిగిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తన నెక్స్ట్ డెవలప్మెంట్ టార్గెట్టు ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (ఎయిమ్స్) వైపు గురిపెట్టారు. ఆర్వోబీ, రహదారులు, గుంటూరు ఛానెల్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను నెలల వ్యవధిలోనే గుంటూరుకు సాధించుకు వచ్చిన ఆయన లక్ష్యం ఇపుడు ఎయిమ్స్ హాస్పిటల్ అభివృద్ధి వైపు మళ్లించారు. ఎయిమ్స్ సామర్థ్యాన్ని పెంచే విధంగా 1,054 పోస్టులను భర్తీ చేయడంతో పాటు వలు మౌలిక సదుపాయాల కల్పనను కోరుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ని బుధవారం ఢిల్లీ కార్యాలయంలో కలిసి వివరించారు. ప్రతిపాదనలను సావధానంగా ఆలకించిన ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ ఈ ప్రయత్నం ద్వారా ఏటా సుమారు రూ.250 కోట్లను ఎయిమ్స్ కు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం అదనంగా భరిస్తుందని తెలిపారు.

మాట ఇచ్చాను.. మరువను

గడిచిన ఫిబ్రవరి 28న గుంటూరు పార్లమెంట్ పరిధిలోని నిర్మితమైన ఎయిమ్స్ ఆసుపత్రిని పెమ్మసాని పరిశీలించి, అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో భాగంగా ఎయిమ్స్ అవసరాలు, అదనపు సౌకర్యాలతో పాటు సిబ్బంది, వైద్యులలోటు అంశాలపై ఆయన క్షుణ్ణంగా సమీక్షించారు. సమీక్షలో భాగంగా ఎయిమ్స్‌కు కావాల్సిన సౌకర్యాలను కేంద్రంతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని, మాట ఇచ్చాను.. మరచిపోనని ఆనాడే పెమ్మసాని అధికారులు, వైద్యులకు స్పష్టం చేశారు. ఇచ్చినమాటకు అణుగునంగా అడుగులు వేస్తున్నారు.

ప్రతిపాదనలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను

బలోపేతం చేయడంలో భాగంగా ఎయిమ్స్ ప్రధాన భూమిక పోషిస్తుందని, విజయవాడ-గుంటూరు పరిధిలో నిర్మితమైన ఈ ఎయిమ్స్ కు ఇరు జిల్లాల ప్రజలు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అయితే, అందులో ఉన్న సిబ్బంది, సదుపాయాల కొరత ఆసుపత్రి, వైద్యవిధానంపై ప్రభావం చూపుతుందన్నారు. అందుకు పరిష్కారంగా 105 ప్యాకల్టీ పోస్టులు, సీనియర్ రెసిడెంట్ పోస్టులు, జూనియర్ రెసిడెంట్ పోస్టులు, నర్సింగ్ కేడర్ పోస్టులు, నాన్-పేకల్టీ పోస్టులు, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ కమిటీ ఆమోదించిన ప్రకారం 960 పడకలను అందుబాటులోకి తేవాలని పెమ్మసాని కోరారు. తమ ప్రతిపాదనను అత్యంత ప్రాధాన్యంగా భావించి, త్వరగా అనుమతులను మంజూరు చేయాలని ఆయన కేంద్రాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతికి మోదీ, ఎన్డీయే కూటమి ప్రభుత్వాలు ఎల్లపుడూ సహకరిస్తాయని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యంగా ఏపీ ప్రజలకు ముఖ్యంగా గుంటూరు ప్రజల సౌకర్యార్థం తప్పక సహకరిస్తామని ఆమె భరోసా ఇచ్చారు.

రాష్ట్రంలో 44 బార్లకు ఈ-వేలం

అమరావతి, మహానాడు:
రాష్ట్రంలో లైసెన్సు ఫీజు, నాన్ రిఫండబుల్ రిజిస్ట్రేషన్ ఛార్జీలు, బిడ్ అమౌంట్ చెల్లించని బార్లను ఈ-వేలం ద్వారా ఔత్సాహికులకు కేటాయించేందుకు మద్యనిషేధ, అబ్కారీ శాఖ సంచాలకుడు నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 44 బార్లను ఈ-వేలం, ఆన్ లైన్ లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. బార్ల లైసెన్సులు తీసుకునేందుకు ఆసక్తి గల వారు ఏప్రిల్ 1 నుంచి ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ నెల 7తో ఈ ప్రక్రియ ముగుస్తుంది. అభ్యర్థులు తిరిగి చెల్లించని దరఖాస్తు రుసుంను ఈ నెల 8లోగా చెల్లించాల్సి ఉంటుంది. 50వేల జనాభా ఉంటే రూ.5 లక్షలు, 50 వేలు- 5 లక్షల జనాభా వరకు రూ.7. 5లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా ఉంటే రూ.10లక్షలుగా దరఖాస్తు రుసుంను నిర్ణయించారు.

ఆన్లైన్ ప్రక్రియ ద్వారా అధిక మొత్తంలో పాడుకున్న అభ్యర్థికి ఈ నెల 9న బార్ కేటాయిస్తారు. నగరపాలికలు, ప్రదేశాల వారీగా బార్ల వివరాలు, ఆఫ్ సెట్ ధరలు, గెజిట్ నోటిఫికేషన్ వివరాలు http://apcpe.aptonline.in ఉంచారు. ఇతర వివరాలకు 8074396416 ఫోన్ నంబరులో సంప్రదించాలని అధికారులు సూచించారు.

పెదపుల్లేరు గ్రామంలో 180 మీటర్ల సి సి రోడ్డు, మిలియన్ లీటర్స్ పర్ డే మైక్రో ఫిల్టర్ ప్లాంట్ను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు.

బీసీ సభకు రాహుల్ రాలేదేం?

- బీసీ రిజర్వేషన్ల పెంపును కోల్డ్ స్టారేజీకి పంపే స్క్రీన్ ప్లే
- బీజేపీని కాపాడేందుకే రేవంత్ డైవర్షన్ డ్రామా
- బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీకి అఖిలపక్షం తీసుకెళ్లకుండా కుట్ర
- బీసీ సంఘాలు సమావేశమైన జంతర్ మంతర్ కు కూతవేటు దూరంలోనే మల్లికార్జున ఖర్గే, - రాహుల్ గాంధీ ఉన్న సమావేశానికి రాలేదు.. ఇది బీసీలను అవమానించడమే
- రాహుల్ గాంధీకి తెలంగాణతో పేగుబంధం లేదు.. ఉన్నది ఎన్నికల బంధం
- మై హోం పైకి బుల్డోజర్లు పంపే దమ్ముందా?
- పేదల ఇండ్లపైకి, మూగజీవాలపైకి పంపే బుల్డోజర్లు పెద్దలపైకి ఎందుకు పంపించలేదు?
- ముఖ్యమంత్రి తీరుపై ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్: అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లులను కోల్డ్ స్టోరేజీకి పంపేందుకు రేవంత్ రెడ్డి సర్కారు పకడ్బందీ స్క్రీన్ ప్లే రచించిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల మండిపడ్డారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజ ర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ చేసిన తీర్మానాలను తెరమరుగు చేయడమే ప్రభుత్వ ప్రయత్నమన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని కాపాడేందుకే సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ డ్రామాకు తెరతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బుధవారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లా డారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్తానని అసెంబ్లీ, కౌన్సిల్ సాక్షిగా హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో బుధవారం బీసీ సంఘాలు నిర్వహించిన సమావేశానికి హాజరై అఖిలపక్షం అంశాన్ని డైవర్ట్ చేశారని తెలిపారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తే తనకు అన్నివిధాల అండగా నిలుస్తున్న కేంద్రంలోని బీజేపీ సర్కారు ఇరుకున పడుతుందన్నదే రేవంత్ రెడ్డి భయ మన్నారు.

అఖిలపక్ష పార్టీల నాయకులు రిజర్వేషన్ల పెంపుపై కేంద్రాన్ని నిలదీస్తే కేంద్రం ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని.. మోదీ సర్కారు బీసీ రిజర్వేషన్ల పెంపునకు సానుకూల నిర్ణయం తీసుకోదు కాబట్టే ఆ పార్టీకి రాజకీయంగా ఇబ్బంది కలుగకూడదనే రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లే అంశాన్ని పక్కకు పెట్టాని తెలిపారు. బీసీ సంఘాలతో సమావేశం తర్వాత కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చా మని బయటకు వచ్చి చెప్పుకోవాలన్నదే రేవంత్ ప్రయత్న మన్నారు. ఇది బీసీలను నమ్మించి నట్టేట ముంచడమేనని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ ను తెలంగాణ సమాజం, బీసీలు గమనిస్తూనే ఉన్నారని హెచ్చరించారు.

తెలంగాణ ప్రజల ఓట్లే తప్ప ఇక్కడి వాళ్ల పాట్లు తమకు పట్టవని కాంగ్రెస్ అగ్రనాయకత్వం పదే పదే నిరూపించుకుంటుందన్నారు. ఢిల్లీలో బీసీ సంఘాల మీటింగ్‌కు కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరవు తారని ప్రచారం చేసుకున్నారని గుర్తు చేశారు. బీసీ సంఘాలు సమావేశమైన జంతర్ మంతర్ కు కూతవేటు దూరంలోనే మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఉన్న సమావేశానికి రాలేదని.. ఇది బీసీలను అవమానించడ మేనన్నారు.

తెలంగాణ ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన పార్టీకి ఇక్కడి ప్రజల ఆకాంక్షలు, మనోభావాలతో పని లేదా అని ప్రశ్నిం చారు. రేవంత్ సర్కార్ సాగిస్తున్న ఏ ఒక్క దమనకాండపై రాహుల్ గాంధీ ఇప్పటివరకు నోరు విప్పలేదన్నారు. లగచర్ల రైతుల మీద, బంజారా మహిళలపై సర్కారు అర్ధరాత్రి కరెంట్ తీసి అఘాయిత్యాలకు పాల్పడినా మాట్లాడలేదన్నారు. మూసి ప్రాజెక్టు పేరిట పేద ప్రజల ఇళ్లను కూలగొట్టినా స్పందించలేదని గుర్తు చేశారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించినా రాజ్యాంగాన్ని చేతిలో పెట్టుకునే ప్రధాన ప్రతిపక్ష నేత ఎందుకు ఖండించలేదో చెప్పాలన్నారు. ఇప్పుడు ఢిల్లీ వేదికగా మా బీసీ బిడ్డల మీటింగ్‌కు రాకుండా అవమానించారని.. రాహుల్ గాంధీకి తెలంగాణతో పేగుబంధం లేదు.. ఉన్నది ఎన్నికల బంధం మాత్రమేనని తాము చెప్పేది మరోసారి రూడీ అయ్యిందన్నారు. ఎప్పటికైనా తెలంగాణ కు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని స్పష్టం అయ్యిందన్నారు.

మై హోం పైకి బుల్డోజర్లు పంపే దమ్ముందా?

మై హోం గ్రూప్‌నకు బీఆర్ఎస్ హయాంలో సెంట్రల్ యూనివర్సిటీ భూములు అప్పగించారనే ఆరోపణ మిలీనియం జోక్ అని ఎమ్మెల్సీ కవిత అభివర్ణించారు. కాంగ్రెస్ నేతలు చేస్తోన్న ఆరోపణలు నిజమే అనుకుంటే

మై హోం గ్రూప్ పైకి బుల్డోజర్లు పంపే దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. మై హోం గ్రూప్ చైర్మన్ బీజేపీతో ఉన్నారని.. ఆయన ప్రధాని పక్కన కూర్చుం టారని.. అలాంటి పెద్ద వ్యక్తి మీదికి హైడ్రా బుల్డోజర్లు పంపాలని చాలెంజ్ చేశారు.

పేదల ఇండ్లపైకి, మూగజీవాలపైకి పంపే బుల్డోజర్లు పెద్దలపైకి ఎందుకు పంపడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములు ప్రైవేటు వ్యక్తుల చేతు ల్లోకి వెళ్లకుండా కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. ఆ భూముల పరిరక్షణ కోసం కేసీఆర్ నిర్దేశం మేరకు న్యాయవాదులు కోర్టులో గట్టిగా వాదనలు వినిపించారని గుర్తు చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నడపలేని స్థితిలో ఉన్నారని, ఆయన దుశ్చర్య వల్ల హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ పడిపోయింది కాబట్టి 400 ఎకరాల భూమిని విక్రయించి సర్కారును నడపాలని నిర్ణయించారని అన్నారు. యూనివర్సిటీ నుంచి తీసుకున్న భూమిని యూనివర్సిటీకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 397 ఎకరాలను మరోచోట యూనివర్సిటీకి ఇచ్చామని ప్రభుత్వం వితండవాదం చేస్తుందని, అదే 397 ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు కదా అని ప్రశ్నించారు.

పర్యావరణం, ప్రకృతి కోణంలోనూ ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఇప్పటికే కాంక్రీట్ జంగిల్ లాగా మారిన గచ్చిబౌలి ప్రాంతంలో ఈ 400 ఎకరాల్లో కూడా పెద్ద ఎత్తున కంపెనీలు ఏర్పాటు చేస్తే వాతావరణంపై ఎంత ఒత్తిడి పెరుగుతుందో ఆలోచించాలని సూచించారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 03, ఏప్రిల్ 2025

ప్రపంచస్థాయి ముగ్గుల పోటీలో సత్తా చాటిన జగ్గయ్యపేట మహిళ

జగ్గయ్యపేట: ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ స్థాయి సంక్రాంతి ముగ్గుల పోటీలు 2025 పేరుతో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొన్న జగ్గయ్యపేట మహిళ వేసిన ముగ్గుకు జగ్గయ్యపేట ప్రజలను మంత్ర ముగ్ధులను చేసిన సంగతి తెలిసిందే. ఈరోజు ప్రకటించిన అవార్డుల్లో మామిడి హర్షిత రెండవ బహుమతి గెలుచుకున్నారు. అంటే అక్షరాల 15,00,116/- రూపాయలు గెలుపొందారు. ఈ సందర్భంగా మామిడి హర్షిత మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి ముగ్గులంటే ఇష్టంగా నేర్చుకున్నానని, ఈరోజు నా ముగ్గుకు ప్రపంచ స్థాయి గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉందని, ఈ అవార్డు నాకు చాలా ప్రత్యేకమని, ఈ అవార్డు నాకు మాత్రమే సొంతం కాదని నన్ను ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులందరిది అని సంతోషం వ్యక్తం చేశారు.

కేంద్ర మంత్రి ధర్మేంద్రతో ఎంపీలు వద్దిరాజు, సురేష్ రెడ్డి, దీవకొండ తదితర ప్రముఖులు భేటీ

ఢిల్లీ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీయు)భూములను వేలం వేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను వెంటనే నిలువరించాల్సిందిగా బీఆర్ఎస్ ఎంపీలు కే.ఆర్.సురేష్ రెడ్డి,వద్దిరాజు రవిచంద్ర,దీవకొండ దామోదర్ రావులు కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ రవిచంద్ర,విప్ దామోదర్ రావులు బుధవారం మధ్యాహ్నం ఢిల్లీలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ అయ్యారు.హైదరాబాద్ గచ్చిబౌలిలో నెలకొన్న సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విలువైన భూములలో 400 ఎకరాలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేసేందుకు ప్రయత్ని స్తున్నదని ఎంపీలు మంత్రికి వివరించారు.ఈ భూములలో చెరువులు, కుంటలతో పాటు అరుదైన వృక్ష జాతులు,జింకలు, నెమళ్లు, సరీసృపాలతో జీవ వైవిధ్యం నెలకొని ఉందని,పరిసర ప్రాంతాల వారికి స్వచ్ఛమైన సహజవాయువు దొరుకుతున్నదన్నారు. ఎంతో విలువైన,తమ యూనివర్సిటీ భవిష్యత్తు అవసరాలకు గాను ఉన్న ఈ భూములను వేలం వేయకుండా నిలువరించాలని కోరుతూ విద్యార్థులు, మేధావులు ఆందోళన బాట పట్టిన విషయాన్ని ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్ర, దామోదర్ రావు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దృష్టికి తెచ్చారు.

మంత్రి వెంటనే స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎంపీలకు హామీనిచ్చారు.ఈ సందర్భంగా ఎంపీల వెంట రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్, బీఆర్ఏస్వీ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్,తుంగబాలు, సెంట్రల్, ఉస్మానియా యూనివర్సిటీలకు చెందిన పలువురు విద్యార్థి నాయకులు ఉన్నారు.

ఇదేనా రేవంత్ రెడ్డి మీరు చెప్పిన ప్రజా పాలన?

- అదానీ, అంబానీలకు భూములు అమ్ముతాం అంటే చూస్తూ ఊరుకోం
- శాంతియుతంగా నిరసనకు దిగిన హెచ్ సి యూ విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడాన్ని ఖండిస్తున్నాం
- మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్: శాంతియుతంగా నిరసనకు దిగిన హెచ్ సి యూ విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్‌ను మాజి మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజాపాలన పేరిట రేవంత్ సర్కార్ అణిచివేతలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు.

"హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థులపై రేవంత్ సర్కార్ నిర్బంధకాండ కొనసాగిస్తుంది. ఇదేనా రేవంత్ రెడ్డి మీరు చెప్పిన ప్రజా పాలన.రాహుల్ గాంధీ రాజ్యాంగం కాపాడుతా అంటూ రాజ్యాంగం చేతులో పట్టుకొని దేశం మొత్తం తిరుగుతున్నాడు. హెచ్‌సీయూ లో జరుగుతున్న భూముల అమ్మకాలు రాహుల్ గాంధీకి కనపడటం లేదా?.

ఎన్నికలప్పుడు హెచ్‌సీయూకి వచ్చిన రాహుల్ గాంధీ విద్యార్థులను ఉద్దేశించి ఎం మాట్లాడారు. అలాగే గతంలో ప్రభుత్వ భూముల అమ్మకంపై రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు ఏంటి. ఇప్పుడు వారు వ్యవహరిస్తున్న తీరు ఏంటి ? మీ రెండు నాల్కల ధోరణిని ప్రజలు గమనిస్తున్నారు రేవంత్ రెడ్డి.అదానీ, అంబానీలకు భూములు అమ్ముతాం అంటే చూస్తూ ఊరుకోం. హెచ్‌సీయూ అడవుల్లో అనేక జీవ జాతులు ఉన్నాయి. పక్షులు ఉన్నాయి అవి ప్రభుత్వం చర్యలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయనీ పర్యావరణ వేత్తలు,విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

మీరెన్ని నిర్బంధ కాండలు కొనసాగించిన, లాఠీచార్జీలు చేసిన పెద్దలకు దోచిపెట్టే మీ చర్యలను అడ్డుకోవడానికి విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది." అని వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- జీవీ ఆంజనేయులు

వినుకొండ, మహానాడు: పట్టణంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీవీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుండి వినతులు స్వీకరించి, వారి సమస్యలను

తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా దర్బార్‌కు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు నాగ శ్రీను రాయల, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి సవిత ఆదేశాలతో కాలువ మరమ్మత్తు కాలువ పూడ్చివేత సోమందేపల్లిలోని చెరువు సమీపంలో నిన్నటి రోజున హంద్రీ-నీవా కాలువ తెగిపోవడంతో, కృష్ణా జలాలు రైతుల పొలాల్లోకి వెళ్ళిపంటలు మునిగిపోవడంతో మంత్రి సవిత వెంటనే కలెక్టర్‌కు, నీటీ పారుదల అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో బుధవారం అధికారులు కాలువ పూడ్చివేత పనులు ప్రారంభించారు. కాలువ పూడ్చివేత పనులు ప్రారంభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పరిశోధనాత్మక జర్నలిజమా...నీవెక్కడ?

"నక్కీరన్" పత్రిక ఎందరికి తెలుసు?

పత్రికా రంగంలో చిన్న, పెద్ద పత్రికలు అని తేడా చూపిస్తున్న ఎంతో మందికి చిన్న పెద్దా పత్రిక తేడాలు తగదు అంటూ తన పరిశోధనాత్మక కథనం తో దక్షిణ భారతదేశంలో వీరప్పన్ పై సంచలనాత్మక కథనాలు రాసి జర్నలిజం చరిత్రలో ప్రత్యేక స్థానం పొందింది.ఈ పత్రికను తమిళనాడు లో గోపాలన్ అనే వ్యక్తి నడిపాడు.

దక్షిణ భారతదేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలను గడ గడలాడించి ఆయా ప్రభుత్వాలను టారెత్తించి బయట ప్రపంచానికి తానెవరో తెలియని వీరప్పన్ ని బాహ్య ప్రపంచానికి పరిచయం చేస్తూ వీరప్పన్ తో గోపాలన్ ప్రత్యేక ఇంటర్యూ జరిపి ఓ టీవీ ఛానల్తో టై అప్ అయ్యి నక్కీరన్ సౌజన్యంగా దేశ ప్రజలకు అప్పటి వరకు వీరప్పన్ పేరు మాత్రమే తెలిసి అతని రూపు తెలియని దేశ ప్రజలకు వీరప్పన్ అంటే ఇతను ఇలా ఉంటాడు అని చూపించిన వ్యక్తి ఎడిటర్ గోపాలన్.

ఇక వీరప్పన్ విషయానికి వస్తే ప్రైవేటు సైన్యం (ఒక సమయంలో వందల సంఖ్యకు విస్తరించింది) నడుపుతూ కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు, భారత సరిహద్దు భద్రతా దళంలోని పారామిలటరీ ఫోర్సులను ముప్పు తిప్పలు పెట్టారు. 184 మంది, అందులో దాదాపు సగం మంది పోలీస్ అధికారులు (ఫారెస్ట్ అధికారులు, ఉన్నతాధి కారులు కలిపి) చంపిన కేసుల్లో వీరప్పన్ వాంటెడ్ గా ఉండేవారు.

200 ఏనుగులను అక్రమంగా చంపి, యుఎస్ డాలర్లు 2.6 మిలియన్ల రూపా యల విలువైన ఏనుగు దంతాలు, దాదాపు యూఎస్ డాలర్లు 22మిలియన్ల విలువైన 10వేల టన్నుల చందనం చెక్కను అక్రమ రవాణా చేసినందుకూ అతను మోస్ట్ వాంటెడ్‌గా నిలిచారు.

1991లో తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ప్రత్యేక టాస్క్ ఫోర్స్ నెలకొల్పి వీరప్పన్ ను పట్టుకునేందుకు చేపట్టిన ప్రయత్నం సంవత్సరాలు గడిచేకొద్దీ దాదాపు రూ.100 కోట్ల ఖర్చుతో భారతదేశ చరిత్రలోకెల్లా అత్యంత ఖర్చు అయిన ఆపరేషన్‌గా నిలిచింది.

ఇంకా తాను దోచుకున్న అటవీ సంపద వేల కోట్లలో ఉంటుంది అని పలు కథనాలు అక్కడి దిన పత్రికలు పెద్ద పెద్ద హెడ్ లైన్స్ వేసి ప్రతీ కథనానికి వీరప్పన్ యుక్త వయసులో ఉన్న ఒకటే ఫొటో అక్కడి పత్రికలు ప్రచురించి ఎల్లో జర్నలిజం దిశగా అడుగులు వేశాయి. ఆ ఫొటో ఒక్కటే ప్రతి పేపర్ కథనానికి ప్రతి సారీ రావడం పై అనుమానం కలిగిన గోపాలన్ ఏంతో పట్టుదల,ధైర్యంతో సాహసోపేత నిర్ణయం తీసుకుని అత్యంత ప్రమాద కారి అని, మనిషి ప్రాణాలు తీయడంలో ఏ మాత్రం దయా, దాక్షిణ్యాలు లేని వ్యక్తి వీరప్పన్ అని తెలిసినా వందల మైళ్ళ అడవిలో ప్రయాణం చేసి పట్టుదలతో వీరప్పన్ జాడ కనిపెట్టి తానొక జర్నలిస్ట్ నని పరిచయం చేసుకుని, మీపై పత్రికలలో ఇలా వరుస కథనాలు వస్తున్నాయని అది ఎంత వరకు నిజం అని తెలుసుకోవడానికి వచ్చానని గోపాలన్ వీరప్పన్ దళానికి సమాచారం అందించాడు.



అంతకుముందే అడవిలో తన స్థావరం వైపు ఎవరో వస్తున్నారని పక్షుల కదలికలు ద్వారా అరుపులు ద్వారా కనిపెట్టిన వీరప్పన్ గోపాలన్ విషయం తన దళ సభ్యులు తెలిపినా గోపాలన్‌ని కలిసేందుకు వీరప్పన్ ఇష్టపడలేదు.

అయినప్పటికీ అక్కడే పట్టువదలని విక్ర మార్కుడు లా కూర్చున్న గోపాలన్ ని అన్ని విధాలా చెక్ చేసి అతని వద్ద ఏ విధమైన ఆయుధాలు లేవని కేవలం అతని వద్ద ఉన్న వీడియో కెమెరా, బ్యాటరీలు, అతని వెంట వచ్చిన కెమెరా మెన్ ని పరిశీలించి అన్నీ నిర్ధారణ చేసుకుని వీరప్పన్ అప్పుడు అతనిని కలిసి ఇంటర్యూ ఇచ్చేందుకు కెమెరా ముందుకు వచ్చాడు.

అలా ధైర్యంగా వ్యవహరించి గోపాలన్ వీరప్పన్ ఇంటర్యూ తీసుకుని తమిళనాడులో టీవీ ల ద్వారా ప్రసారం చేశాడు. ఆ ఇంటర్యూలో వీరప్పన్ అడవి తల్లి ఒడిలో ఉన్న నేను అటవీ సంపదను ఎందుకు దోచుకుంటాను. ఎదో కొద్దిగా నాతల్లి సంపదను వాడుకున్న మాట వాస్తవం ప్రభుత్వం, పత్రికలు చెప్పినట్లు నేను కాదు. నా పేరున స్థానిక పాలకులు, అటవీశాఖ అధికారి శ్రీనివాసన్ అనే వ్యక్తి అటవీ సంపదను పెద్ద ఎత్తున దోచుకుని నా మీద నిందలు మోపారు అని, ఇదే శ్రీనివాసన్ అనే వ్యక్తి తన చెల్లిని ప్రేమించి మోసం చేసినట్లు వీరప్పన్ ఆ ఇంటర్యూలో పాలకులు, అటవీశాఖ అధికారుల తీరును ఎండగట్టాడు.

గోపాలన్ నక్కీరన్ సౌజన్యంతో ఓ టీవీలో ప్రసారం చేసిన వీరప్పన్ ఇంటర్యూ తమిళనాడు ప్రజల మన్ననలు పొంది.. ప్రజలకు వీరప్పన్ పై సానుభూతి లభించగా గోపాలన్ పత్రికకు విశేషమైన ఆదరణ లభించింది. దీనితో గోపాలన్‌కి వీరప్పన్‌కి మధ్య మంచి సహకారం కుదిరింది. ఈ సాకుతో అక్కడ ప్రభుత్వం గోపాలన్ పై పోటా యాక్ట్ అమలు చేసి గోపాలన్‌ని అరెస్ట్ చేసి జైలుకి పంపింది. అప్పటి నుండి గోపాలన్ నక్కీరన్ పత్రిక ప్రశ్నార్థకం అయ్యింది. ఇక పోతే చిన్న పత్రికల పై ఉండే స్వభావం తమిళనాడు ప్రజల్లో తొలగిపోయి పత్రిక పేరే ఇంటి పేరుగా మారి గోపాలన్ కాస్తా ,,"నక్కీరన్ గోపాలన్"గా అప్పట్లో సంచలనాలకు మారు పేరుగా మారింది.

- ఈపూరి రాజారత్నం
M.A,MJMC,(Ph.D)
Journalisam
వెటరన్ జర్నలిస్ట్, 9390062078

ముస్లింలకు ఉచిత విద్య అందించేందుకు వక్ఫ్ బోర్డ్ నూతన పథకం

- 933 ఎకరాల వక్ఫ్ భూమిని 3 ఏళ్లకు లీజుకు ఇవ్వనున్నాం
- కమర్షియల్ భూములను అభివృద్ధి చేసేందుకు ఈఓఐ కింద ఆహ్వానిస్తున్నాం
- జాతీయ, అంతర్జాతీయ డెవలపర్‌లు, పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి
- వక్ఫ్ ఆస్తుల అద్దె సవరణకు రెంట్ రివ్యూ కమిటీను నియమించాం
- అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 3వ వక్ఫ్ బోర్డ్ సమావేశం.
- ప్రవేశపెట్టిన అజెండాల పై ఏకగ్రీవ తీర్మానం
- ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

విజయవాడ: కాళేశ్వర రావు మార్కెట్ వద్ద గల ఏపీ వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 3 వ బోర్డ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన అజెండా లపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలు మ్యానేజింగ్ కమిటీలు, పలు ముతవల్లీలను నియమించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, ముస్లిం లకు ఉచిత విద్య అందించేందుకు నూతన పథకాన్ని ప్రారంభిస్తున్నామని అతి త్వరలో దాని వివరాలు తెలియచేస్తామని అన్నారు.

వక్ఫ్ ఆస్తుల అద్దెల సవరణకు రెంట్ రివ్యూ కమిటీ ను నియమించామని తెలిపారు. 2025-26 నుంచి 2027-28 సంవత్సరాలకు గాను డైరెక్ట్ మ్యానేజ్మెంట్‌లో ఉన్న 933 ఎకరాల వక్ఫ్ ఆస్తులను లీజుకు ఇవ్వనున్నామని తెలిపారు. రాష్ట్రంలో వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగపడే వక్ఫ్ భూములను అభివృద్ధి చేయడానికి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి డెవలపర్లను, సంస్థలను, పారిశ్రామిక వేత్తలను దీర్ఘకాలిక లీజు లేదా పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ద్వారా ఎక్స్క్లుషన్ ఆఫ్ ఇంటరెస్ట్ కింద ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

ఈ భూములపై సౌర విద్యుత్ ప్రాజెక్టులు, పారిశ్రామిక సంస్థలు, వాణిజ్య కాంప్లెక్సులు, విద్యా సంస్థలు, హాస్పిటల్‌లు, ఇతర వాణిజ్య ప్రాజెక్టులు అభివృద్ధి చేసే అవకాశం ఉందని వివరించారు. సమావేశంలో బోర్డ్ సభ్యులైన శాసనమండలి సభ్యులు మొహమ్మద్ రుహుల్లా, శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్, ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, ముక్రం హుస్సేన్, దావూద్ భాషా బఖావి, బేపారి జాకీర్ అహమద్ సీఈఓ మొహమ్మద్ అలీ వక్ఫ్ అధికారులు పాల్గొన్నారు.

హిజ్రాలతో హైదరా'బాధ'

- అసలెవరు? నకిలీలెవరు?
- శుభకార్యాల వేళ హిజ్రాల దోపిడీ అరికట్టేదెలా?
- అడిగినంత ఇవ్వకపోతే ఇళ్లముందే హరం
- పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- న్యాయస్థానాలే రక్షించాలంటున్న నెటిజన్లు
- సుమోటోగా తీసుకోవాలని నెటిజన్ల అభ్యర్థన

హైదరాబాద్,మహానాడు:
హైదరాబాద్‌లో హిజ్రాల దోపిడీ పెరిగిపోయింది. ఫంక్షన్ ఏదైనా ఇంట్లోకి వచ్చేసి డబ్బులు డిమాండ్ చేస్తూ బంధువుల ముందు పరువు తీస్తున్నారని నగరవాసులు వాపోతున్నారు. తాజాగా కూకట్పల్లిలో ఓ ఇంట్లో పూజ జరుగుతుండగా అక్కడికి వచ్చి, రూ.8వేలు వసూలు చేశారు. ఆ తర్వాత ఇంటి గుమ్మానికి తమ సంతకం చేసి వెళ్లిపోయారు. ఇలాంటి ఘటనలపై పోలీ సులకు ఫిర్యాదులందినా, చర్యలు లేవని నెట్టింట విమర్శ లొస్తున్నాయి.

నిజానికి హైదరాబాద్‌తోపాటు పెద్ద నగరాలు, పట్టణాల్లో చిన్న వేడుకలు చేసుకునే ప్రతివారికి ఎదురవుతున్న సామాజిక సమస్య. బంధుమిత్రులతో సరదాగా గడుపుతున్న వేళ, ఇళ్లమీదకు వచ్చిపడుతున్న హిజ్రాల దండును చూసి శుభకార్యాలు చేసుకునే వారు హడలెత్తిపోతున్నారు. అడిగినంత ఇవ్వకపోతే రచ్చ చేస్తున్న వైనం పాపం వారిని స్థానికంగా ఇబ్బందిపెడుతోంది.డబ్బులిచ్చిన వారి ఇళ్ల గోడలపై సంతకం చేసి వెళతారు. అంటే ఇక ఎవరూ ఆ ఇంటికి వెళ్లవద్దని సహచర హిజ్రాలకు సంకేతమన్నమాట. ఇదో బంపర్ఆఫర్ మరి!

మీకు ఎందుకివ్వాలని ప్రశ్నిస్తే ఇక అంతే సంగతి! నిజానికి హిజ్రాలకు ఎవరూ ఏమీ ఇవ్వాల్సిన పనిలేదు. కానీ ఇది బెదిరించి సంపాదించే ఓ తంతుగా మారడంతో, ఎవరి స్తోమతకు తగ్గట్లు వారు డబ్బులు చెల్లించుకోవడం అనివార్యంగా మారింది. వీరిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోరు. 'మీరే వాళ్లకు ఏదో ఇచ్చి వదలించుకోండ'న్న ఉచిత సలహా ఒకటి పారేస్తారు.మార్వాడీ, రాజస్థానీ, ఉత్తరాది వారయితే ఈ హిజ్రాలను పిలిచి మరీ గౌరవిస్తారు. తమ ఇళ్లలో జరిగే శుభకార్యాలకు హిజ్రాలు వచ్చి ఆశీర్వదిస్తే, తమకు శుభం కలుగుతుందన్నది వారి

నమ్మకం. కానీ హిజ్రాలు అందరినీ మార్వాడీల దృష్టి కోణంలోనే చూస్తుండటమే సమస్యగా మారింది.

ఇక ధనవంతులు, షాపుల ప్రారంభోత్సవాల సమయంలో చెప్పాల్సిన పనిలేదు. "ఇదొక సామాజిక సమస్యగా మారింది. ప్రభుత్వం వీరిపై చర్యలకు భయపడుతుంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. వారి నోటికి, చేష్టలకు అంతా భయపడే వారే. అసలు ఇందులో ఎవరు నిజమైన హిజ్రాలో, ఎవరు నకిలీలో తెలియదు. ఈ సమస్యకు న్యాయస్థానాలే పరిష్కారం చూపాలి. న్యాయస్థానమే ఈ సామాజికసమస్యను సుమోటోగా తీసుకుని ప్రజలను రక్షించాల'ని నెటిజన్లు సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. మరి న్యాయ స్థానాలు ఏం చేస్తాయో చూడాలి. అన్నట్లు..రేవంత్‌రెడ్డి సర్కారు ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ పోలీసు విభాగంలో నియమించింది.

హిజ్రాలగుంపు బలవంతపు వసూళ్ళు!

- తీవ్ర ఆందోళనకు గురైన ప్రయాణికులు

విశాఖపట్నం, మహానాడు: విశాఖపట్నంలో ఓ హిజ్రాల గుంపు బలవంతపు వసూళ్ళకు పాల్పడింది. విశాఖ-నర్సీపట్నం నాన్‌స్టప్ బస్సు విశాఖలో బయలుదేరి కంచరపాలెం హైవే పై ఉండగా ఒక్కసారిగా ఆ గుంపు బస్సు ఎక్కి డబ్బులు ఇవ్వాలంటూ బలవంతం చేసింది. పది నుండి వంద రూపాయల వరకు వసూళ్ళు చేశారు. ఇచ్చేవరకు వదలక పోవడం దారుణం ఉందని ప్రయాణికులు ఆవేదన చెందారు. బస్సు ఎక్కి మరీ ప్రయాణికులను దోచుకోవడం తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. ఆ హిజ్రాల గుంపు ఒక సిగ్నల్ పాయింట్ వద్ద ఎక్కి వసూళ్ళు చేసి, మరో సిగ్నల్ పాయింట్ దగ్గర దిగిపోతోందని ప్రయాణికులు తెలిపారు. ఈ సంఘటనపై ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో అణచివేతలు

- హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీఛార్జీ దారుణం
- విద్యార్థుల నిరసనలు రాహుల్ గాంధీకి పట్టవా?
- వెంటనే భూముల వేలం మానుకోవాలి
- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్

హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యం అంటే నిర్భంద పాలన అని మరోసారి రుజువైందని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ మండిపడ్డారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములు వేలం వేయొద్దని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై విచక్షణరహితంగా పోలీసులు లాఠీఛార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండిచారు.

హెచ్‌సీయూ స్వర్ణోత్సవాల వేళ విద్యార్థులకు, యూనివర్సిటీకి లబ్ధి చేకూర్చే హామీలు ఇవ్వాల్సిన కాంగ్రెస్ పర్కార్ పర్యావరణానికి హాని చేటు చేసే నిర్ణయం దారుణమన్నారు. గతంలో ముంబైలోని ఆరే ఫారెస్ట్ గుండా ముంబై మెట్రోరైల్ ప్రాజెక్టు వెళితే పర్యా వరణం దెబ్బతింటుంది కాబట్టి దానిని ఆపాలని చెప్పిన రాహుల్ గాంధీకి యూనివర్సిటీ పర్యావరణం కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

ఛత్తీస్‌గడ్‌లోని హస్ దేవ్ అరణ్యం బొగ్గు గనులను అదానీ ఇస్తే వేలాది చెట్లు తొలగించాలి కాబట్టి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నిరసనలు చేసిన రాహుల్ గాంధీకి యూనివర్సిటీ పర్యావరణం కనిపించడం లేదా అన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమ సమయాన అప్పటీ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే మళ్లీ పదేళ్ల తరువాత మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే యూనివర్సిటీల్లో విద్యార్థుల మీద లాఠీ ఛార్జీకి తెగబడుతున్నాయని దుయ్యబట్టారు.

నాడు హెచ్‌సీయూకి వచ్చి విద్యార్థులకు అండగా ఉంటానని చెప్పిన రాహుల్ గాంధీ, ఇప్పుడు ఎందుకు విద్యార్థుల ఆర్తనాదాలను పట్టించుకోవడం లేదన్నారు. సేవ్ హెచ్‌సీయూ అని యావత్ తెలంగాణ నినదిస్తుంటే కాంగ్రెస్ సర్కార్‌కు కనిపించడం లేదా అన్నారు. అంబేద్కర్ ఆడిటోరియం నుంచి ఈస్ట్ క్యాంపస్ వరకు ర్యాలీ తీయడం విద్యార్థులు చేసిన తప్పా అని ప్రశ్నించారు. విద్యార్థులతో పాటు వారికి మద్దతు తెలిపిన అధ్యాపకుల మీద లాఠీఛార్జీ చేయడం దుర్మార్గమన్నారు.

ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరినీ అణచివేయాలని రేవంత్ రెడ్డి సర్కార్ చూస్తుందన్నారు. 150 ఎకరాల కంటే ఎక్కువ స్థలంలో చెట్లు ఉంటే దానిని తొలగించడానికి అనుమతులు తీసుకోవాలనే వియాన్ని ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. ప్రజాపాలన అని చెప్పుకునే కాంగ్రెస్ సర్కార్ ప్రజలు వ్యతిరేకిస్తున్న హెచ్‌సీయూ భూములను ఎందుకు వేలం వేయాలని చూస్తున్నారని ప్రశ్నించారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 03, ఏప్రిల్ 2025

హెచ్‌సియు భూములపై అటవీ శాఖకు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్: సెంట్రల్ యూనివర్సిటీలో భాగమైన కంచ గచ్చిబౌలిలోని భూములలో పర్యావరణ వ్యవస్థకు తెలంగాణ ప్రభుత్వ తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చేసిన కోలుకోలేని నష్టం – అటవీ సంరక్షణ చట్టం 1980 మరియు వన్యప్రాణుల రక్షణ చట్టం, 1972 ఉల్లంఘన – నివారణ మరియు బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్పా ర్టీ సీనియర్ నాయకులు డా.RS ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో తెలంగాణ అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ మెరూకు అరణ్య భవన్‌లో పిర్యాదు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్పార్టీ రాష్ట్ర నాయకులు డా.చిరుమళ్ల రాకేష్,డా.కురువ విజయ్ కుమార్,కిషోర్ గౌడ్,మన్నె గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రికరణ శుద్ధితో కూటమి నిర్ణయాలు
ప్రజల దరికి తీసుకువెళ్తాం..

- ఎమ్మెల్సీ సోము వీర్రాజు

విజయవాడ, మహానాడు: ఎమ్మెల్సీగా రెండో పర్యాయం మొదలవుతుంది.. నన్ను ఎమ్మెల్సీ గా ఎంపిక చేసిన కేంద్ర పెద్దలకి, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ధన్య వాదాలు.. ఒక కార్యకర్తకి పార్టీ ఏవిధంగా స్పందిస్తుందన్న విషయాన్ని ప్రతి ఒక్క కార్యకర్త గుర్తించాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు కోరారు. ఈ మేరకుఆయన బుధవారం మాట్లాడారు.

నా ప్రస్థానం ఒక కార్యకర్త నుంచి ప్రారంభమైంది.. ఏప్రిల్ 6వ తేదీన బీజేపీ పుట్టిన తేదీ. 1980వ సంవత్సరంలో బీజేపీ ప్రస్థానం మొదలైంది.. ఈ పార్టీ పేరు పెట్టిన దగ్గర నుంచి పార్టీయే నా ఊపిరిగా అనుసంధానిస్తూ ముందుకి వెళ్తున్నట్టు వీర్రాజు తెలిపారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. దేశాన్ని ముందుకు తీసుకెళ్లే ఏకైక పార్టీ బీజేపీ పార్టీ. త్రికరణ శుద్ధితో కూటమి ప్రభుత్వం తీసుకునే సంక్షేమ, అభివృద్ధి నిర్ణయాలు ప్రజలకు దరికి తీసుకువెళ్తాం. రాష్ట్ర ప్రజల కోరిక స్టీల్ ప్లాంట్ లాభాల్లో తీసుకొచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిది. స్టీల్ ప్లాంట్ కార్మికుల్ని ప్రశంసి స్తున్నాం. స్టీల్ ప్లాంట్ రక్షించాలని కేంద్ర మంత్రి కుమార స్వామి పడిన తపన అద్భుతం. జల జీవన్ మిషన్ ఆంధ్రప్రదేశ్ లో మరింత వేగవంతం చేయటానికి పవన్ కల్యాణ్ చాలా కృషి చేశారు.

గత ప్రభుత్వంలో జల జీవన్ మిషన్‌కు వచ్చిన నిధులు పక్కతోవ పట్టించారు. అప్పటి పాలన అంతా మొద్దు నిద్రలా సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పవన్ కల్యాణ్ అభ్యర్థన మేరకు సమయం నిధులు పెంచారు. ఆయుష్మాన్ భారత్ లో భాగంగా 105 రకాల మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయి. వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ ప్రతి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే దిశగా తీర్చి, తద్వారా భవ్యమైన దేశంగా తీర్చి దిద్దాలని కృషి చేస్తున్నారు. రోడ్ల నాణ్యతపై ఒక ప్రత్యేకమైన బృందాన్ని ఏర్పాటు చేసి అవినీతి లేకుండా చేసి చూపిస్తున్నారు.

అనూషను అభినందించిన మంత్రి మండిపల్లి

విజయవాడ, మహానాడు: సాఫ్ట్ టెన్నిస్ క్రీడ్రాకారిణి ఎన్.అనూష బుధవారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో క్రీడా శాఖ మంత్రి మండిపల్లి

రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.అనూష గ్రేటర్ నోయిడాలో మార్చి 26వ తేదీ వరకూ జరిగిన ఫస్ట్ సౌత్ ఏషియన్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్ షిప్ టీమ్ ఈవెంట్లో గోల్డ్ మెడల్, ఇండివిడ్యువల్ డబుల్స్లో బ్రాంజ్ మెడల్, మిక్స్డ్ డబు ల్స్లో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సంద ర్భంగా మంత్రి అనుషను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు.

క్లీన్ ఎయిర్ సిటీగా కడప

కడప: రాష్ట్రంలో అత్యంత తక్కువ కాలుష్యం ఉన్న నగరంగా కడప నిలిచినట్లు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ తెలిపింది. ఇక్కడ 10 పీఎం స్థాయిలో 42 పాయింట్లు ఉన్నట్లు వెల్లడించింది. ఆ తర్వాత 52

పాయింట్లతో నెల్లూరు రెండో స్థానంలో ఉండగా కర్నూలు, ఒంగోలు (56) మూడో స్థానంలో నిలిచాయి. అత్యంత కాలుష్య నగరంగా విశాఖపట్నం (120) నిలిచింది. అమరావతిలో ఎలాంటి పరిశ్రమలు, నిర్మాణాలు లేక పోయినా కాలుష్యం 71 పాయింట్లుగా నమోదైంది.

ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన కె.నాగబాబు

అమరావతి, మహానాడు:

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు శాసన మండలి సభ్యునిగా బుధవారం శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు సమక్షంలో ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టారు. గత మార్చి నెలలో జరిగిన శాసన సభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమిలో భాగంగా జనసేన అభ్యర్థిగా పోటీకి దిగిన కె.నాగబాబు శాసన మండలి సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ సూచనలకు అనుగుణంగా బుధవారం శాసన మండలిలో ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ

సందర్భంగా నాగబాబుకి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు , శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు,నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ, మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తదితరులు శుభాకాంక్షలు తెలియచేశారు.

వర్గీకరణ పోరాటంలో ఉద్యమకారులపై
నమోదైన కేసులు వెంటనే ఎత్తివేయాలి

- మాదిగ దండోరా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలి
- ప్రభుత్వ పథకాలలో దండోరా ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలి
- మాదిగ అమరవీరుల జ్ఞాపకాలతో స్మృతివనాల్ని ఏర్పాటు చేయాలి.
- మంత్రి దామోదర్ రాజనర్సింహని కలిసి విజ్ఞప్తి చేసిన మాదిగ దండోరా ఉద్యమకారులు .
- ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదం తెలిపి రాష్ట్రంలో అమలుకు కృషి చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, సీఎం రేవంత్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యమకారులు.

హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ఉద్యమకారులపైనా రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన కేసులను బేషరతుగా వెంటనే ఎత్తి వేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహని హైదరాబాదులోని తన నివాసంలో మాదిగ దండోరా ఉద్యమకారులు కలిసి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ పై ఇచ్చిన తీర్పును దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయడంలో తీవ్రంగా కృషి చేస్తున్న రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు మాదిగ దండోరా ఉద్యమకారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్సీ వర్గీకరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ వేసి అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును ఆమోదం చేసి అమ లుకు ముందుకొచ్చినందుకు దానిలో ముఖ్య భూమిక పోషించిన మంత్రి దామోదర్ రాజనర్సింహకి ఉద్యమకారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా SC వర్గీకరణ పోరాటంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారుల పైన నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు కేటాయించినట్లు 250 గజాల ఇంటి స్థలాన్ని మాదిగ దండోరా ఉద్యమకారులకు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల లో దండోరా ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే, హైదరాబాద్ నగరంలో మాదిగ అమరవీరుల జ్ఞాపకాలతో స్మృతి వనాల్ని ఏర్పాటు చేయాలని మాదిగ దండోరా ఉద్యమకారులు మంత్రి దామోదర్ రాజనర్సింహ తో కలిసి విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా మాదిగ దండోరా ఉద్యమకారులు చేసిన విజ్ఞప్తిపై రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా మాదిగ దండోరా ఉద్యమకారులపై నమోదైన కేసులను ఎత్తివేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చిస్తామన్నారు.

మాదిగ దండోరా ఉద్యమకారులు రుద్రవరం లింగస్వామి, జిల్లా వెంకటేష్, వెంకట్ గల్ల వెంకట్, మీసాల కురుమయ్య, బడుగుల బాలకృష్ణ, పాలడుగు రమేష్, నక్క వెంకటేష్, గంగాపురం నరసింహ, అరుణ్, నరేష్, అడ్వకేట్ మల్లన్నలు పాల్గొన్నారు.

నువ్వు దేవుడయ్యా సామీ..

- వంటమనిషికి రూ.కోటి!
- బాంబే హైకోర్టులో పిటిషన్లు

(వెంకటేశ్వర్లు)

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా వీలునామా గురించి మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. తనకు ఎప్పటి నుంచో వంట వండిపెడుతున్న కుక్ రజన్ షాకు ఆయన రూ. కోటి ఇచ్చారు. అందులో రూ. 51 లక్షల రుణ మాఫీ కూడా ఉంది. ఇంటి పనులు చేసే సుబ్బయ్యకు రూ.66 లక్షలు, సెక్రటరీ డెల్నాజుకు రూ.18 లక్షలు రుణం మాఫీ చేశారు. తన ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ శంతను నాయుడుకు ఎంబీఏ కోసం పొడిగించిన రూ.కోటి రుణాన్ని రతన్ టాటా మాఫీ చేశారు. పార్ట్ టైమ్ హెల్పర్లు, కార్ క్లీనర్లకు రూ. లక్ష పంపిణీ చేయాలని కూడా ఆయన వీలునామాలో నిర్దేశిస్తున్నారు.

రతన్ టాటా తన దుస్తులను NGOలకు విరాళంగా ఇవ్వాలని టాటా 2022 ఫిబ్రవరి 23 నాటి తన వీలు నామాలో పేర్కొన్నారు. తద్వారా వాటిని పేదలకు పంపిణీ చేయవచ్చు. బ్రూక్స్ బ్రదర్ షర్టులు, హెర్మ్స్ టైలు, పోలో, డాక్స్, బ్రియోని సూట్లు వంటి బ్రాండ్లను రతన్ టాటా ధరించేవారు. రతన్ టాటా పెంపుడు జంతువు టిటో గురించి వీలునామాలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. జర్మన్ షెపర్డ్ కోసం ఆయన రూ.12 లక్షలు కేటాయించారు. ప్రతి త్రైమాసికానికి రూ.30వేల చొప్పున వాటికి ఖర్చే చేసేలా నిధులను ఇవ్వాలని తన వీలునామాలో రాశారు.

అటు తన సవతి సోదరీమణులు అయిన శిరీన్ జజీభోయ్, దియానా జజీభోయ్ పేరు మీద రూ.800 కోట్లు రాశారు రతన్ టాటా. ఇందులో ఫిక్స్డ్ డిపాజిట్లు, స్టాక్స్తో పాటు ఖరీదైన వాచ్లు, పెయింటింగ్స్ వంటి విలువైన వస్తువులున్నాయి. ఇక టాటా గ్రూప్ మాజీ ఉద్యోగి, రతన్కు అత్యంత సన్నిహితుడైన మోహిన్ ఎం దత్తాకు కూడా ఏకంగా రూ.800 కోట్ల విలువైన ఆస్తులు రాసిచ్చారు.

కాగా రతన్ టాటాకు రూ.10వేల కోట్ల ఆస్తులుండగా, రూ.3800 కోట్లను దానధర్మాలకు ఇచ్చేశారు. 2022 ఫిబ్రవరి 23న రాసిన ఈ వీలునామా ప్రకారం ఆస్తుల కేటాయింపు జరగాల్సి ఉంటుంది. ఇప్పటికే దీనిపై బాంబే హైకోర్టులో పిటిషన్లు దాఖలైంది. ఇదంతా పూర్తయ్యేసరికి మరో ఆరు నెలలు పడుతుంది.

చంద్రబాబు నాయుడుని కలిసిన నాగబాబు

అమరావతి, మహానాడు:

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాసన మండలి సభ్యులు కె. నాగబాబు బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. శాసన మండలిలో ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టిన అనంతరం నాగబాబు, ఆయన సతీమణి పద్మజ ముఖ్య మంత్రి కార్యాలయానికి చేరుకుని చంద్రబాబు నాయుడుని

కలిసి శాలువాతో సత్కరించిన అనంతరం బొకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాగబాబు ని శాలువాతో సత్కరించి కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు.

ఓపీఎస్ పెన్షన్‌దారుల హక్కులను హరించే చట్ట సవరణ

మన దేశం శ్రేయో రాజ్యం. ఈ శ్రేయో రాజ్యంలో ప్రజల శ్రేయస్సును కాపాడే బాధ్యత ప్రభుత్వాలది. ఆ ప్రభుత్వాలు పెన్షన్ భారం నుంచి బయటపడటానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగానే రెండు దశాబ్దాల కిందట వాజపేయి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని రద్దుచేసి కొత్తగా జాతీయ పెన్షన్ విధానాన్ని తెచ్చింది.

'కొత్త పెన్షన్ వద్దు– పాత పెన్షన్ ముద్దు' అని ఉద్యోగులు, పెన్షనర్లు రెండు దశాబ్దాలుగా ఆందోళన చేస్తుంటే పాలకులు పట్టించుకోవడం లేదు. మళ్లీ అదే బీజేపీ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి బదులుగా కొత్త పెన్షన్ విధానంలో కొన్ని మార్పులు తెస్తూ 2025, ఏప్రిల్ 1 నుంచి అమలయ్యే యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని తెచ్చింది. అంతేకాకుండా పాత పెన్షన్ దారులకు హానిచేసే మరో బిల్లును 2025–2026 ఆర్థిక బిల్లులో భాగంగా గుట్టుచప్పుడు కాకుండా లోక్‌సభ ఆమోదించింది.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఒక వైపు ఉద్యోగులు ఆందోళన చేస్తుంటే మరోవైపు పెన్షన్‌దారులకు నష్టదాయకంగా ఉండేవిధంగా లోక్‌సభ ఆమోదించిన ఈ బిల్లును త్వరలోనే రాజ్యసభలో ఆమోదింపజేసుకుంటారు. ఆ తర్వాత రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టమవుతుంది. పెన్షనర్లను పాత, కొత్త పెన్షనర్లుగా విడదీయడం ఈ బిల్లులోని ముఖ్య విషయం.

ఈ బిల్లులోని సవరణల ద్వారా కేంద్ర ప్రభుత్వ పౌర సేవల (సివిల్ సర్వీసెస్) పెన్షన్ నిబంధనలు 1972, 2021 అసాధారణ (ఎక్స్ట్రార్డినరీ) పెన్షన్ నిబంధనలు 2023లో మార్పులు వస్తాయి. కొత్త సవరణల ద్వారా వేతన సవరణల ఫలితంగా వచ్చే లాభాలను వేతన సవరణ కమిషన్ సిఫారసులు అమలైన తేదీ తర్వాత పదవీ విరమణ పొందిన ఉద్యోగులకే వర్తిస్తాయి. ఆ తేదీకి ముందు రిటైరైన పింఛనర్లకు పే కమిషన్ సిఫారసు చేసిన లాభాలు వర్తించవు. పే కమిషన్ సిఫారసులను ఎప్పుడు ఎలా అమలుచేయాలో నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

దీని ద్వారా పెన్షన్ హక్కులు ఎవరికి వర్తించాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సవరణ సంఘం సిఫారసులు 2026 జనవరి 1 నుంచి అమలు చేయవలసి ఉన్నది. ఇప్పుడు ఈ చట్టం ద్వారా పెన్షనర్లు రెండు గ్రూపులు అవుతారు. అంటే 01–01–2026 ముందు పదవి విరమణ చేసినవారు, తర్వాత పదవీ విరమణ చేసినవారు. అట్లే ఈ చట్టం ద్వారా వేతన కమిషన్ అమలుచేసిన తేదీ లేదా కేంద్రం నిర్ణయించిన తేదీ ప్రకారం.. పదవీ విరమణ చేసినవారికి మాత్ర మే ఆర్థిక లాభం చేకూరుతుంది. మిగిలినవారికి ఆర్థిక లబ్ధి ఉండదు.

వారికి ప్రస్తుతం పొందుతున్న పెన్షన్ మాత్రమే వస్తుంది. అట్లే ఒక కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ 01.03.2025న పదవీ విరమణ చేశారు, కానీ కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘ సిఫారసులు 01.01.2026 నుంచి అమలు చేస్తే, ముందు పదవీ విరమణ చేసినవారు ఎవరికి ఈ చట్టం ప్రకారం ఆర్థిక లబ్ధి జరుగదు. అంటే 1.1.26 తదుపరి పదవీ విరమణ చేసినవారికి మాత్రమే వేతన సంఘం సిఫారసుల లబ్ధి వర్తిస్తుంది.

పెన్షనర్లను పదవీ విరమణ తేదీ ఆధారంగా వేరు చేయడం అసమంజసమని గతంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ సవరణ బిల్లు ద్వారా ప్రభుత్వం ఆ తీర్పును నిర్వీర్యం చేస్తూ పెన్షనర్లను పదవీ విరమణ తేదీ ఆధారంగా నిర్ణయించడానికి ప్రభుత్వానికి అధికారం కల్పిస్తున్నది. ఈ బిల్లు చట్టరూపంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తే, రాష్ట్రాలు కూడా అమలుచేస్తాయి. ఫలితంగా మన రాష్ట్రంలోని పెన్షనర్లు కూడా తీవ్రంగా నష్టపోతారు. కేంద్ర ప్రభుత్వ కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా నుంచి పెన్షన్ పొందుతున్న పెన్షనర్లకు ఈ మార్పు వర్తిస్తుందని బిల్లులో పేర్కొన్నారు.

కొంతమంది ఈ చట్టం న్యాయపరంగా చెల్లదని సీనియర్ పెన్ష నర్లకు తక్కువ పెన్షన్, జూనియర్లకు ఎక్కువ పెన్షన్ వచ్చే అవకాశం ఉండటం వల్ల పెన్షన్ అనామలీలు ఏర్పడుతాయనుకుంటున్నారు. కానీ, కేంద్రం బిల్లులో ఈ అంశాన్ని కూడా ప్రస్తావించింది. సుప్రీం కోర్టు ఇచ్చిన కొన్ని తీర్పులను ఉటంకిస్తూ పెన్షన్ చెల్లింపు అనేది డిఫర్డ్ వేజ్‌గా గుర్తిస్తున్నామని, అందుకే పెన్షన్ చెల్లింపు ఉన్నదని పేర్కొంటూనే, 1950, 1960,1970లలో పనిచేసిన ఉద్యోగికి 1986లో పెన్షన్ చెల్లించాల్సిన అవసరం ఏమిటని, ఉద్యోగి పనిచేసిన కాలపు డిఫర్డ్ వేజ్‌ను పెన్షన్‌గా ఇప్పటికే ఆ పెన్షనర్‌కు చెల్లిస్తున్నారు. కనుక పెన్షన్ పెంపుదల అవసరం లేదని బిల్లులో స్పష్టంగా పేర్కొన్నారు.

ప్రభుత్వం పెన్షన్ పెరుగుదల అంశాన్ని మరింత విశదీకరిస్తూ మూడో వేతన సంఘం నుంచి ఇప్పటి 7వ వేతన సంఘం దాకా పెన్షన్ పెరుగుదలపై విస్తృత చర్చ జరగాలని అన్ని వేతన సంఘాలు చెప్పాయని, కనుక ఇకపై వేతన సంఘం ఏర్పాటు తర్వాత ఆయా సిఫారసులను అమలుచేయాల్సిన తేదీ తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి మాత్రమే వేతన సంఘం సిఫారసులు వర్తిస్తాయని, అంతకుముందు రిటైర్ అయినవారికి కాదని పేర్కొన్నారు. ఫైనాన్స్ బిల్లుపై సంపూర్ణ అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉండటం, న్యాయ పరిధిలో చాలెంజ్‌కు నిలబడే అవకాశాలు తక్కువ ఉండటం ఈ సందర్భంగా గమనించాలి.

లోక్‌సభలో ప్రశ్న సంఖ్య 235కు సమాధానం ఇస్తూ 61 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ సివిల్ పెన్షనర్లకు, డిఫెన్స్ పెన్షనర్లకు 8వ వేతన సవరణ కమిషన్ సిఫారసులను వర్తింపజేస్తామని ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం తాను ఇచ్చిన హామీకి భిన్నంగా ఈ సవరణ బిల్లును తేవడం దుర్మార్గం. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు పన్నులను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించింది. కొత్తగా పెట్టుబడులు పెట్టే వారికి పన్నును 15 శాతానికి తగ్గించింది. దీంతో ఏడాదికి రూ.1.5 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది.

కార్పొరేట్లకు బ్యాంకుల్లో పేరుకుపోయిన బకాయిలను రూ.17 లక్షల కోట్ల వరకు మాఫీ చేసింది. కార్పొరేట్ పెట్టుబడిదారులకు ఇన్సెంటివ్ రూపేణా రూ.2 లక్షల కోట్లు ఇచ్చింది. పెట్టుబడిదారులను సంతృప్తిపరిచేందుకు ఇంత డబ్బు వినియోగించే ప్రభుత్వాలు పెన్షనర్ల కడుపు కొట్టడానికి సిద్ధం కావడం శోచనీయం. 'ఉన్ని బట్టలు ఇమ్మంటే ఉన్న బట్టలే పీకేసినట్లు' నేడు మోదీ ప్రభుత్వం ఉద్యోగుల సమంజస డిమాండ్లన్నింటినీ బేఖాతరు చేస్తూ, ఓపీఎస్ పెన్షన్ దారుల హక్కులను కూడా హరించివేస్తూ ఈ చట్ట సవరణకు శ్రీకారం చుట్టింది. పెన్షన్లకు కోతలు పెట్టే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెన్షనర్లతోపాటు, అఖిల భారత స్థా యిలో ఉద్యోగులు, ఉపాధ్యాయు లు, ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు సంఘటితమై దేశవ్యాప్తంగా సుదీర్ఘ సమరాన్ని సాగించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

- కె.వేణుగోపాల్
9866514577
(వ్యాసకర్త: పూర్వ అధ్యక్షులు, ఏపీటీఎఫ్)

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 03, ఏప్రిల్ 2025 ||

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన సోము వీర్రాజుని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి వద్ద మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియచేసిన బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు మరియు జిల్లా నాయకులు

కొణిదల నాగబాబు ప్రమాణస్వీకారం కార్యక్రమంలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులుగా కొణిదల నాగబాబు బుదవారం అసెంబ్లీలో శాసనమండలి చైర్మన్ హాల్ లో ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కార్తీ చిదంబరం పేమెంట్‌తోనే మాట్లాడారా?

- ప్రకాష్ రాజ్,ధృవ్ రాఠీ పేమెంట్ తోనే మాట్లాడారా
- పెయిడ్ బ్యాచ్ సీఎం,మంత్రులు
- పేమెంట్ మీద పేటెంట్ కాంగ్రెస్ పార్టీకి
- గురువు మొదలుపెట్టిన పేమెంట్‌ను శిష్యుడు రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారు
- బీజేపీ సహాయంతోనే రేవంత్ రెడ్డి 400 ఎకరాల భూమిని తీసుకుంటున్నారు
- 400 ఎకరాల భూమిపై చీకటి ఒప్పందం
- మాజీ మంత్రి జి .జగదీష్ రెడ్డి

హైదరాబాద్: సెంట్రల్ యూనివర్సిటీని కాపాడుకునేందుకు పోరాటం చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జిని ఖండిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్లదుర్మార్గంగా వ్యవహరిస్తోంది. సోషల్ మీడియా, మీడియా, రైతులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతుంది. విద్యార్థులు, యువత మద్దతుతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తెలంగాణ ఉద్యమం 1969లో వచ్చాక హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వచ్చింది. సెంట్రల్ యూనివర్సిటీని కాపాడుకునేందుకు విద్యార్థులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది

కాంగ్రెస్ అంటేనే కేసులు,లాఠీఛార్జిలు. మంత్రులు అక్కసు వెళ్లగక్కి విద్యార్థులను అవమానించి పెయిడ్ బ్యాచ్ అని మాటాడారు. పెయిడ్ బ్యాచ్ సీఎం,మంత్రులు. విద్యార్థులు పెయిడ్ బ్యాచ్ అయితే కేసులు, లాఠీఛార్జిలు భరిస్తారా? పీసీసీ,సీఎం,మంత్రి పదవులు పేమెంట్‌తోనే అవుతున్నాయని ప్రజలకు తెలుసు. పేమెంట్ మీద పేటెంట్ కాంగ్రెస్ పార్టీకి దక్కుతుంది. పేమెంట్లతోనే కాంగ్రెస్ నేతలకు పదవులు వచ్చాయి.

కాంగ్రెస్ పార్టీలో ఉన్న మంత్రులు పేమెంట్లతో పదవులు పొందారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న నేతలు ప్రజల నుండి వచ్చిన వాళ్ళు కాదు. తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం హెచ్.సి.యూ విద్యార్థులకు అండగా నిలిచారు. కార్తీ చిదంబరం పేమెంట్ తోనే మాట్లాడారా? ప్రకాష్ రాజ్,ధృవ్ రాఠీ పేమెంట్ తోనే మాట్లాడారా? 2012 సెప్టెంబర్ 16న హెచ్.సి.యూ భూములు ప్రైవేటు వ్యక్తులకు చంద్రబాబు ఇస్తే, కాంగ్రెస్, బిఆర్ఎస్ అడ్డం పడుతున్నాయని టీడీపీలో ఉండి రేవంత్ రెడ్డి అన్నారు. గురువు మొదలుపెట్టిన పేమెంట్ ను శిష్యుడు రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారు

కేసీఆర్ హరితహారం చేస్తే కాంగ్రెస్ హరిత సంహారం చేస్తోంది. సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న జంతువులు చిత్రహింసలకు గురి అవుతున్నాయి. తమ బాధ్యత కాకపోయినా విద్యార్థులు పోరాటం చేస్తున్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే అధికారులతో మాట్లాడి

పోలీసులను అడ్డుకోవచ్చు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి నాటకం ఆడుతున్నాయి. కిషన్ రెడ్డి,బండి సంజయ్ కు చిత్తశుద్ధి ఉంటే సెంట్రల్ యూనివర్సిటీలోకి రాకుండా పోలీసులను అడ్డుకోవచ్చు

సెంట్రల్ యూనివర్సిటీ అధికారిగా వీసీ ఉంటారు. డ్రోన్ కేమెరాలతో జేసీబీ వీడియోలు తీస్తే ఐదుగురు విద్యార్థులను అరెస్టు చేశారు. బీజేపీ సహాయంతోనే రేవంత్ రెడ్డి 400 ఎకరాల భూమిని తీసుకుంటున్నారు. ప్రభుత్వ భూములపై రాష్ట్ర ప్రభుత్వానికి హక్కు వుంటుంది. పార్కులను,అడవులను ప్రభుత్వం అమ్ముతుందా? సెంట్రల్ యూనివర్సిటీపై రేవంత్ రెడ్డికి హక్కు లేదు. సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ని ఎకరాలు ఉన్నాయో ఇప్పటి వరకు తెలియదు. ఫోర్త్ సిటీలో,ఫ్యూచర్ సిటీలో భూమి ఇచ్చుకోవచ్చు కదా రేవంత్ రెడ్డి?

గురువులాగా అద్భుతమైన ఫోర్త్ సిటీ కడతామని రేవంత్ రెడ్డి అంటున్నారు. 400 ఎకరాలు

ప్రభుత్వానిది అయితే దొంగల్లాగా అర్ధరాత్రి ఎందుకు వెళ్లారు? 400 ఎకరాల భూముల్లో ప్రభుత్వ పెద్దల చీకటి కోణం ఉంది. 400 ఎకరాల భూమిపై చీకటి ఒప్పందం ప్రభుత్వం చేసుకుంది. ఐటీ పార్కులు ఫోర్త్ సిటీలో ఎందుకు కట్టకూడదు? చాలా ఐటీ పార్కుల్లో స్థలం ఉంది.

గురువు రియల్ ఎస్టేట్ దందా కోసం భూమిని ప్రయివేటు వాళ్ళకు కట్టబెట్టారో, ఇప్పుడు శిష్యుడు అదే బాటలో నడుస్తున్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో మూడు చెరువులు ఉన్నాయి. హైడ్రా, రంగనాథ్ ఎక్కడికి వెళ్లారో తెలియడం లేదు. సేవ్ హెచ్.సి.యూ అనే స్లోగన్ కు ఐదు లక్షల మంది మద్దతు తెలిపారు. ఐదు లక్షల మంది పెయిడ్ బ్యాచేనా? బిఆర్ఎస్,కేటీఆర్పైన విషం కక్కడం ఎందుకు?

ప్రతిపక్ష పార్టీగా బిఆర్ఎస్ మద్దతు కోరడం విద్యార్థులు చేసిన తప్పా? సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటం రాహుల్ గాంధీకి తెలియడం లేదా? చెల్లింపుల కోసమే రాహుల్ గాంధీ మాట్లాడటం లేదా? హెచ్.సి.యూ.లో జరుగుతున్న మారణ కాండను ప్రభుత్వం ఆపాలి. పదేళ్ళల్లో మేము కోర్టుల్లో ఫైట్ చేయకుండా తీర్పు వచ్చిందా? కోర్టు తీర్పు వచ్చిన తర్వాత ప్రభుత్వం ఏం చేస్తోంది? ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న గొప్ప పని ఏంటి?

రైతు బంధు పేరు చెప్పి తెచ్చిన 10 వేల కోట్ల డబ్బులను కమీషన్లకు వాడుకుంటున్నారు. మాట్లాడిన వాళ్లంతా గుంట నక్కలేనా? గుంట నక్కలు అయితే జంతువులు కాదా. తెలంగాణలో మీ లాంటి గుంట నక్కలు ఉన్నాయి.

విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్ రావు, ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పల్ల ప్రవీణ్ రెడ్డి, వల్లమల్ల కృష్ణ, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల సతీష్ పాల్గొన్నారు.

లోకేష్‌కు ఘన స్వాగతం

గన్నవరం, మహానాడు: గన్నవరం విమానాశ్రయంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పిఎంఎస్ ప్రసాద్‌కు మంత్రి నారా లోకేష్, సిఎస్ విజయానంద్ స్వాగతం పలికారు. అనంతరం రిలయన్స్ బృందం తో కలిసి హెలికాప్టర్ లో మంత్రి నారా లోకేష్ కనిగిరి బయలుదేరారు. ఉదయం 9.15 నిమిషాలకు కనిగిరి చేరుకుంటారు. కనిగిరిలో రిలయన్స్ ఏర్పాటు చేయబోతున్న సిబిజి ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో లోకేష్ పాల్గొంటారు.

అర్హులకు కార్పొరేషన్ రుణాలు

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, మహానాడు: అర్హులకు కార్పొరేషన్ రుణాలు అందుతాయని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. బుధవారం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా గ్రీవెన్స్ డే నిర్వహించారు. ప్రజలు, పార్టీ నేతలు,

కార్యకర్తల నుండి పలు అర్జీలు స్వీకరించారు. గుంటూరు కొరిటెపాడుకు చెందిన ఓ మహిళా చిట్టీల పేరుతో 2024 సంవత్సరంలో సుమారు రూ.3 కోట్ల రూపాయలతో ఉడాయించిందని తమకు న్యాయం చేయాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేని కోరారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని కొందరు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే బాధిత మహిళలతో మాట్లాడుతూ ఈ విషయం గురించి పోలీసు ఉన్నత అధికారులతో మాట్లాడి న్యాయం చేయిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా కార్పొరేషన్ల రుణాల విషయంలో రాజకీయ జోక్యం ఉండదని, ప్రతి రూపాయి అర్హులయిన పేదవారికి అందుతుందని ఎమ్మెల్యే తేల్చి చెప్పారు.అదేవిధంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ లో భాగంగా పి-4 గురించి వైసీపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని, గత ప్రభుత్వంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి పోలవరం డయా ఫ్రమ్ వాల్, కాఫర్ డ్యాం గురించి తెలియదని చెప్పిన మతిలేని వ్యక్తి ఈ రోజు పి-4 గురించి అవహేళన చేస్తున్నారని ఆమె విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, పవన్ కల్యాణ్, లోకేష్ గురించి నోరు పారేసుకుంటున్నారని, మీడియా ముందుకు వచ్చినప్పుడు విచక్షణతో వ్యవహరించాలని సూచించారు. ఈ గ్రీవెన్స్‌లో నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి, కనకాచారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు 3 వేల మందికి శాశ్వత ఇళ్ళ హక్కు పత్రాల పంపిణీ

- దశాబ్దాల సమస్యకు 10నెలల్లో పరిష్కారం చూపిన లోకేష్!
- మొదటి విడతలో ప్రభుత్వస్థలాల్లో నివసిస్తున్న వారికి పట్టాలు
- గతంలో ఇళ్లపైకి పొక్లయినర్లను పంపిన నాటి ప్రజాప్రతినిధి
- లోకేష్ సాయాన్ని జీవితాంతం మర్చిపోమంటున్న లబ్ధిదారులు
- నేటి ఉదయం 10.59 గంటలకు ఉండవల్లిలో తొలి పట్టా అందజేయనున్న నారా లోకేష్

అమరావతి, మహానాడు: ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, గెలిచిన తర్వాత అయిదేళ్లు అడ్రస్ లేకుండా వెళ్లిపోయిన ప్రజాప్రతినిధులను ఇప్పటివరకు చూశాం. ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన మరుసటిరోజు నుంచే నియోజకవర్గ ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నేతను ఇప్పుడే చూస్తున్నాం. దశాబ్దాలుగా మంగళగిరి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ఒక జఠిల సమస్యకు 10 నెలల్లోనే పరిష్కారం చూపారు రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి, మంగళగిరి శాసన సభ్యుడు నారా లోకేష్. తాను మాటల మనిషిని కాదని, చేతల్లో తానేమిటో చూపించారు. తొలివిడతలో మూడు వేల మందికి శాశ్వత హక్కు పత్రాలను అందించబోతున్నారు.

మంగళగిరి నియోజకవర్గంలో వేలాదిమంది ప్రజలు దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో చిన్న ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. వీరంతా రెక్కాడితేగానీ డొక్కాడని పేద కుటుంబాలకు చెందినవారు. కాయకష్టం చేసుకుని ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ పట్టాలు లేకపోవడంతో వారికి ఎటువంటి అధికారిక హక్కులు లేవు. తమకు పట్టాలు ఇప్పించాలని ఏళ్లతరబడి ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎన్నికల సమయంలో ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యను యువనేత లోకేష్ దృష్టికి తెచ్చారు. తాము ఉంటున్న స్థలాలకు శాశ్వత హక్కు కల్పించాలని విన్నవించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యకు పరిష్కారం చూపుతానని ఆనాడు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే ఇచ్చిన హామీ అమలు కోసం మంత్రి లోకేష్ కార్యాచరణ ప్రారంభించారు.

సమస్య పరిష్కారానికి లోకేష్ నిరంతర చర్చలు

గత పది నెలలుగా అటవీ, రెవిన్యూ, ఇరిగేషన్, రైల్వే శాఖల అధికారులతో మంత్రి లోకేష్ నిరంతరం చర్చలు జరిపారు. ఢిల్లీ

పర్యటనకు వెళ్లినపుడు సైతం రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్, ఇతర రైల్వే అధికారులతో మాట్లాడి తమ నియోజకవర్గంలో నిరుపయోగంగా ఉన్న రైల్వే భూములను పేదలకు ఇవ్వాల్సిందిగా పదేపదే విజ్ఞప్తనలు చేస్తూ వచ్చారు. ఇతర శాఖల నిబంధనల మేరకు భూమికి భూమి ఇస్తామని, పేదలు దీర్ఘకాలంగా నివసిస్తున్న స్థలాలను వారికి ఇవ్వాలని ఉత్తరప్రత్యుత్తరాలు జరిపారు. మంత్రి లోకేష్ చొరవతో దీర్ఘకాలంగా పేదలు ఎదుర్కొంటున్న మొండి సమస్యకు తొలిదశ పరిష్కారం లభించింది. నేడు మొదటి పట్టాను ఉండవల్లి గ్రామంలో ఉదయం 10.59 గంటలకు అందజేయనున్నారు. నారా లోకేష్ స్వయంగా లబ్ధిదారుల నివాసానికి వెళ్లి పట్టా అందజేసి మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

రేపటినుంచి మంగళగిరి డాన్ బాస్కో స్కూల్ ను అనుకోని ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేస్తున్న వేదికపై యర్రబాలెం, నీరుకొండ, కాజా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారు. ఏడోతేదీన పెనుమాక, ఉండవల్లి, ఇప్పటం, కొలనుకొండ, పద్మశాలి బజార్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తారు. ఎనిమిదోతేదీన రత్నాల చెరువు, మహానాడు-2 కు చెందిన లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తారు, ఏప్రిల్ 11న సీతానగరం, సలాం సెంటర్, డ్రైవర్స్ కాలనీకు చెందిన లబ్ధిదారులకు, 12న మహానాడు-1, ఉండవల్లి సెంటర్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు లోకేష్ పట్టాలు అందజేయనున్నారు.

గతంలో ఎప్పుడు ఎవరి ఇళ్లపైకి పొక్లయినర్లు పంపుతారో తెలియక తీవ్ర భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపిన మంగళగిరి ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు. దీర్ఘకాలిక మొండి సమస్యకు పరిష్కారం చూపడమేగాక శాశ్వత హక్కు సైతం కల్పిస్తుండటంతో ఆనందంతో పొంగిపోతున్నారు. తమకోసం ప్రత్యేక శ్రద్ధవహిస్తున్న లోకేష్ తమ శాసన సభ్యుడిగా రావడం అదృష్టంగా భావిస్తున్నారు.

మనసులో మాట!

లోకేష్ సాయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాం

రాజమండ్రి గోవిందు, సీతామహాలక్ష్మి అనే దంపతులు ఇద్దరు బిడ్డలతో ఉండవల్లిలోని అమరారెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్నారు. 15ఏళ్ల క్రితం ఉండవల్లి అమరారెడ్డి నగర్ లోని కొండ పోరంబోకు స్థలంలో వారు ఇల్లు నిర్మించుకుని ఉంటున్నారు. రజక కులానికి చెందిన గోవిందు డ్రైవర్‌గా పని చేస్తుండగా, భార్య సీతామహాలక్ష్మి బట్టలు ఉతకడం, ఇస్త్రీ పనిచేసి బిడ్డలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తాము ఉంటున్న స్థలానికి పట్టా ఇప్పించాలని గతంలో వారు ఎందరో ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది.

మంత్రి లోకేష్ నేడు గోవిందు, సీతామహాలక్ష్మిల ఇంటికి వెళ్లి వారికి శాశ్వత హక్కు పత్రం అందించనున్నారు. విషయం తెలుసుకున్న గోవిందు కుటుంబం ఆనందంతో పొంగిపోతోంది. ఈ సందర్భంగా రాజమండ్రి గోవిందు మాట్లాడుతూ లోకేష్ చేస్తున్న ఈ సాయాన్ని మేం జీవితంలో మర్చిపోలేం. ఏళ్లతరబడి మేం ఎదుర్కొంటన్న కష్టాన్ని గుర్తించి కుటుంబసభ్యుడి మాదిరిగా సమస్య పరిష్కరించి, మేం ఉంటున్న స్థలంపై హక్కుకల్పిస్తున్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. గతంలో ఎంతమంది చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని చెప్పారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకి!

- ఏపీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి

విజయవాడ, మహానాడు: ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను హరించడానికే వక్ఫ్ సవరణ బిల్లు. ఇది మైనారిటీలను అణిచివేసే కుట్ర. రాజ్యాంగ వ్యతిరేక బిల్లు. దేశ వ్యాప్తంగా ముస్లింల మనోభావాలు దెబ్బతీయడమే నియంత మోడీ అజెండా అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్ ముందుకు సవరణ బిల్లు రావడం అంటే ఈ దేశానికి ఇవ్వాళ బ్లాక్ డే. దేశచరిత్రలో ఒక మాయని మచ్చగా మిగిలిపోయే ఒక చర్య అని పేర్కొన్నారు. ఇంకా, ఆమె ఏమన్నారంటే ఈ బిల్లు ద్వారా మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్పా మరొకటి కాదు.

వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేయడం కోసమే ఈ పన్నాగం. దేవుడికి ఇచ్చిన ఆస్తిని కాజేసి మోడీ బినామీలకు, మోడీ దోస్తులకు వక్ఫ్ ఆస్తులను దారాదత్తం చేసే కుట్ర. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ దేశంలో 20 కోట్ల మంది ముస్లింలు ఆందోళనలు చేస్తున్నా.. - వారి వేదన వినకుండా బిల్లును చట్టసభల్లో ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్య విద్రోహ చర్య. వారి ఆవేదనను పరిగణనలోకి తీసుకోకపోవడం మోడీ నియంతృత్వ విధానానికి నిదర్శనం. వక్ఫ్ ఆస్తుల పర్యవేక్షణ కలెక్టర్లకు అప్పగించడం, వక్ఫ్ బోర్డులో అన్యమత సభ్యులను నియమించడం, వక్ఫ్ ఆస్తులు 12 ఏళ్ళుగా ఎవరి అధీనంలో ఉంటే వారివే అనడం, 300 ఏళ్ల క్రితం నాటి ఆస్తులకు ఇప్పుడు డాక్యుమెంట్ లు అడగడం, వక్ఫ్ బోర్డుకి భూములు వితరణ చేయాలంటే అయిదేళ్ళు ఇస్లాం ధర్మాన్ని ఆచరించాలని.. నిబంధన పెట్టడం అంటే ముస్లింల మనోభావాలను దెబ్బతీసే వ్యతిరేక చర్యలే.

మైనారిటీల ప్రయోజనాలను దెబ్బతీసే బిల్లుకు టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు పలకడం దారుణం. ఇది అత్యంత శోచనీయం. టీడీపీ సెక్యులర్ పార్టీ ముసుగు తొలిగింది. చంద్రబాబు మోసం బయటపడింది. ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఇచ్చి, వక్ఫ్ ఆస్తులను కాపాడుతామని హామీలు ఇచ్చి, మరోపక్క పార్లమెంట్‌లో సవరణ బిల్లుకు మద్దతు పలకడం పచ్చి మోసం. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వాలని విప్ జారీచేసిన చంద్రబాబు ఒక ముస్లిం ద్రోహి. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ముస్లింల పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తున్నాం.

అధికారం పోయినా గుణపాఠం నేర్చుకోని వలస నేత జగన్!

- సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోంది
- ఎన్నికల్లో బెదిరించి భయపెట్టి గెలిచే సంస్కృతి వైసీపీది
- 2019 - 2024 మధ్య కాలంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని జగన్ రెడ్డి చేయని అరాచకాలు లేవు
- ఉప ఎన్నికల్లో వైసీపీ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులే గెలిస్తే ఏదో పెద్ద విజయంలా బిల్డప్ దేనికి జగన్?
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఎద్దేవా

అమరావతి, మహానాడు: అధికారం పోయాక పెళ్లిళ్లు, చావులకు, వారానికి ఓసారి బెంగళూరు ప్యాలెస్ నుంచి తాడేపల్లి ప్యాలెస్ కు వలస వచ్చి వెళ్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్న చంద్రబాబు ప్రభుత్వంపై జగన్ రెడ్డి బురద జల్లుతున్నారు... ఐదేళ్ల పాటు అబద్ధాలు, మోసాలతో పాలన సాగించిన జగన్ రెడ్డి ఇంకా అదే తోవలో పయనిస్తూ... సీఎం చంద్రబాబుపై తప్పుడు విమర్శలు చేయడం సిగ్గు చేటు. ప్రతిపక్ష హోదా లేకుండా వైసీపీని చిత్తుగా ఓడగొట్టినా జగన్ రెడ్డికి ఇంకా గుణపాఠం నేర్పేలేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉప ఎన్నికలు నిర్వహించిన 53 స్థానాలు గతంలో వైసీపీ బెదిరించి భయపెట్టి గెలిచినవే. ఇప్పుడు ఏదో విజయం సాధించినట్టు జగన్ రెడ్డి బీరాలు పలుకుతున్నారు. మేం నిజంగా పోలీసులతో బెదిరించి భయపెట్టి ఉప ఎన్నికలు నిర్వహించి ఉంటే మీరు 39 స్థానాల్లో విజయం సాధించేవారా.? ఆ ఉద్దేశం మాకు లేదు కాబట్టే మీకు ఆ 11 స్థానాలు అయినా ఉన్నాయన్నది గుర్తుపెట్టుకోవాలి. అధికారం పోయినా ఇంకా జగన్ రెడ్డి వక్రబుద్ధి మాత్రం మారలేదు. అధికార అహంకారంతో 2019 -2024 మధ్య వైసీపీ ఎలా ఎన్ని కల్లో విజయం సాధించిందో రాష్ట్ర ప్రజలంతా చూశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని పోలీస్ వ్యవస్థను చేతిలోపెట్టుకొని గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ నేతలను నామినేషన్లు వేయనివ్వలేదు. వేసిన నామినేషన్లు ఉపసంహరించుకోమని అభ్యర్థులను బెదిరించారు.

కర్రలు, రాడ్లతో దాడులు చేశారు. చంపేస్తామని బెదిరించారు. తప్పుడు కేసులు బనాయించి నానా ఇబ్బందులకు గురిచేశారు. ఇది మీ చరిత్ర... ఐదేళ్ల పాటు చేయాల్సిన తప్పుడు పనులు అన్ని చేసి... ఇప్పుడు ఈ సుద్దపూస కబుర్లు దేనికి జగన్ రెడ్డి. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.

సూపర్ సిక్స్ పథకాలను ఇప్పటికే ఆచరణలో పెట్టాం. ఈ నెలలో డీఎస్సీ, వచ్చే నెలలో అన్నదాత సుఖీభవ, తల్లికి వందం వంటి పథకాలు అమలు చేయబోతున్నాం. బడ్జెట్‌లో భారీగా నిధులు కూడా కేటాయించాం.ఇకనైనా కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకుంటే జగన్ రెడ్డికి మంచిది. లేదంటే ఈ సారి ఆ 11 స్థానాలు కూడా వైసీపీ వచ్చేపరిస్థితి ఉండదు.

వెలగపూడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు గారి ఛాంబర్ లో నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన పేరాబత్తుల రాజశేఖర్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్ని వారిని సత్కరించి, శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు కింజరాపు అచ్చెనాయుడు,మాజీ ఉపముఖ్యమంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, అనపర్తి శాసన సభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు,మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు.

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో భేటీ అయిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి. విజయవాడ రైల్వే స్టేషన్ రద్దీ దృష్ట్యా,రైల్వేస్టేషన్‌కు దగ్గరలో గొల్లపూడి బల్బుల వద్ద సాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మించినట్లయితే రాజధాని అమరావతికి కనెక్టివిటీ మరియు విజయవాడ రైల్వేస్టేషన్‌కు రద్దీ తగ్గి, విజయవాడ నుండి ఇతర ప్రాంతాలకు వెళ్ళడానికి ఎక్కువ కనెక్టివిటీ ఏర్పడుతుందని,పరిశీలించమని కోరుతూ కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ని కోరడం జరిగింది

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
08
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 03, ఏప్రిల్ 2025 ||

పెళ్ళికి వెళ్ళి పెట్టుబడులు తెచ్చిన నాయుడు బాబు!

- జగన్ 'గిఫ్ట్' గురించేంటో?

ఆ మధ్య అనంత అంబానీ పెళ్ళికి లోకేశ్ వెళ్ళాడు. పనిలో పనిగా ముంబై పారిశ్రామిక వేత్తల నుండి విదేశాల నుండి వచ్చిన అతిథులను కూడా అంబానీ లెక్కన పలకరించారు లోకేశ్. ముహూర్తానికి చంద్రబాబు వెళ్ళడం వీడ్కోలు తీసుకొంటే కారు వద్దకు అంబానీ వచ్చి సాగనంపడం చూశాం.

పరిమల్ నత్వానీకి జగన్ గారి 'స్పెషల్ గిఫ్ట్' – రాజ్యసభ సీటు!

అయినా అంబానీ వెడ్డింగ్ కార్డు ఇచ్చారో లేదో తెలియదు. ఇచ్చి వుంటే వెళ్లి బొంబాయి కబుర్లు చెప్పేవాడు జగన్. జగన్ మొహం చూసి పెట్టుబడులు పెట్టడానికి రిలయన్స్ కూడా రాలేదు.

ప్రకాశం పోటెత్తి పులకరించింది!

పీసీ మండలం దివాకరపల్లి సమీపంలో నేడు కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంటుకు శంకుస్థాపన చేయడానికి నాయుడి గారి అబ్బాయి వస్తే జనం బ్రహ్మరథం పట్టారు.

రూ.65 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చింది. పెట్టుబడులు ఊరికే రాలేదమ్మా.. ఫ్యామిలీ ఫ్యామిలీ పెళ్లిళ్లకు వెళ్లి అక్షింతలు వేస్తే వస్తాయి.

డెబ్బాడీ ఆనంద్ కొట్టిన దెబ్బతో ఐదేళ్లు వృధా అయ్యాయి. అభివృద్ధిని చూడడానికి జనం పోటెత్తి వస్తున్నారు.

-బాబు భూమా

కనిగిరికి కోరకుండానే వరమిచ్చిన 'లోకేశ్వరుడు'!

- ప్రకాశం జిల్లా చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు ఇది
- వైసీపీ పాలనలో పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమివేశారు
- 10 నెలల్లోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం
- దివాకరపల్లి సభలో ప్రజాప్రతినిధుల మనసులో మాట

కనిగిరి, మహానాడు:

ప్రకాశం జిల్లా చరిత్రలోనే ఈరోజు సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజని దివాకరపల్లి సభలో పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

సీబీజీ ప్లాంట్‌కు భూమి పూజ అనంతరం ఏర్పాటుచేసిన సభలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లాలో పరిశ్రమల సాధనలో కృషిచేసిన మంత్రి నారా లోకేష్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ విజయానంద్ కి, రిలయన్స్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ప్రకాశం జిల్లా చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. రిలయల్స్ తన మొదటి సీబీజీ ప్లాంట్ ను ప్రకాశం జిల్లాలో స్థాపించడం పట్ల సంతోషంగా ఉంది. ఇందుకు మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ మరువలేనిది.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్లే ఇది సాధ్యమైంది. 20 లక్షల ఉద్యోగాల కల్పనను కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత వైసీపీ ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమివేసింది. నేడు అనేకమంది పారిశ్రామికవేత్తలు ఏపీవైపు చూస్తున్నారంటే అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషే కారణం. ఇప్పటికే 5 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తున్నాం. రెండొందల పెన్షన్ ను రూ.2వేలు చేశాం. జగన్ రెడ్డి వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు పట్టింది. నేడు పెన్షన్ రూ.4వేలు చేశారు. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ రానుంది. ఎస్సీ వర్గీకరణ పూర్తిచేసి ఈ నెలలోనే నోటిఫికేషన్ ఇవ్వనున్నాం. దీపం-2 పథకం ద్వారా మహిళలకు అండగా నిలుస్తున్నాం. విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అందజేస్తాం. ప్రకాశం జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోంది. పేదల సేవలో ముఖ్యమంత్రి ఉన్నారు. ఇంటి నిర్మాణానికి నిధులు ఇస్తున్నాం. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు కూడా సాయం పెంచారు.

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లోనే దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని పెన్షన్ లను ఇస్తున్నాం. ఒక్క పెన్షన్ లకే ఏడాదికి రూ.30వేల కోట్లు ఖర్చుపెడుతున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఇచ్చిన హామీల ప్రకారం ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాం. ఉచిత ఇసుకను అందిస్తున్నాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ మే నెలలో అందిస్తాం. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు మంత్రి నారా లోకేష్ కృషిచేస్తున్నాం. మారుమూల ప్రాంతమైన కనిగిరికి రిలయన్స్ సీబీజీ ప్లాంట్ తీసుకువచ్చారు. డీఎస్సీ ద్వారా 16వేల ఉద్యోగాలు కల్పించడం జరుగుతోంది. గుజరాత్ తర్వాత ఏపీలోనే రిలయన్స్ అత్యధికంగా లక్ష కోట్ల పెట్టుబడి పెడుతోంది. తద్వార గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధి లభిస్తుంది. నిరుపయోగ భూమిని ఉపయోగంలోకి తీసుకు వస్తున్నారు.

కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ.. కనిగిరి ప్రాంతంలో సీబీజీ ప్లాంట్ ను పెట్టాలని రిలయన్స్ సంస్థను మంత్రి లోకేష్ కోరారు. అడక్కుండానే మాకు వరం ఇచ్చారు. లోకేష్ కాబోయే ముఖ్యమంత్రి. ఇలాంటి సంబంరం చేసుకుంటామని ఊహించలేదు. యువగళం పాదయాత్రలో ప్రజలు విశేష ఆదరణ చూపారు. దానిని గుర్తుపెట్టుకుని సీబీజీ ప్లాంట్ ను మా ప్రాంతానికి తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు. రిలయన్స్ వారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు. ఈ వెనుకబడిన ప్రాంతాన్ని గుర్తుపెట్టుకోవాలని కోరుతున్నా.

రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయినందుకు సంతోషంగా ఉంది. ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో ముందుకెళ్తోంది. ఏపీ ఉజ్వల భవిష్యత్ కోసం మంత్రి నారా లోకేష్ కృషిచేస్తున్నారు. గ్యాస్ ఉత్పత్తి కోసం కాకినాడలో ఇటీవల రిలయన్స్ సంస్థ రూ. 40 వేల కోట్ల పెట్టుబడి పెట్టడం జరిగింది. దేశ ఇంధన భద్రత కోసం సీబీజీ ప్లాంట్ల నిర్మాణం మరో ముందడుగు. ఏపీ వ్యాప్తంగా 500 సీబీజీ ప్లాంట్లను నెలకొల్పుతాం.

రిలయన్స్ బయోఎనర్జీ సీఈవో హరీంద్ర కె. త్రిపాఠి మాట్లాడుతూ.. ఇది మనందరం గర్వించాల్సిన విషయం. బయో ఫ్యూయల్ ఎకానమీలో ఇదొక మైలురాయిగా నిలుస్తుంది. గత పదేళ్లలో బయో ఫ్యూయల్ మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోంది. ఇప్పుడు 25 లక్షల కోట్లకు చేరుకుంది. గుజరాత్ తర్వాత ఏపీలోనే రిలయన్స్ అత్యధికంగా లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టడం పెడుతున్నారు. ఏపీలో పారిశ్రామిక అనుకూల వాతావరణం ఉంది. వచ్చే రెండేళ్ళలో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి.

నిరంతరం ప్రజల్లోనే ఉన్నాం, ఉంటాం

- చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు

వినుకొండ, మహానాడు:

దాదాపు మూడు దశాబ్దాలుగా గెలుపు, ఓటములతో నిమిత్తం లేకుండా సేవాకార్యక్రమాల్తో ప్రజల మధ్యనే ఉన్నామని, ఇకనుంచి తమ ఫౌండేషన్ సేవలు మరింత విస్తృతం చేస్తామని చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ లీలావతి తెలిపారు. ఇప్పటికే తమ సంస్థ తరఫున నిర్వహిస్తున్న ఉపకార వేతనాలు, వైద్య శిబిరాలు, నైపుణ్యాభివృద్ధి, ఇతర కార్యక్రమా లకు అదనంగా సివిల్స్ కోచింగ్‌కు చేయూతను కూడా ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్, తెలుగుదేశం ఆధ్వర్యంలో బుధవారం వినుకొండ పట్టణంలోని శివయ్య స్తూపం సెంటర్, బస్టాండ్ సెంటర్ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆంజ నేయులు, లీలావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని, ప్రజలకు మంచి జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది నుంచి పల్నాడుజిల్లాలో నిరుపేదలు, దళితులు, వెనకబడినవర్గాలకు సివిల్స్ కోచింగ్‌క సాయం చేస్తామన్నారు. ఇళ్లు లేని ఎస్టీలు, చెంచులు, యానాదులకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం ద్వారా కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా మని, పట్టణ మంచినీటి పథకం కోసం 161 కోట్లు కాదు, 190 కోట్లైనా తెచ్చి మూడేళ్లలో ఇంటింటికీ మంచినీరు అందిస్తామన్నారు.

నాలుగేళ్లలో పల్నాడు వాటర్ గ్రిడ్ ద్వారా నీటి సమస్య పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. రామలింగేశ్వర స్వామి గుడికి ఘాట్ రోడ్డు పనులు ఈ వారంలో ప్రారంభించి చేస్తామన్నారు. తర్వాత బీటీ రోడ్, మెట్లదారి, ఆలయ అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తామన్నారు. అనంతరం శివశక్తి ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ లీలావతి మాట్లాడుతూ చలివేంద్రాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.

రాజకీయాలతో సంబంధం లేకుండా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉందన్నారు. కళ్లజోళ్ల పంపిణీ, కంటి శుక్లాల ఆపరేషన్లు, ఉపకార వేతనాలు నిరంతరంగా అందిస్తామన్నారు. కూటమి ప్రభుత్వంతో ప్రజలకు ఎంతో మంచి జరిగిందని, రాబోయే పదేళ్లలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన రోజు నుండే...
'అమరావతి'పై కూటమి ప్రత్యేక దృష్టి!

సింగపూర్ ప్రతినిధుల బృందంతో సీఎస్ విజయానంద్

అమరావతి, మహానాడు:

అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి గతంలో మాదిరిగానే సింగపూర్ ప్రభుత్వం ఏపీ ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలను అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.విజయానంద్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సింగపూర్ ప్రతినిధుల బృందంతో బుధవారం రాష్ట్ర సచివాలయంలో సిఆర్డిఏ, మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి సమావేశమై పలు అంశాలను చర్చించారు. 2014-2019లో అమరావతి ప్రజా రాజధాని నిర్మాణానికి సింగపూర్ ప్రభుత్వం ఒక కీలక భాగస్వామిగా ఉందని, అదే స్థితిని ప్రస్తుతం కూడా కొనసాగించాలని ఆకాంక్షించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుండే అమరావతి రాజధాని నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిందని సీఎస్ వివరించారు. ఇప్పటికే అమరావతి రాజధానికి సంబంధించి కేంద్ర నిధులతో పాటు ప్రపంచ బ్యాంకు, హడ్ కో, ఎడిబి వంటి సంస్థలతో పెద్దఎత్తున నిధులు టైఅప్ చేసిందని నిధులకు ఎలాంటి సమస్య లేదని పేర్కొన్నారు. ఈనెలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అమరావతి రాజధాని నిర్మణ పనులను పునఃప్రారంభించేందుకు రానున్నారని సిఎస్ తెలిపారు. ఈ దృష్ట్యా గతంలో మాదిరే సింగపూర్ ప్రభుత్వం పూర్తిగా సహకరించేందుకు కృషి చేయాలని అన్నారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి తో సమావేశం ఉన్నందున అన్ని అంశాలపై మరింత స్పష్టత వస్తుందని సిఎస్ విజయానంద్ చెప్పారు.

రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ మాట్లాడుతూ అమరావతి రాజధానిని శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. అమరావతి మాస్టర్ ప్రణాళికను గతంలోనే సిద్ధం చేసినట్టు గుర్తు చేశారు. అమరావతి రాజధానిని ప్రపంచంలోనే ఒక ఉత్తమ సస్టెయినబుల్ అండ్ అత్యంత లివబుల్ సిటీగా నిర్మించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిపారు. అంతకు ముందు ఏపీ సిఆర్డిఏ కమీషనర్ కె.కన్నబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ 217 చ.కి.మీల విస్తీర్ణంతో అమరావతి

ప్రజా రాజధానిని నిర్మించేందుకు ఈప్రభుత్వం తిరిగి శరవేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. దానిలో భాగంగానే అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్సు, పలు ట్రంక్ రోడ్ల నిర్మాణం, ఇతర నిర్మాణాలు, సౌకర్యాల కల్పనకు సంబంధించిన పనులకు పెద్దఎత్తున నిధులు సమీకరించి పనులు చేపట్టేందుకు టెండర్లు కూడా పిలిచామని తెలిపారు. ఈనెలలోనే ప్రధాన మంత్రి సుమారు లక్ష కోట్ల రూ.ల పనుల పునఃప్రారంభం, పనులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. ఇంకా పలు అంశాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్నచర్యలను సింగపూర్ ప్రతినిధి బృందం దృష్టికి తెచ్చారు.

సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధి డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్ మాట్లాడుతూ గతంలో వలె అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించిన భాగస్వామ్యాన్ని తిరిగి పునరుద్ధరించేందుకు ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు అన్నివిధాలా కృషి చేయనున్నట్టు తెలిపారు.

ఈ సమావేశంలో అమరావతి డెవల్మెంట్ కార్పొరేషన్ లిమిడెట్ సిఎండి లక్ష్మీ పార్థసారథి, సిఆర్డిఏ అదనపు కమీషనర్లు ప్రవీణ్ చంద్, నవీన్, సింగపూర్ ప్రతినిధులు ఆడ్రే టాన్, డాక్టర్ ఎలీజా ఆంగ్, నాజ్నీ బేగం, వివేక్ రఘురామన్, డేన్సై టాన్, వైష్ణవి వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

మరో 15 రోజుల్లో ఎస్.ఎల్.బి.సి సహాయక చర్యలు పూర్తి

- పగలు, రాత్రి తేడాలేకుండా సహాయక చర్యలు
- మృతుల కుటుంబాలకు త్వరలో నష్టపరిహారం
- రెండున్నర ఏళ్లలో ఈ కాలువ ద్వారా రైతులకు సాగునీరు
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

శ్రీశైలం, మహానాడు: శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్.ఎల్.బి.సి) టన్నెల్‌లో జరిగిన ప్రమాదానికి సంబంధించి మరో 10 -15 రోజులలో సహాయక చర్యలు పూర్తవుతాయని, నల్గొండ - ఖమ్మం జిల్లాలను సస్యశ్యామలం చేసే కృష్ణానదీ జలాలు మరో రెండున్నర ఏళ్ళలో అందుబాటులోకి రానున్నాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఎస్ .ఎల్. బి. సి టన్నెల్ ప్రమాదస్థలాన్ని పరిశీలించిన అనంతరం శ్రీశైలంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు టన్నెల్‌లో సహాయక చర్యలు వేగంగా సాగుతున్నాయని, మరో 105 -110 మీటర్ల మేర తవ్వకాలు పూర్తయితే సమస్య ఓ కొలిక్కి వస్తుందని తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో 250 మీటర్ల మేర రాయి, బంకమన్ను కారణంగా అడ్డంకి ఏర్పడింది.

గడచిన 40 రోజులుగా 700-800 మంది వివిధ సంస్థలకు చెందిన నిపుణులు పగలు, రాత్రి అధికారుల పర్యవేక్షణలో పనిచేశారు. ప్రస్తుతం 550-560 మంది అత్యాధునిక పరికరాలతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. టన్నెల్ లో భారీ డ్రిల్లింగ్ యంత్రానికి ఇనుం, ఇతర వస్తువులు అతుక్కుపోవడం వలన అక్కడ బురద తొలగింపు కష్టసాధ్యంగా, ప్రమాదకరంగా మారింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన సహాయక చర్యలు చేపట్టేవారికి ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాం. కలెక్టర్, ప్రత్యేక పర్యవేక్షణాధికారి శివశంకర్ లోతేటి, విపత్తు నిర్వహణాధికారి, ఎస్పీ తదితరులు అన్ని వేళలా అందుబాటులో ఉండేలా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఈ సంఘటనలో ఇంతవరకు ఇరువురి మృతదేహాలు లభ్యమ

య్యాయి. మిగలిన వారి కుటుంబాలకు నష్టపరిహారం అందేలా కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. ఈ ప్రమాదం నేపథ్యంలో టన్నెల తవ్వకం సందర్భంగా భవిష్యత్‌లో ఎటువంటి నష్టాలు వాటిల్లకుండా సంపూర్ణ చర్యలు చేపడతాం. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆలోచనలతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ ద్వారా ఈ ఇందిరమ్మ పభుత్వ హాయాంలోనే సాగునీటిని అందిస్తాం

ఫిబ్రవరి 22వ తేదీన ఎస్ఎల్బీసీ సొరంగ ప్రమాదం జరిగింది. ఎనిమిది మంది కార్మికులు ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. సొరంగంలో కూలిన రాళ్లు, టీబీఎం విడిభాగాలను వెల్డింగ్ చేసి బయటకు తీస్తున్నారు. ఎప్పటికప్పుడు అక్కడ పేరుకున్న మట్టి, రాళ్ల దిబ్బలు, పూడిక, ఊట నీటిని బయటకు తొలిగిస్తున్నారు. ఇన్లెట్ వైపు నుంచి సొరంగంలో 14 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం జరిగినందున గాలి, వెలుతురు తక్కువగా ఉండటంతో సహాయక చర్యలు చేపట్టడం సంక్లిష్టంగా సాగుతోంది.

ఏది ఏమైనా ఈ సంఘటనలో ప్రాణ నష్టం జరగడం దురదృష్టకరమని మంత్రి పొంగులేటి విచారం వ్యక్తం చేశారు. ఇలా ఉండగా పర్యటనలో భాగంగా మంత్రి పొంగులేటి సతీ సమేతంగా శ్రీశైలం భ్రమరాంభిక మల్లికార్జున స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

దిగుబడులు పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

- వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్

అమరావతి, మహానాడు: వ్యవసాయ రంగంలో దిగుబడులు, ఆదాయం పెంచే దిశగా కృత్రిమ మేధ, డీప్ టెక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టనుందని వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

బుడితి రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు వ్యవసాయంలో స్థూల విలువ జోడింపున కు తగ్గ పంట ప్రణాళికలను రూపొందించే దిశగా వ్యవసాయ శాఖ ప్రణాళికలు వేస్తోందని తెలిపారు. అదే విధంగా రైతులకు వ్యవసాయ శాఖ అందించే అన్ని రకాల సేవలను ఒకే గొడుగు కింద సమాచారాన్ని అందించే యాప్ ను రూపొందిస్తున్నామని, రైతులకు మరింత సులువుగా సేవలందించే దిశగా వ్యవసాయ శాఖను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్ ప్రక్రియ చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం బుడితి రాజశేఖర్ రాష్ట్ర వ్యవసాయ రంగంలో రైతులకు, మేధావులకు, వ్యవసాయ ఆధారిత పారిశ్రామిక వేత్తలకు, వ్యాపారులకు, నూతన వ్యవసాయ ఆవిష్కరణలు చేపట్టబోయే వారికి సమాచారం అందించి వారికి ఉపయోగపడే విధంగా వుండే డిజిటల్ వేదిక ఏపీఏఐఎంఎస్ 2.0 ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ సమాచార, యాజమాన్య వ్యవస్థ -2.0 ను లాంఛనంగా ప్రారంభించి, మాట్లాడారు.

రాష్ట్ర వ్యవసాయ సంచాలకుడు డిల్లీ రావు, రాష్ట్ర ఉద్యాన సంచాలకులు శ్రీనివాసులు, వ్యవసాయ, ఉద్యాన అదనపు సంచాలకులు, సంయుక్త సంచాలకులు, వివిధ సెక్షన్ అధికారులతో మాట్లాడుతూ ఈ డిజిటల్ వేదిక రైతులకు ఏ విధంగా సేవలందిస్తోందో రాజశేఖర్ వివరించారు.

డిల్లీ రావు మాట్లాడుతూ రైతులు, ఉద్యోగులు, వ్యవసాయ పారిశ్రామిక వేత్తలకు సమాచారాన్ని అందించటంలో ఈ డిజిటల్ సమాచార వ్యవస్థ కేంద్రీకృత సమగ్ర వ్యవసాయ సమాచార వేదిక గా ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ డిజిటల్ వ్యవస్థ గత పది సంవత్సరాల పంటలసాగు, వాతావరణ, నేల పోషక లభ్యత, దిగుబడులు, పంటల ధరలు తదితర సమాచారాన్ని విశ్లేషించి రైతులకు వారు ఎంచుకునే పంట సాగుకు సంబంధిత వాతావరణ ఆధారిత సూచనలు సలహాలు అందిస్తుందన్నారు.

దర్శిలో అన్నా క్యాంటీన్‌కు రూ. 61 లక్షలు మంజూరు

- లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మహానాడు:

ప్రకాశంజిల్లా, కనిగిరి నియోజకవర్గంలోనిదివాకరపల్లిలో బుధవారం సీబీజీ ప్లాంట్ భూమి పూజకు హాజరైన ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఈ సందర్భంగా దర్శిలో అన్నా క్యాంటీన్‌కు 61 లక్షలు నిధులు మంజూరు చేస్తూ నగర కమిషనర్ కు ఆదేశాలు జారీ చేయడం పట్ల లక్ష్మి లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. కాగా, దర్శిలో అన్నా క్యాంటీన్ కోసం అనేకసార్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, లోకేష్, మున్సి పల్ శాఖ మంత్రి నారాయణకు లక్ష్మి కోరారు. మొత్తమ్మీద నిధులు మంజూరు కావడంతో లక్ష్మి వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఇదిలావుండగా, కురిచేడు ప్రాంతంలో సీపీజీ ప్లాంట్‌ను కూడా మంజూరు చేయాలని ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి లోకేష్‌ని, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని కోరగా అందుకు వారు సానుకూలంగా స్పందించినట్టు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ వెనుకబడిన దర్శి ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. డిగ్రీ కాలేజీకి అవసరమైన శాశ్వత భవనాలను నిర్మించుకునేందుకు

అవసరమైన నిధులను కూడా మంజూరు చేయాలని లోకేష్ ని కోరామని తెలిపారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 03, ఏప్రిల్ 2025 ||

ఏపీలో బీజేపీకి మంచి రోజులు...

◆ బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి

విజయవాడ, మహానాడు: రెండోసారి ఎమ్మెల్సీగా సోము వీర్రాజు ఎన్నిక కావడం ఆనందంగా ఉంది.. ఇది బీజేపీలో ఒక చారిత్రక విషయం.

రెండోసారి ఎమ్మెల్సీగా సోము వీర్రాజు అవకాశం వచ్చిందని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఎమ్మెల్సీ సీటు బీజేపీకి కేటాయించారు. పార్టీని అభివృద్ధి చేసిన సోము వీర్రాజు సేవలను అధిష్ఠానం గుర్తించింది. అసెంబ్లీలో కూటమి ఎమ్మెల్యే లు ఎక్కువుగా ఉన్నా.. మండలిలో వైసీపీ సభ్యులే ఎక్కువ మంది ఉన్నారు. పెద్దల సభలో అనేక బిల్లులు ఆమోదం పొందాల్సి ఉంది. మండలిలో మన వాణిని వినిపించి, వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలు ఎండగట్టాలి. కేంద్ర పెద్దలు సోము వీర్రాజు గళం విప్పుతారనే నమ్మకంతో ఆయన్ను ఎంపిక చేశారు. ఏపీలో బీజేపీకి మంచి రోజులు వచ్చాయి. ప్రభుత్వంలో జరిగే మంచి కార్యక్రమాలు ప్రజలకు వివరించ డంతో పాటు కింద స్థాయిలో జరిగే లోపాలను ప్రభుత్వం దృష్టికి బీజేపీ తీసుకువెళు తుంది. ప్రతి బూత్ లో కూడా కమిటీలు వేసుకుని, ఏపీలో అన్ని విధాలా బలంగా తయారవుతుందని పార్థసారథి అన్నారు.

అన్నీ గ్రామాల అభివృద్ధే లక్ష్యం

◆ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మహానాడు: పెదకూరపాడులో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శాసన సభ్యుడు భాష్యం ప్రవీణ్ బుధవారం నిర్వహించారు.

నియోజకవర్గ ప్రజల నుండి నుండి ఫిర్యాదులను స్వీకరించి సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను స్వయంగా విని వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తామని హామీ ఇచ్చారు. బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని అన్నీ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్న ఎమ్మెల్యే తెలిపారు.

విద్యార్థులలో సృజనాత్మకత, పోటీతత్వం పెరగాలి

◆ ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, మహానాడు: అమరావతి ఎడు హబ్ నేషనల్ ఒలింపియాడ్ పోటీ పరీక్షల ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత, పోటీ తత్వం పెరుగుతుందని పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్ళా మాధవి పేర్కొన్నారు. అమరావతి ఎడు హబ్ 6 రాష్ట్రాలలో గణితం, విజ్ఞానం, ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ విభాగాలల్లో నిర్వహించిన పోటీలలో 20వేల మంది విద్యార్థులు పాల్గొనడం అందులో 150 మంది విద్యార్థులను గౌరవించడం, 40 మంది ఉపా

ధ్యాయులకు గురుదేవోభవ అవార్డులను అందించడం అభినందనీయ మన్నారు. ఈనెల 2వ తేదీ గుంటూరులోని పెన్షనర్స్ భవన్ హలులో జరిగిన బహుమతుల ప్రధానం కార్యక్రమానికి గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, డిబేటింగ్ క్విజ్ పోటీలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెరుగు తాయన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎన్.వి పద్మిని, తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే వెలగపూడి

విశాఖపట్నం, మహానాడు: తూర్పునియోజకవర్గంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుండి పలు

ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను ఓర్పుగా విని పరి ష్కారానికి కృషి చేశారు. అలాగే ఎమ్మెల్యే కార్యాలయంలోనే ప్రజలకు అందు బాటులో ఉండే విధంగా ఆధార్ సెంటర్ ను ఏర్పాటు చేశారు.

రావులపాలెం సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం..

◆ ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, మహానాడు: కోనసీమ ముఖద్వారం రావులపాలెం సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పరిష్కార మార్గాలను సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆ సెంటర్ పరిసర ప్రాంతా లను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం స్థానిక అభివృద్ధి అధికారి కార్యా

లయంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన సదస్సు సమా వేశంలో మాట్లాడారు. కోనసీమ ముఖద్వారం వద్ద, ప్రతి శనివారం వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి భక్తులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రావులపాలెం సెంటర్‌ను కూడా సుందరీకరణకు ప్రాధాన్యం ఇస్తామని ఆహ్లాదకరంగా ఉండే విధంగా అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఇందుకు తగ్గట్టుగా అంచనాలను సిద్ధం చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, జక్కంపూడి వెంకటస్వామి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణ కోసం
కూటమి వినూత్న నిర్ణయం

◆ దేశంలో తొలిసారిగా ఇంటి వద్దే 47 రకాల డయాగ్నోస్టిక్ పరీక్షలు

◆ 108, 104 సేవలకు కొత్త సర్వీస్ ప్రొవైడర్

◆ పెరిగిన ఇంధన ధర, వేతనాలు, ఏజెన్సీ ద్వారా 190 కొత్త వాహనాల కొనుగోలు కారణంగా టెండర్ ధరలో 11 శాతం పెరుగుదల

అమరావతి: ఇప్పటివరకూ సమస్యాత్మకంగా కొనసాగుతున్న 104, 108 సేవలకు జవసత్వాలు కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సేవల్ని అందిస్తున్న ప్రస్తుత సర్వీస్ ప్రొవైడర్ స్థానంలో ప్రభుత్వం కొత్త ఏజెన్సీని గుర్తించింది.

ఈ ప్రక్రియలో భాగంగా దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజల ఆరోగ్య స్థితి నిర్ధారణకు 47 రకాల డయాగ్నోస్టిక్ పరీ క్షల్ని 104 వాహనాల ద్వారా ఉళ్లల్లోనే పరీక్షలు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. M/s. భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సారథ్యంలో M/s. SRIT ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ను భాగస్వామిగా ఉన్న కన్సార్షియంను ఇకనుంచి ఈ సేవల్ని అందించే ఏజెన్సీగా టెండరు ప్రక్రియ ద్వారా ప్రభుత్వం గుర్తించింది.

రాష్ట్ర ప్రజల వ్యక్తిగత ఆరోగ్య స్థాయి వివరణాత్మక ప్రొఫైలింగ్ ద్వారా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల్ని (EHR) రూపొం దించడానికి ఈ పరీక్షల్ని చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దీని ద్వారా రాష్ట్రంలో ప్రస్తుత, భవిష్యత్తు వ్యాధుల భారాన్ని అంచనా వేయడం వీలవుతుంది. తద్వారా అవసరాలకనుగుణంగా ప్రభుత్వం తగు చర్యల్ని చేపట్టడానికి మార్గం ఏర్పడుతుంది. ప్రస్తుతం 104 అంబులెన్స్‌ల ద్వారా కేవలం మధుమేహం మరియు బీపీ వ్యాధుల్ని గుర్తించడానికి మాత్రమే 'ర్యాపిడ్ కిట్' పరీక్షలు చేస్తున్నారు. దీనికి భిన్నంగా నూతన విధానంలో నిర్దిష్ట ఫలితాలనిచ్చే 47 రకాల పరీక్షలు చేయడం జరుగుతుంది.

బ్లడ్ గ్లూకోజ్ టెస్ట్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, రీనల్ ఫంక్షన్ టెస్ట్‌లు, లివర్ ఫంక్షన్ టెస్ట్‌లు, కంప్లీట్ లిపిడ్ ప్రొఫైల్, యూరిన్ అనాలిసిస్,ఆర్టీరియల్ బ్లడ్ గ్యాస్‌లకు సంబంధించి 20 పరీక్షలు లబ్ధి దారులకు చేయడం జరుగుతుంది

నిర్దిష్ట వ్యాధులకు సంబంధించి మరో 27 పరీక్షల్ని చేస్తారు. కొత్తగా ఈ సేవల బాధ్యతలను స్వీకరించనున్న సర్వీస్ ప్రొవైడర్ సాధారణ 20 పరీక్షల్ని ఒక్కొక్కరికి రూ.195 ఖర్చుతో చేయడానికి అంగీకరించింది. అంతే కాక ఇతర వ్యాధి పరీక్షలకు కూడా మార్కెట్ రేట్లతో పోలిస్తే సహేతు కమైన ఛార్జీలను ప్రతిపాదించారు. ప్రతి 104 వాహనం ద్వారా రోజుకు దాదాపు 35 మందిని పరీక్షిస్తారు.

ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే ముందు మొబైల్ మెడికల్ యూనిట్ల డేటా యొక్క విశ్వసనీయతను తనిఖీ చేసేందుకు ఈ నిర్ధారణ పరీక్షల్ని పైలట్ ప్రాతిపదికన ప్రభుత్వం చేపడుతుంది. ఈ పరీక్షలు నిర్వహించడానికి కొత్త ఏజెన్సీ ఆయా పరికరాల్ని ప్రతి 104 వాహనంలో సెమీ-ఆటోమేటిక్ బయోకెమిస్ట్రీ ఎనలైజర్, సిబిసి మెషిన్ 3 పార్ట్ ఎనలైజర్, మైక్రోస్కోప్ మరియు ఇంక్యుబేటర్ వంటి పరికరాలను ఏర్పాటు చేస్తారు.

ప్రతి వాహనంలో ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను కూడా ఉంటారు. 108 మరియు 104 సేవలతో పాటు అత్యవసర ప్రతిస్పందన కేంద్రాన్ని (EMERGENCY RESPONSE CENTRE) నిర్వహించడానికి ప్రభుత్వం ప్రస్తుతం నెలకు రూ.28 కోట్లు చెల్లిస్తోంది. కొత్త టెండర్ కింద ఈ ఖర్చు నెలకు రూ.31 కోట్లకు చేరుతుంది. ఇది టెండర్ ధరలో కేవలం 11 శాతం లోపు మాత్రమే పెరుగుదల.

ఈ పెరుగుదలకు ప్రధాన కారణం ప్రధానంగా కొత్త ఏజెన్సీ 190 కొత్త 108 వాహనాల్ని ఖరీదు చేసి ఏర్పాటు చేయడం. మొత్తమ్మీద 731 వాహనాలు 108 సేవల్ని అందిస్తాయి. సేవల ధర స్వల్పంగా పెరగడానికి పెరిగిన ఇంధన ధరలు, సిబ్బందికి వేతనాలు కూడా కొంతమేరకు కారణం. 2020 సంవత్సరంలో ప్రస్తుతం అమలులో ఉన్న టెండర్ ఖరారు చేసినప్పుడు డీజిల్ ధర లీటరుకు రూ.70 మాత్రమే ఉండగా, ఇప్పుడది లీటరుకు 97 రూపాయల 47 పైసలకు పెరిగింది ఉంది.108 అంబులెన్స్‌ల డ్రైవర్లకు, నెలకు రూ.2,000 అద నంగా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ద్రవ్యోల్బ ణంతో పాటు పెరిగిన పరికరాల ధరలు, వాహనాల నిర్వణా ఖర్చులు కూడా ఇతర కారణాలు.

108 సేవలకు సంబంధించి, సర్వీస్ ప్రొవైడర్ కు రెండు కొత్త షరతులు పెట్టారు. ఇందులో ఒకటి... కాల్ వచ్చినప్పటి నుండి రోగిని ఒక గంటలోపు ఆసుపత్రికి తీసుకెళ్లాలి. దీనిని 'గోల్డెన్ అవర్' అని అంటారు. రెండోది ఎటువంటి అత్యవసర కాల్స్ ను స్వీకరించకుండా వుండకూడదు. ఈ సేవల్ని అంస్తున్న ప్రస్తుత సంస్థ రోజుకు దాదాపు 200 ఎమెర్జెన్సీ కాల్స్‌ను నిర్లక్ష్యం చేసిన నేపథ్యంలో ఈ షరతుల్ని పొందుపర్చారు.

ప్రజా సమస్యలు పరిష్కారమే కూటమి ధ్యేయం

◆ ప్రజాదర్బార్లో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం, మహానాడు: ప్రజా సమస్యలు పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, సమస్య విన్నవించిన వెంటనే పరిష్కరించడమే మా లక్ష్యం అని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. బుధవారం వైకెఎంలోగల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా దర్బార్‌లో ఆయన ప్రజల సమస్యలను వినతుల రూపంలో స్వీకరించారు. వివిధ గ్రామం, పట్టణాల నుంచి వచ్చినవారు రోడ్లు, కాలువలు, పింఛన్లు, గృహాలు, భూ సమస్యలతోపాటు పలు రకాల వినతులను ప్రజల ద్వారా ఆయన స్వీకరించారు.

వీటిపై ఆయన స్పందిస్తూ ఆయా సమస్యలకు సంబంధిత అధి కారులతో తక్షణమే మాట్లాడుతూ కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్క రించారు. మిగిలిన సమస్యలను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే సూచించారు. ప్రజా సమస్యలను విన్న వెంటనే పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందని, ఎవరికి ఎటువంటి సమస్యలున్నా తెలియజేసిన వెంటనే పరిష్కరించడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

◆ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మహానాడు: ఇక్కడి రఘురామ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యా లయంలో బుధవారం ప్రజాదర్బార్ జరిగింది. ప్రజల సమస్యల అడిగి

తెలుసుకుని, వినతులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ స్వీకరించారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్

◆ పలు రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర మంత్రితో చర్చించిన టి.జి భరత్

◆ అభివృద్ధి చెందుతున్న ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ గురించి చర్చించిన టి.జి భరత్

ఢిల్లీ: కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా కర్నూలు నుండి ముంబైకి మరియు కర్నూలు నుండి విజయవాడకు కొత్త రైలు సర్వీసులను ప్రవేశపెట్టాలని కేంద్ర మంత్రిని కోరినట్లు టి.జి భరత్ తెలిపారు.

ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు కర్నూలు రాజధానిగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ ఈ ప్రాంతాన్ని రైల్వే పరంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని విన్నవించారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌లో ఎన్నో పరిశ్రమలు రానున్నట్లు కేంద్ర మంత్రికి వివరించారు. భవిష్యత్తులో ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా ఓర్వకల్లు మారబోతుందన్నారు. ఈ ప్రాంతానికి దేశంలోని ప్రధాన నగరాలతో రైలు రాకపోకలు ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు టి.జి భరత్ తెలిపారు. ఈ రైల్వే సౌకర్యాలపై తప్పకుండా పరిశీలిస్తామని ఆయన చెప్పారన్నారు.

డ్రగ్స్ కార్యకలాపాలపై డేగ కన్ను

◆ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీ

◆ త్వరలో రాష్ట్రవ్యాప్తంగా డెకాయ్ ఆపరేషన్

◆ ఐజీ ఆకే రవికృష్ణ

అమరావతి: డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా, రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మార్గనిర్దేశకత్వంలో "ఈగల్" పనిచేస్తుందని ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు.

ఈగల్ మరియు డ్రగ్స్ కంట్రోల్ అసోసియేషన్ ఆధర్యంలో రాష్ట్ర సీమాంధ్ర డ్రగ్స్ డీలర్స్ అసోసియేషన్ వారితో నేడు మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన డ్రగ్స్ నియంత్రణపై జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ ఈగల్, డ్రగ్స్ కంట్రోల్ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ మరియు పోలీసు శాఖలు సంయుక్తంగా 'ఆపరేషన్ గరుడ'ను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ దాడుల్లో 158 మందుల షాపులు నిబంధనలు అతిక్రమించినట్లు తెలిపారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డ్రగ్స్ కంట్రోల్ అసోసియేషన్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎన్.ఆర్.ఎక్స్ మరియు ఎక్స్ఆర్.ఎక్స్ డ్రగ్స్ ఎటువంటి ప్రిస్క్రిప్షన్స్ లేకుండా మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మందుల అమ్మకం మరియు కొనుగోలుకు సంబంధించిన బిల్ బుక్కు సరైన పద్ధతిలో నిర్వహించడం లేదన్నారు. అంతేకాకుండా కాలం చెల్లిన మందులను నిరక్షరాస్యులు, పిల్లలు మరియు వృద్ధులకు డిస్కౌంట్స్ పేరుతో అమ్ముతన్నట్లు "ఈగల్" గుర్తించిం దన్నారు.

అటువంటి మందుల షాపులపై ఎన్డీపిఎస్ అండ్ డ్రగ్ కాస్మోటిక్ యాక్ట్ ప్రకారం సీజ్, వార్నింగ్ మెమో, లైసెన్సులను రద్దుచేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులను నమోదు చేయడం జరుగుతుందన్నారు.

ఎన్.ఆర్.ఎక్స్ డ్రగ్స్ విచ్చలవిడిగా వాడటం వల్ల పలు అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయని వివరించారు. మందుల చీటీ లేకుండా సైకోట్రిక్స్ మందుల ఇవ్వము అన్నది విస్త తంగా ప్రజల్లోకి బలంగా వెళ్లాలని, దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ల డంలో డ్రగ్స్ కంట్రోల్ అసోసియేషన్ వారు క్రియాశీలంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ను తీర్చిదిద్ది. రాబోవు తరాలు డ్రగ్స్ బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరి మీద ఉంద న్నారు. దీనికి డ్రగ్ డీలర్స్ అసోసియేషన్స్ వారు ముందుకు వచ్చి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎన్.ఆర్. ఎక్స్ డ్రగ్స్ ను అరికట్టడానికి త్వరలో రాష్ట్రవ్యాప్తంగా డెకాయ్ ఆపరేషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎవరైనా నిషేధిత మందులను విక్రయిస్తున్నట్లు దృష్టికి వస్తే 1972 టోల్ ఫ్రీ నంబర్కు కాల్ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ నగేష్ బాబు, డి.జి. డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ప్రసాదు, సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర మరియు జిల్లాస్థాయి కార్యవర్గసభ్యులు, ఈగల్ కు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

త్వరలో విజయవాడ మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు

◆ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయంలో సుజన మిత్ర కార్యక్రమం ప్రారంభించిన మంత్రి నారాయణ

◆ సుజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో డివిజన్ కోఆర్డినేటర్ల నియామకం

◆ డివిజన్ కోఆర్డినేటర్లకు ఎలక్ట్రిక్ బైక్ లు పంపిణీ చేసిన మంత్రి నారాయణ

విజయవాడ: 2004 నుంచి సుజనా చౌదరితో నాకు పరిచయం ఉంది. ఇద్దరం కలిసి అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు చేశాము. కేంద్ర మంత్రిగా పని చేసిన సుజనాకి అపారమైన అనుభవం ఉంది. సుజన మిత్ర కార్యక్రమం ప్రారంభిస్తున్నందుకు ఎమ్మెల్యే చౌదరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. 2014-19 మధ్య పురపాలక శాఖకు బడ్జెట్ ఉండేది. ఇప్పుడు మాత్రం గత ప్రభుత్వం తీసుకున్న లోన్ లు అప్పులు కట్టడానికి బడ్జెట్ సరిపోతుంది

2019 AIIB నుంచి 5380 కోట్లు నిధులు తీసుకొచ్చాం.కానీ గత ప్రభుత్వం మ్యాచింగ్ ఫండ్స్ ఇవ్వకపోవడం వల్ల ఆ నిధులు విడుదల నిలిచిపోయింది. గత ప్రభుత్వం నిధులు ఇచ్చి ఉంటే

ప్రతి ఇంటికి మనిషికి 135 లీటర్ల నీరు అందేది. మళ్ళీ సీఎం చంద్రబాబు చొరవతో నిధులు తీసుకొస్తున్నాం. 8500 అమృత్ పథకానికి నిధులు ఇస్తే గత ప్రభుత్వం మ్యాచింగ్ ఫండ్ ఇవ్వలేదు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ ను నాశనం చేసింది.

ప్రజలు వివిధ పన్నుల ద్వారా కట్టిన 3 వేల కోట్ల నిధులు CFMS నుంచి ఇతర అవసరాలకు వాడేసారు. CFMSలో నిధులు ఉంచితే మున్సిపాలిటీలు తీవ్రంగా నష్టపోతాయనే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్ళాను. ఇకపై మున్సిపాలిటీల నిధులు ఆయా మున్సి పాలిటీలకు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నందుకు సీఎం చంద్ర బాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

త్వరలో విజయవాడ మున్సిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులు తిరిగి ప్రారంభిస్తాం. సుజనమిత్ర కార్యక్రమానికి మా తరపున అధికారుల సహకారం ఖచ్చితంగా అందిస్తాము. విజయ వాడ వెస్ట్ నియోజకవర్గం అభివృద్ధికి సుజనా చౌదరి , నేను కలిసి పనిచేస్తాము

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 03, ఏప్రిల్ 2025

వక్ఫ్ సవరణ బిల్లుకు 'జనసేన' మద్దతు

అమరావతి: కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు జనసేన పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. వక్ఫ్ చట్టాన్ని ఆధునీకరించడం లక్ష్యంగా పెట్టుకున్న బిల్లుకు అనుకూలంగా ఓటు వేయాలని పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ ఎంపీలను ఆదేశించారు.

ఈ చట్ట సవరణ ముస్లిం సమాజానికి మేలు చేస్తుందని జనసేన విశ్వసిస్తోంది. ఈ మేరకు లోక్ సభలోని జనసేన ఎంపీలకు పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ బిల్లుకు అనుకూలంగా ఓటింగ్ లో పాల్గొనాలని జనసేన పార్లమెంట్ సభ్యులకు తెలిపారు.

'వక్ఫ్ చట్టంలో సవరణలకు సంబంధించిన బిల్లును 31 మంది సభ్యులతో జైంట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసి సమీక్షించారు. సంబంధిత వర్గాలతో విద్యావంతులతో, పాలన రంగ నిపుణులతో చర్చించి ఈ బిల్లును రూపొందించారు. బ్రిటిష్ కాలంనాటి వక్ఫ్ చట్టాన్ని నేటి కాలానికి తగిన విధంగా క్రమబద్ధీకరించడం ద్వారా విస్తృత ఫలితాలు దక్కుతాయి. ఈ వక్ఫ్ సవరణ బిల్లుకు ఇవ్వాలి' అని పవన్ కళ్యాణ్ మద్దతు తెలిపారు.

ఘనంగా టీడీ జనార్దన్ జన్మదిన వేడుకలు

- టీడీ లాంటి నేత దొరకడం అరుదు
- అభినందనలతో ముంచెత్తిన టీడీపీ నేతలు

అమరావతి: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పార్టీ అధినేత చంద్రబాబు రాజకీయ కార్యదర్శి టిడి జనార్దన్ జన్మదిన వేడుకలు టీడీపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పార్టీకోసం నిరంతరం శ్రమించే సైనికుడయిన టీడీ సేవలు, పార్టీకి శాశ్వతంగా కొనసాగాలని ఈ సందర్భంగా



పలువురు నేతలు సూచించారు. పార్టీనే ఆశ, శ్వాస, ధ్యాసగా ఉండే టీడీ జనార్దన్ సేవలను పార్టీ నాయకత్వం మరింత సమర్ధవంతంగా వినియోగించుకోవాలని కోరారు.

పార్టీ విపక్షంలో ఉన్నప్పుడల్లా క్రమశిక్షణ గల సేనానిలా జనార్దన్ చేసిన సమన్వయం, నాయకులు- కార్యకర్తలు ఎప్పటికీ మర్చిపోలేరని కొనియాడారు. నాయకత్వానికి-నాయకులకు మధ్య వారధిగా ఉంటున్న టిడి జనార్దన్ అంకితభావం, చిత్తశుద్ధిని అందరికీ ఆదర్శమన్నారు.

పదవులతో సంబంధం లేకుండా, ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా తానున్నానంటూ వారి సమస్యలు పరిష్కరించి, వారి కష్టాల్లో పాలుపంచుకునే టీడీ లాంటి నిస్వార్థ నాయకుడు రాజకీయాల్లో బహు అరుదని,

అలాంటి నాయకుడు తమ పార్టీకి లభించడం అదృష్టమని అభినందించారు.

మహానేత దివంగత ఎన్టీఆర్ సేవలను భావితరాలు మర్చిపోకుండా గుర్తు చేసేందుకు, రాష్ట్రం దాటి విదేశాల్లో ఎన్టీఆర్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న టిడి జనార్దన్ టీడీపీ శ్రేణుల మనసుల్లో చిరస్థాయిగా నిలిపోతారన్నారు.

ఈ సందర్భంగా షోలాపూర్‌కు చెందిన ఓ ఎన్టీఆర్ అభిమాని నూలుతో రూపొందించిన చిత్రపటాన్ని, ఆయనకు బహుకరిం చారు. అంతకుముందు టిడి జనార్దన్‌కు, గన్నవరం ఎయిర్‌పోర్టులో కార్య కర్తలు ఘన స్వాగతం పలికారు. చిగురు అనాథ ఆశ్రమంలో చిన్నారులతో కలసి ఆయన తన జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

రాశి ఫలాలు.. పేలాపన

ఉగాది సందర్భంగా కొందరు జ్యోతిష్కులు రాశుల వారీగా ఫలాలు చెప్పడం మనకు తెలుసు. ఆదాయం ఇంత, వ్యయం ఇంతబీ రాజపూజ్యం, అవమానాలు ఇంత, అంత అని జ్యోతిష్కులు టీ.వీ. చానళ్లలోనూ, యూట్యూబ్ చానళ్లలోనూ పేలాపన చెయ్యడం మనకు తెలిసిందే. ఇది పూర్తిగా అశాస్త్రీయంబీ విదూషకత్వం.

గోచారం

జ్యోతిషం పరంగా చదువు, తెలివిడి, తెలివి లేని జోతిష్కులు (వీళ్లకు జ్యోతిషం అన్న పదానికి కూడా అర్థం తెలుసో లేదో?) తెగబడి, విరగబడి గోచార ఫలితాలు చెబుతున్నారు. వాళ్లు చెబుతున్న గోచార ఫలితాలు శాస్త్రీయమైనవి, విద్య ఆధారితమైనవి కావు. ఉదాహరణకు సింహరాశి వాళ్లకు శని అష్టమ స్థానంలోకి వచ్చింది. అందువల్ల రానున్న రెండున్నరయేళ్లు సింహరాశి వారికి అపాయకరమైన, అవాంఛనీయమైన, హానికరమైన ఫలితాలు ఉంటాయని చెప్పబడుతోంది. అది సరికాదు!

గురు మార్పిడి

మే నెల 14 న జరుగనున్న గురు మార్పిడి సింహరాశి వాళ్లకు ఎంతో మేలైన ఫలితాలను ఇస్తుంది. శని దుష్ప్రభావాలకు గురు సంచారం విరుగుడుగానూ, ఆపై క్షేమకరంగానూ, లాభకరంగానూ ఉంటుంది.

గోచార ఫలితాలపై అవగాహన

గోచార ప్రభావాలపై అవగాహన, సరైన అవగాహన టీ.వీ., యూట్యూబ్ చానళ్ల జోతిష్కులకు ఉన్నట్టు లేదు. గోచార ప్రభావం ఒక రాశి వాళ్లందరిపైనా ఒకేలా ఉండదు.

జాతక చక్రం (natal chart) (రాశి, నవాంశం కలుపుకుని)లోని గ్రహ స్థానాలు, దశ, భుక్తులకు తగ్గట్టుగా మాత్రమే గోచార ప్రభావాలు, ఫలితాలు ఉంటాయి. 'దశాను భావేన ఫలం వదతి' అని జాతక పారిజాతం తెలియజేస్తోంది.

జాతక చక్రం అన్నదే ప్రధానం. జాతక చక్రాన్ని బట్టే గోచార ప్రభావాలు ఉంటాయి. ఒక వ్యక్తికి ఇమ్యూనిటి ఉన్నప్పుడు వాతావరణలో ఉన్న వైరస్ వల్ల హాని ఉండదు. ఆ విధంగానే జాతక చక్రం బలంగా ఉంటే గోచార ప్రభావాలు హానికరంగానూ, నష్టకరంగానూ, అపాయ కరంగానూ ఉండవు.

పరిహారాలు

జ్యోతిష్కుడు అనబడుతున్న ఒక ప్రబుద్ధుడు 'సాయిబాబా గుళ్లో కిలో పంచదార దానం చేస్తే అష్టమ శని దుష్ప్రభావాలు తొలగిపోతాయి' అని బహిరంగంగా వాక్కృచ్చాడు. ఇది హాస్యాస్పదం. మనదేశంలో జ్యోతిశ్శాస్త్రం రూపొంది, చలామణిలోకి వచ్చినప్పుడు సాయిబాబా అనే వ్యక్తిలేడు. సాయిబాబాకు గుడి అన్నదే శాస్త్రీయమూ, విజ్ఞత కాదు. సాయిబాబా గుళ్లో కిలో పంచదార దానమిచ్చేస్తే గోచార ప్రభావాలు తొలగిపోవు. సిగ్గుండాలి ఇలాంటి మాటలు చెప్పడానికి. రెండున్నర కిలోలు టమాటాలు ఆవుకు పెడితే పెళ్లిళ్లు అవవుబీ ఉద్యోగాలు రావు. ఇటువంటివి చెప్పే పనికిమాలిన వాళ్లను పక్కకు నెట్టేసి సరైన, చదువు, విజ్ఞత ఉన్న జ్యోతిష్కులను సంప్రదించాలి. టీ.వీ., యూట్యూబ్ జ్యోతిష్కులకు, జ్యోతిష్కులు అనబడుతున్న అజ్ఞానులకు మనం బలి అవకూడదు.

మిడిమిడి జ్ఞానం

జ్యోతిషం అన్నది ఒక సాగరం. మిడిమిడి జ్ఞానంతో ఏదో పేలాపన చేస్తూ ఎవరూ కూడా సామాన్యుల జీవితాలతో చెలగాటం ఆడకూడదు. జ్యోతిషం విషయంలో సరైన, సమగ్రమైన చదువు, అవగాహన అవసరం.

సరైన డాక్టర్, సరైన ఆడిటర్, సరైన లాయర్, సరైన ఎలక్ట్రీషన్, సరైన డ్రైవర్ కానివాళ్లవల్ల ఎంత హాని జరుగుతుందో సరైన జ్యోతిష్కులు కాని వాళ్లవల్ల కూడా అంతే హాని జరుగుతుంది.

జ్యోతిష్కుల విషయంలో అప్రమత్తత

జ్యోతిషం పట్ల నమ్మకం ఉన్నవాళ్లు జ్యోతిష్కుల విషయంలో అప్రమత్తతతో వ్యవహరించాలి. సరైన, మేలైన జ్యోతిష్కులను ఎంచుకోవాలి. మౌలికమైన విషయాలు కూడా తెలియని, సరైన తెలివి, తెలివిడి లేని, శాస్త్ర జ్ఞానం లేని, అనుభవ జ్ఞానం లేని జ్యోతిష్కుల(?) పేలాపనలకు, అజ్ఞానానికి, అతి తెలివికి వ్యక్తులకు మనం బలి కాకూడదు. గోచార ప్రభావం విషయంలో జ్యోతిష్కులు అనబడుతున్న వాళ్ల అజ్ఞానానికి, అతి తెలివికి ఎవరూ ఎర కాకూడదు.

తథాస్తు తథాస్తు తథాస్తు.

శుభం భూయాత్

- రోచిష్మాన్
9444012279

నా భర్త మృతి విచారణపై నమ్మకం ఉంది

మొదటి పేజీ తరువాయి..

పూర్తి నమ్మకం ఉందని... పోలీసుల విచారణ సక్రమంగా జరుగుతుందని... బాధలో ఉన్న తమ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉందని వారిద్దరు చెప్పారు.

చెలరేగే శక్తులకు చెప్పుదెబ్బ

పాస్టర్ కుటుంబసభ్యులు తాజాగా విడుదల చేసిన వీడియోతో.. పాస్టర్ ప్రవీణ్‌ది హత్యేనంటూ, ఇప్పటివరకూ గత్తర చేస్తున్న వైసీపీ అనుకూల క్రైస్తవ సంఘాల నోళ్లు మూతబడినట్లయ్యాయి. తన భర్త-అన్న మృతిపై ఏపీ సర్కారు చేస్తున్న దర్యాప్తుపై తమకు పూర్తి నమ్మకం ఉందంటూ వారు చేసిన ప్రకటన.. ఈ మృతిని రాజకీయంగా వాడుకునేందుకు, ప్రణాళికలు రూపొందిస్తున్న వైసీపీ శక్తులకు చెంపపెట్టుగా మారింది. అయినా సరే.. తన భర్త మృతిపై ఏపీ ప్రభుత్వ విచారణపై నమ్మకం ఉందని, స్వయంగా పాస్టర్ ప్రవీణ్ భార్య జెస్సికా-తమ్ముడు కిరణ్ స్పష్టంగా చెప్పినా.. ఈ శక్తులు కుదరదంటారేమో చూడాలి.

ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నేతలతో కేసీఆర్ భేటీ

- బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల నిర్వహణపై చర్చ

హైదరాబాద్: బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ నిర్వహణ నేపథ్యంలో ఉమ్మడి మెదక్,నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలతో, అధినేత కేసీఆర్ బుధవారం ఎర్రవెల్లి నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె టి రామారావు, మెదక్ జిల్లా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్,ఎమ్మెల్యేలు సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కె. ప్రభాకర్

రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి,సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి, మాజీ

ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, ,భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు జైపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్,గణేష్ బిగాల గుప్త, గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హనుమంత్ షిండే, నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు అశన్న గారిజీవన్ రెడ్డి, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు ముజీబుద్దీన్, ఆయేషా షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మిమ్మల్ని చూస్తుంటే గర్వంగా ఉంది

తాడేపల్లి: ఇవాళ మీ అందరినీ చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. కారణం రాజకీయాలలో ఎప్పుడూ విలువలు, విశ్వసనీయత ఉండాలని చాలా గట్టిగా నమ్మిన వ్యక్తిని నేను. నేను అలాగే ఉంటాను. పార్టీ కూడా అలాగే ఉండాలని మొట్టమొదట నుంచి ఆశించాను. మీ అందరూ చూపించిన తెగువకు, స్ఫూర్తికి మీ అందరికీ హేట్సాఫ్.

మొన్న జడ్పీ,ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యులు, ఉప సర్పంచ్ స్థానాలు కలిపి దాదాపు 57 చోట్ల ఉప ఎన్నికలు జరిగితే 7 చోట్ల అధికార పార్టీకి గెలిచే పరిస్థితి లేక ఎన్నికలు వాయిదా వేశారు. మరో 50 చోట్ల వాయిదా వేసే పరిస్థితి లేకపోవడంతో ఎన్నికలు జరిపారు. అలా నిర్వహించిన 50 స్థానాలకు గానూ... 39 చోట్ల వైయస్సార్సీపీ కార్యకర్తలు గొప్పగా తెగింపు చూపించి గెలిచారు. ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే ..అసలు తెలుగుదేశం పార్టీకి ఎక్కడా కూడా కనీసం గెలవడానికి కావాల్సిన సంఖ్యాబలం లేదు. గెలవడానికి కావాల్సిన సంఖ్యాబలం లేకపోయినా సరే... ఈ మాదిరిగా మభ్యపెట్టి, భయపెట్టి, ఆందోళనకు గురిచేసి, ప్రలోభాలు పెట్టి.. ఏకంగా పోలీసులను వాడుకుని దౌర్జన్యాలు చేస్తూ ఎన్నికలు నిర్వహించారు.

ఇన్నేళ్లు ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకునే చంద్రబాబుకు నిజంగా బుద్ధీ జ్ఞానం రెండూ లేవు. ప్రజాస్వామ్యంలో మనకు బలం లేనప్పుడు ఎవరైనా పోటీ చేయకుండా హుందాగా వదిలేయాలి. కానీ చంద్రబాబు అలా చేయకుండా నేను ముఖ్యమంత్రిని, నా పార్టీ అధికారంలో ఉంది కాబట్టి.. నాకు బలం ఉన్నా లేకపోయినా ప్రతి పదవీ నాకే కావాలి, ఎవరినైనా నేను భయపెడతాను, కొడతాను, చంపుతాను, ప్రలోభపెడతాను అని అహంకారంతో వ్యవహరిస్తున్న తీరును మనం చూస్తున్నాం. ఇది ధర్మమేనా? న్యాయమేనా? అన్నది రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి.

చంద్రబాబు పాలనలో సూపర్ సిక్స్.. సూపర్ సెవెన్ గాలికి ఎగిరిపోయాయి. మోసాలుగా మిగిలాయి. ఆ హామీలు నెరవేర్చాలని కాని, ప్రజలకిచ్చిన మాట నెరవేర్చాలని కానీ చంద్రబాబు అడుగుల్లో కనిపించడం లేదు. ప్రతి అడుగులోనూ మోసం, పాలనలో అబద్ధాలే కనిపిస్తున్నాయి.

వైద్యం పరిస్థితి అలాగే ఉంది. మామూలుగా ఆరోగ్యశ్రీకి నెలకు రూ.300 కోట్లు ఖర్చవుతుంది. 11 నెలలకు నెట్ వర్క్ ఆసుపత్రులకు రూ.3500 కోట్లు బకాయిలు పెట్టాడు. చివరకు ఆరోగ్యశ్రీ కింద నెట్ వర్క్ ఆసుపత్రుల్లో పేషెంట్లకు వైద్యం చేయడానికి సుముఖంగా లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. 104, 108 అంబులెన్సులు గురించి చెప్పాల్సిన పనిలేదు.

ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేదు. రైతన్న పూర్తిగా దళారులకు అమ్ముడుపోయి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పెట్టుబడి సహాయం కింద జగన్ పీఎం కిసాన్ తో కలిపి రూ.13,500 ఇస్తున్నాడు. మేం వస్తే పీఎం కిసాన్ కాకుండా రూ.20 వేలు ఇస్తామని నమ్మబలికాడు. చంద్రబాబు వచ్చిన తర్వాత జగన్ ఇచ్చిన అమౌంట్ లేదు. బాబు ఇస్తామన్నది కూడా లేదు. మరోవైపు ఆర్బీకేలన్నీ నిర్వీర్యం అయిపోయాయి. ఉచిత పంటలబీమా పూర్తిగా ఎత్తివేశాడు. ఇన్ పుట్ సబ్సిడీ లేదు. రైతులకు పెట్టుబడి సాయం కింద డబ్బులు లేకపోగా.. వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేనిపరిస్థితుల్లో రాష్ట్రం ప్రయాణం చేస్తోంది.

తిరుపతి కార్పొరేషన్ లో 48 స్థానాలు మనం గెలిస్తే వాళ్లు ఒక్కటే గెలిచారు.అక్కడ ఈ మధ్య కాలంలో డిప్యూటీ మేయర్ ఎన్నికలు జరిగితే... మన కార్పొరేటర్లు ప్రయాణిస్తున్న బస్సును పోలీసులు అడ్డుకుని, కార్పొరేటర్లు, ఎమ్మెల్సీని పోలీసుల ఆధ్వర్యంలోనే కిడ్నాప్ చేశారు.ఇలా చేయడానికి సిగ్గు ఉండాలి.

విశాఖపట్నంలో ఉన్న 98 స్థానాలకు 56 స్థానాలకు పైగా వైయస్సార్సీపీ గెలిచింది.ప్రజాస్వామ్యయుతంగా వైయస్సార్సీపీ మేయర్ ఉంటే, అక్కడా అవిశ్వాస తీర్మానం పెట్టారు. మన కార్పొరేటర్లను క్యాంపులోనికి తీసుకున్నాం. వారు క్యాంపులకు పోతే వాళ్ల ఇళ్లకు పోలీసులు వచ్చి.. మీ భర్తలు ఎక్కడున్నారో చెప్పకపోతే మిమ్మల్ని స్టేషన్

కి తీసుకుపోతామని బెదిరిస్తున్నారు. బుద్ధి, జ్ఞానం ఉన్నవాళ్లు ఎవరైనా పోలీసులను ఈ మాదిరిగా వాడుకుంటారా?

అనంతరపురం జిల్లా రామగిరి మండలంలో పదికి తొమ్మిది స్థానాలు మనవి.వాళ్లు ఒక్కటే గెలిచారు. సంఖ్యాపరంగా చూస్తే మనమే గెలవాలి. కానీ అక్కడ ఎస్ ఐ పోలీసు ప్రొటెక్షన్ ఇచ్చినట్లు నమ్మించి...మన తొమ్మిది మంది ఎంపీటీసీలను ఆయనే కిడ్నాప్ చేశాడు. వీడియో కాల్ లో అక్కడ లోకల్ ఎమ్మెల్యేతో మాట్లాడిస్తున్నాడు. అయినా మన ఎంపీటీసీలు వినకపోవడంతో మండల కేంద్రంలో వీళ్ళను నిర్బంధించి బైండోవర్ కేసులు పెడుతున్నాడు. దీనిపై మన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ధర్నా చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అంతటితో ఆగకుండా ఆ మండలంలో భయం రావాలట... అందుకోసం లింగమయ్య అనే బీసీలీడర్ ని హత్య చేశారు. పోలీసుల సమక్షంలో చంద్రబాబు నాయుడు గారు ప్రతి నియోజకవర్గంలో ఇలాంటి చర్యలు చేయిస్తున్నాడు. ఇదా ప్రజాస్వామ్యం.

స్వయంగా చంద్రబాబు సొంత నియోజకవర్గంలోని రామకుప్పంలో 16కి 16 ఎంపీటీసీలు మనం గెలిచాం. అక్కడ ఎంపీపీ పోస్టు మనకి రాలేదు.6 మందిని ప్రలోభపెట్టగా..మిగిలిన వాళ్లు

మనవాళ్లే. అక్కడ మనవాళ్లు ప్రయాణిస్తున్న బస్సును పోలీసులే అడ్డుకుని... కౌంటింగ్ దగ్గరకు పంపించకుండా చంద్రబాబు ఆపించాడు. అక్కడ కోరమ్ లేకపోయినా 6 మందే ఉన్నా వాళ్ల మనిషే గెలిచినట్లు డిక్లేర్ చేశాడు.

కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గం గోపవరంలో ఉప సర్పంచ్ ఎన్నికలు చూస్తే.. మనం 19 గెలిస్తే... వాళ్లు నలుగురిని ప్రలోభపెట్టారు. మన 15 మందిని పోలీసులే బందోబస్తు ఇస్తామని తీసుకుని పోయి... టీడీపీ సభ్యులున్న చోట విడిచిపెట్టారు.అంటే టీడీపీ వాళ్లు దౌర్జన్యం చేయమని వదిలేశారు. కౌంటింగ్ హాల్ లోకి వెళితే మన వాళ్లను లోపలకి పంపించరు కానీ.. వాళ్లను పంపిస్తారు. అక్కడ నకిలీ వార్డు మెంబర్లతో ఐడీ కార్డులు తయారు చేశారు. అదే విషయం ఎన్నికల అధికారికి చెబితే అప్పుడు ఎన్నిక వాయిదా వేశారు. మరలా రెండో రోజు ఎన్నికలకు పిలిచి... ఎన్నికల అధికారికి గుండెపోటు అని వాయిదా వేశారు. బలం లేనప్పుడు ఇలాంటివన్నీ చేస్తున్నారు.

ఇక తుని నియోజకవర్గంలో 30కి 30 మనమే గెల్చాం. వాళ్ల దగ్గర బలం లేదు. అయినా వైస్ చైర్మన్ పోస్టు వాళ్లకే కావాలని అడ్డంకులు సృష్టించి, వాయిదాల మీద వాయిదాలు వేశారు. చివరకు మున్సిపల్ చైర్మన్ మహిళను బెదిరించి.. రిజైన్ చేయించేటట్టు చేశారు.

అత్తిలిలో చూస్తే... అలాగే అత్తిలిలో 20 స్థానాలకు మనం 16 గెలిస్తే.. వాళ్లు 4 గెలిచారు. ఒకరు డిస్ క్వాలిఫై అయితే.. మన బలం 15, వాళ్లు నలుగురు ఉన్నారు... అంటే అక్కడ ఎన్నికల్లో మనం గెలవాలి.వాళ్లకు నెంబర్ లేదు కాబట్టి ఎన్నిక జరపకుండా వాయిదా మీద వాయిదా వేస్తున్నారు.

ఇదీ రాష్ట్రంలో జరుగుతుంది. ఇంతటి దారుణమైన రాజకీయ వ్యవస్థల మధ్య మీ మీ ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతున్నా... మీరంతా నిలబడ్డారు.నా అక్కచెల్లెమ్మలు చాలా గట్టిగా నిలబడ్డారు. అలాంటి సంఘటనలు విన్నప్పుడు చాలా సంతోషం అనిపించిన సందర్భాలున్నాయి.

ఇలాంటి ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో... ఈ ఎన్నికల్లో మీరు చూపించిన గొప్ప స్ఫూర్తితో చంద్రబాబు అనే వ్యక్తి ఇలాంటి తప్పుడు పనులు చేయడం తప్పు అనే సందేశం మీ ద్వారా వెళ్లింది. చాలా సంతోషం. రాబోయే రోజుల్లో మీరు చూపించిన ఈ స్ఫూర్తి చిరస్థాయిగా నిలబడుతుంది.

కష్ట సమయంలో ఉన్న కార్యకర్తకు ఒక్కటే చెబుతున్నాను. ఈ కష్ట

కాలంలో మీరు చూపించిన ఈ స్ఫూర్తికి, ఈ నిబద్ధతకు మీ జగన్ ఎప్పుడూ మీకు రుణపడి ఉంటాడు. రాబోయే రోజులు మనవే. కళ్లు మూసుకుంటే మూడేళ్లు గడిచిపోతాయి. ఈ సారి కచ్చితంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండ మెజారిటీతో అధికారంలోకి వస్తుంది. ఈ సారి వచ్చినప్పుడు మీ జగన్ కార్యకర్తల కోసం కచ్చితంగా ఉంటాడు. జగన్ 1.0 పాలనలో కార్యకర్తల కోసం చేయాల్సినంత చేయలేకపోయి ఉండవచ్చు.

మనం అధికారంలోకి వచ్చిన వెంటనే కోవిడ్ వచ్చింది. కోవిడ్ సమయంలో రెండేళ్లు ప్రజల గురించి, వాళ్ల ఆరోగ్యం గురించే మొత్తం ఎఫెర్ట్ పెట్టాం. కాబట్టి కార్యకర్తలకు తోడుగా ఉండాల్సినంత తోడుగా ఉండి ఉండకపోవచ్చు. కానీ జగన్ 2.0 లో అలా జరగదు. అందరికీ మాట ఇస్తున్నాను. కార్యకర్తలకు కచ్చితంగా అండగా ఉంటాను. కార్యకర్తల కోసం జగన్ ఎంత గట్టిగా నిలబడతాడో వచ్చే ఎన్నికల తర్వాత మీ జగన్ చేసి చూపిస్తాడు.

అసలు చంద్రబాబుకు రాష్ట్రంలో ఎన్ని తెల్లరేషన్ కార్డులు ఉన్నాయో తెలుసా?. రాష్ట్రంలో 1.61 కోట్ల ఇళ్లు ఉంటే 1.48 కోట్ల వైట్ రేషన్ కార్డులు ఉన్నాయి. అంటే 90 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. రాష్ట్రంలో కేవలం 8.60 లక్షల మంది మాత్రమే ఆదాయపన్ను కడుతున్నారు. 25 లక్షల మంది ఐటీ ఫైల్ చేస్తున్నారు. అంటే 8.60 లక్షల మందికి 1.48 కోట్ల తెల్ల రేషన్ కార్డు దారులను అప్పగించాలి. అక్కడ కూడా మోసం చేస్తున్నాడు.

కేవలం 20 శాతం అంటున్నాడు. చంద్రబాబు చెప్పిన దానికి కనీసం 1000 మంది ముందుకు రారు. చంద్రబాబు చెప్పింది అవాస్తవమని, జరగదని అందరికీ తెలుసు.

సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ ఎందుకు అమలు చేయడం లేదు అంటే.. రాష్ట్రం అప్పులు రూ.10లక్షల కోట్లు అంటాడు. ఆయన ప్రవేశపెట్టిన బడ్జెట్ డాక్యుమెంట్లలోనే రాష్ట్రం అప్పు రూ.6.50 లక్షల కోట్లు అని చూపించాడు. అందులో రూ.3.13 లక్షల కోట్లు ఆయన ప్రభుత్వం దిగిపోయేనాటికి ఆయన చేసిన అప్పులు అని తెలుసు.

కానీ రాష్ట్రాన్ని భయంకరంగా చూపించాలని రూ.10 లక్షలు కోట్లు అని చెబుతున్నాడు. మరో రెండు రోజుల పోతే రూ.12 లక్షల కోట్లు అని రూ.14 లక్షల కోట్లు అని చెబుతాడు. కారణం సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు ఎగ్గొట్టడానికే ఈ దిక్కుమాలిన అబద్ధాలు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో వైయస్సార్సీపీకి చెందిన నా అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలు నాకు అండగా నిలబడుతున్నందుకు మీ అందరికీ మరొక్కసారి హేట్సాఫ్ చెబుతున్నాను.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144